స్వభాషా [illegible] మార్గదర్శులు — భారతి — డిసెంబరు-1943 — సంపుటము-20, సంచిక-12

సంపుటము 20
సంచిక 12

భారతి

స్వభాను మార్గశీర్షము
1943 డిసెంబరు

పిచ్చితల్లి*

= శ్రీ విశ్వనాథ నరసింహము =

❀

విరియగబోసికొన్న తలవెంట్రుక లట్టిటు తూగుచుండ శ
ర్వరులను జాగరంబు ప్రచురంబుగ గన్నులు దేవురింపగన్
కరముల జేర్చిపట్టి కనుకందును మాటికి ముద్దుబాడు నా
యిరువదియేండ్ల జవ్వని యిహీ! యని నవ్వుచు నేగు దవ్వులన్.

చినిగిన చీరగంట్లు కుచసీమ బయల్పడు జీర్ణకంచుకం
బనితరవేద్యమైన హృదయార్తి నిరుద్ధగళస్వనంబు పో
షణము రవంత లేమిని కృశాంగకముల్ వెలిబుచ్చు నాతి పో
యిన నవకంబుతోడ జరియించె నపూర్వ విళంబనంబులన్.

ఖరకరు తీక్ష్ణతాపమున గందిన మో మొకయింత యేని సం
స్మరణ విహీన భ్రూమకలుషాంగకముల్ వికలావలోక సం
భరము వహించు కన్నుగవ మాటికి వందురు రుద్ధకంఠమున్
కరుణరసాకృతింగనిన కాంత వసించె మహీజమూలమున్.

---

* 'వర్డ్సువర్తు' కవి రచించిన 'మాడ్ మదర్' (Mad Mother) అను గేయమునకు స్వేచ్ఛానుసరణము.

ఆకలి గొన్న నెవ్వగ నహోయని బిట్టుగ నేడ్వరాని చీ
కాకు వహించు డెందము వికావికలయ్యె నిసుంగు పాలకై
ప్రాకదొడంగె నిట్టటు లవంబు జగంబు నెఱుంగరాని బా
ధాకరమైన దృశ్యమును తా గనజాలక మిత్రు డత్తఱిన్-

నాయనెడివారు లేక దైన్యంబు నొంది - కూటికిం గుడ్డకునుగూడ గోడుచెంది
పసినిసుంగును సాకెడు భరము దోప - నాపెయిడుముల గనలేక యస్తమించె.

వికిరసమూహముల్ గగనవీథి నితాంత కలస్వనంబులన్
బ్రకటమనోగతప్రణయభావములన్ గిచకొట్టుచు న్నియా
మక మగు గూండ్లలోపల సమంబుగ జేరె మహీజమందు నా
ప్రకృతివిచిత్రమేమొ తెలుపంగ నసాధ్యముగాదె యేరికిన్.

పశుపక్ష్యాది సమస్తజీవులు ననల్పప్రీతి సంధిల్లగా
దిశలెల్లం గలనిస్వనంబుల బ్రతీతి న్నిండి యుత్సాహమున్
విశదం బౌనటులుండ నార్తయయి భావింపంగరానట్టి సా
ధ్వససంతాప కృశాంగి యుండె నట చిత్తాబ్జంబు క్షోభింపగన్.

శూన్యత చూపుల దోపగ - దైన్యము రూపంబు గనువిధంబున నార్తిన్
వన్యవృకంబుల జిక్కిన-మాన్యమృగాంగన యనంగ మానిని కడకన్.

హృదయభరంబు తాలిమి జయింపగ జృంభితబాష్పపూరముల్
వదనము గప్పె నత్తఱి స్వభావము దాంతి వహింప కెంపునన్
గదిరె కనీనికల్ తనదు కంఠమునన్ తడియారె నొక్కటన్
పదముల తొట్రుపాటు గనుపట్ట మనస్విని జాలిదూలుచున్.

తన దురవస్థకై పొగిలి తన్వి నిసుంగును నిద్రలోగొనన్
గనుగొని బిచ్చమెత్త నరుగన్ గమకించె నభోంతరంబునన్
మినుకు వెలుంగు దోపదు తమిస్రము గాటముగాగ బోవగా
మనసు మరల్చి యాపె నిజమానసమున్ దహియించు వేదనన్.

పైటచెఱంగు నేలపయి పైచి కుమారిత నల్లనల్లనన్
వాటముగాగ దింపి నలువంకల గాంచె వియత్తలంబునన్

గాటపు జీకటుల్ బలిసె కన్గవ నొక్కట మూసి విచ్చినన్
బోటికి భేదముం గనఁగఁబోల దటంచు వచింపనయ్యెడిన్.

కజ్జలభూధరంబు లనఁగా నిసుమంతటి గుట్ట లుండె నా
పజ్జలపాదపంబులు ధ్రువంబగు చీకటికోటలయ్యె నే
తజ్జలజాకరంబు లసితచ్ఛవి దోఁగె తమోవినోదియై
గజ్జెలఁగట్టె యామిని యఖండవిలాస విహారలీలలన్.

పూనిన కౌతుకంబున నభోంతర గాఢ మలీమసచ్ఛవిన్
తాను విలాసలీల భ్రమరాళి నడంచు శిరోజపాళి తా
వీనులుగప్ప విప్పుచు గభీరముగాఁగ తమాలవాటికన్
గానవిపర్యయంబయిన నాట్య మొనర్చె దిగంగనల్ గనన్.

ఆయతమైన యంధతమసావృతరోదసి వేడ్కమీఱఁగా
స్వీయమహత్త్వముం దెలియఁజేసె దివాంధము లెల్ల పెల్లుగన్
పాయని కౌతుకంబున నవారితరీతిని కైతవంబునన్
గూయుచు నాహరించె తమి గూర్కొనరించెడి నీడజంబులన్.

పసిమిపసల్ వెలార్చు నెలబ్రాయమునందు కఠోర దుఃఖ ని
శ్వసనము నించుచున్ చిఱుతసాకు భరంబు మదిం గలంచి వె
క్కస మొనరింప సంఘమున కర్కశచిత్తుల తీవ్రచర్య మా
నస మెరియింప నామె విజనంబగు నయ్యెడ నెంచె నీఁగతిన్.

నిలువఁగ నీడలేదు జననింద భరింపఁగఁజాల నాకటన్
మలమల మాఁడుచుంటిని కుమారిత నియ్యెడ సాకుభారముం
కలచె మనంబు నన్ను కనికారమునన్ గనువారు లేరు లో
కులు పలుగాకు లయ్యె వినఁగూడని చెట్టలు పుట్టె నక్కటా.

శర్కరఖండము ల్వెలికి సౌమ్యతపైమెఱుఁగుల్ ఘటించు నా
కర్కశచిత్తులన్ వసుధ గాంచ నసాధ్యము వారితోడి సం
పర్కము లేనివారల నమాయకులన్ వ్యథలం గలంతు రా
యర్కుని బొంచి బాధ నొరయంగ జరించెడి మొండి రక్కసుల్.

పుట్టిన యింట నేను తలపూవు చలింపకయుండ దాది చే
పట్టి మెలంగుచుండ గనుపండువుగా గనువారికెల్ల న
ట్టిట్టు చరించుచుండ జనయిత్రి మనోముద మంది వింత వా
రెట్టిరొ యన్న భీతి వహియించెడి బాల్యమునందు నక్కటా.

జనకు పరోక్షమందు నను సాకె రవంత కొఱంత లేక నా
జనని సుఖంబుగా గడచె శైశవ మంత వసంత శోభలన్
గొనబువహించె డెంద మొనగూడె ప్రియ మ్మొకయింత వానిపై
మనమున విభ్రమంపు గరిమంబును దాల్చె శరీరమంతటన్.

ఎఱిగి మెఱుంగరాని వచియింపగలేని సుఖానుభూతి ము
మ్మరముగ దోచె చెయ్దముల మాటల తేటల హాయి నించె నా
దర మధికమ్ము నయ్యె సతతమ్ము జరించితి వాని పొందునన్
కర మనురక్తితోడ నయగారములన్ పచరించె నాతడున్.

ఒకదినమేని యాత డెటకో జని వచ్చుట నాలసించినన్
తికమక నంది త్రోవ గురుతించుచు వ్రేళుల లెక్కబెట్టుచున్
మొక మొకయింతగాగ జడపూల నడల్చుచు నొంటిపాటునన్
ప్రకటమనోభరంబు గనుపట్టగ నుండుదు నా దినాలలోన్.

అల్లన వాని రాక గనినంత రయమ్మున నెమ్మనమ్ము రం
జిల్లగ నేగి కంఠమున జేర్చి కరమ్ముల గాగిలింప సం
ధిల్లెడు సంతసంబు విరతిం గనరాని ప్రియోక్తులందు మే
ముల్లము లుల్లసిల్ల దడవోపక పుచ్చితి మాదివానిశల్.

ఆటమటించుచు మేము దినాంతములను - బయళులెల్ల ఝురీవారి ప్రతిఫలించు
నట్టి నిర్మల లలితదృశ్యముల సంత - సించుచుండంగ జనయిత్రి చెప్పె నిట్లు—

(సశేషము)

కళాసిద్ధి

= శ్రీ బొడ్డపాటి కుటుంబరాయ శర్మ =

రసానందము కళాభ్యాసముయొక్క యేకైకోద్దేశమనుట కళాసిద్ధివాదము. 'కళ కొఱకే కళ'[1] యను నీతత్త్వము నూతనగాని ప్రకృతిపరమావధి ప్రకృతిస్వభావనిరూపణ మైనట్లు సత్కళలకును కళాసిద్ధివినా తదితర ప్రయోజనము శూన్య[2]మని వాదించు నీసంప్రదాయమునకు జెందిన విమర్శకులను పాశ్చాత్యవాఙ్మయము 'పారసీపియను'లని వ్యవహరించును. డ్రైడను మహాకవి విశ్వసించినట్లు[3] కవిత్వము జీవమూదిన యనుకరణము గాని ప్రకృతికి ప్రతి గాదనియు, మోల్టన్ విమర్శకుడు యోచించినట్లు[4] కళలును, ప్రకృతియు భిన్నములుగనుకనే కళలు కళలగుచున్నవనియు వీరు భావింపరు. ప్రకృతివలె కళలును స్వయంభూతము[5]లనియు, స్వయంశాసితము[6]లనియు వీరి యూహ. వీరి నడకలనే వాల్టర్ పేటర్ ప్రభృత్యాంగ్ల విమర్శకాగ్రేసరులు కొంతగ ననుసరించిరి. కళలకును, తత్త్వజ్ఞానమునకును అనాదిసిద్ధమగు నొక విరోధభావ మున్న[7]దని ప్లేటో తత్త్వజ్ఞుడు పల్కిన వాక్కును వీ రపార్థము చేసికొని రని స్పష్టమగును. అందుచే సద్ధర్మోపదేశము[8] కావ్యప్రయోజన మను వాదమునకు వీ రంగీకరింపన ట్లున్నారు. అలౌకికానందసంపాదనమే సత్కళాసృష్టికి ప్రధానఫలిత మని విశ్వసించు నీ రససిద్ధివాదమను నీతిశాస్త్రము[9] రెండువిధములుగ[10] విభజించుచున్నది. కాని యిట్టి యవాంతర విభేదములతో మన కవసరము లేదు.

ప్రధానముగ కళ యాధ్యాత్మికమగుట[11] ముఖ్యావశ్యకము. అనంతకల్యాణ స్వరూపుడైన భగవంతుని నిత్యతత్త్వమును ప్రపంచకమునకు సువ్యక్తపరచుట దీనికి ముఖ్యలక్షణము. ఇందుచేతనే మానవజీవితమును

---

1. *Art for art's sake.*

2. *The end of art is art, just as the end of nature is nature.*

3. *Poetry is not a copy but a lively imitation of nature.*

4. *Art is art because it is not nature.*

5. *Self-producing.*

6. *Self-determining.*

7. *An ancient antogonism between poetry and philosophy.*

8. *Didacticism.*

9. *Ethics.*

10. *'Art for pleasure sake' and 'art for art sake'.*

11. *Art is essentially spiritual.*

సువిశాలము, పవిత్రము చేయుచున్న దను విశుద్ధమైన యర్థమునందు కళలు మతముతో నవినాభావసంబంధము గలవని యార్యులందురు. కళలు జీవితముతో కట్టుబడియుండవలెను. కళోపాసకుని యాత్మ ప్రకృతి ప్రేమాతిశయములచే నిత్యమును ప్రతిఫలితము గాదేని యతని కృషి నిష్ప్రయోజనము. ఆ కళాసృష్టియం దాంతరంగికమగు భగవత్ప్రేరణ లోపించుటయే దీనికి ముఖ్యహేతువు. ఆవశ్యకప్రేరణచే కళ యుద్భవించి, రససౌందర్యప్రశాస్తిచే నున్నతి వహించి, వృథాదాంభికరూపమున సంతరించు[12]నని 'వింకెల్మన్' పండితుడు సత్యమును చెప్పెను. ధర్మోపదేష్టృత కళలకు లౌకిక ప్రయోజనము సర్థించిన ప్రథమావస్థ యనవలెను. రససిద్ధివాదము 'ఆనందో బ్రహ్మ' యని రసానందమూలమున పరతత్త్వమును సాధించుట కర్థించుచున్నది. ఇది కళలకు ఉచ్చమైన ద్వితీయావస్థ. కనుక రససిద్ధివాదము ధర్మోపదేష్టృభావముయొక్క సంస్కరణరూప మనదగును. ప్రథమదశయందు దృష్టి లౌకికము. ద్వితీయావస్థయందు కళ కుచ్ఛ్రాయమైన పారలౌకిక దృష్టి యలవడినది. కాని ఒక్కొకపుడు ధర్మోపదేష్టృత, రససిద్ధి యను నభిరుచులు రెండును కుడియెడములుగ వెలయుచుండును. మొత్తముమీద ధర్మోపదేశ మత్యధికమైనపుడు దానికి ప్రతిఘాతముగనైన కళాసిద్ధ్యభిరుచి యుద్భవించుచుండును. ఇట్లే కళాసిద్ధి వృథాదాంభికముగ పరిణమించినపుడు ధర్మోపదేష్టృతయు ననుట సత్యసమ్మతము.

రససిద్ధిపేరట ప్రతిసారస్వతమందును కొంతగ నీతితిరస్కారము జరుగుచువచ్చినది. ఇవి యవినీతియం దసహ్యత నేర్పరచుకొనుటకు రచింపబడిన సద్ధర్మోపదేష్టృభావము గల కృతులే యని కొందఱు వితర్కింపవచ్చును. కాని యిట్టి వక్రప్రయత్నము[13] నీచకాముక[14]ఘట్టములనే యధికముగ ప్రకాశమునకు దెచ్చుచుండుటచే దీని నసుందరము, నస్వాభావికము నని యెల్లరు ద్రోచిపుత్తురు.

తెలుగుల సారస్వతమునకు కళాసిద్ధి యను నభిరుచి విశేషము పట్టుపడినది దక్షిణాంధ్రయుగముతో ననవచ్చును. ఈయుగమందలి కవితకు తంజాపురము ముఖ్యకేంద్రము. తంజాపురీరాజుల యాధ్వర్యముక్రింద వర్ధిల్లిన కవితాశాఖ యక్షగానములకు ప్రసిద్ధిగన్నది. ఈయుగమందు తంజావూరాంధ్రసారస్వతమునకు ముఖ్యకేంద్ర మంటినిగనుక మధురయు, పుదుక్కోటయు నుపకేంద్రములగును. అనగా మధురా పుదుక్కోట సారస్వత కవితాస్రవంతులు తంజాపురీగిరిజనితఝురికి రెండు వేణికలు. అధర్మశృంగార కావ్యకవుల నీ మధురశాఖకు జెందినవారని నిర్ణయింపగలము. అనతీయుగము ప్రబంధయుగమునకు 'పిచ్చితల'. కాన శృంగారరచన మతివిస్తారము. చేమకూరకవిరచిత సారంగధరచరిత్ర విజయవిలాసములును, కృష్ణాధ్వరికృత ఆంధ్రనైషధ పారిజాతమును, విజయరాఘవరచిత రఘునాథాభ్యుదయ పార్వతీపరిణయాదు

---

12. Art begins with the necessary, culminates in the beautiful and closes with the superfluous.

13 Crooked or indirect attempt.

14. Of low sensuality.

లును, కవయిత్రి రంగాజమ్మ నిర్మించిన మన్నారుదాసు విలాసము, ఉషాపరిణయము మొదలైనవియు, మన్నారుకవి చెప్పిన హేమాబ్జనాయికాపరిణయమును, కవయిత్రి ముద్దుపళని రచించిన రాధికాసాంత్వనమును, లింగనమఖి కామేశ్వరకవియొక్క శృంగార సత్యభామాసాంత్వనమును, వెలిదండ్ల వేంకటకవి ప్రణీత శృంగార రాధామాధవమును, సముఖము కృష్ణప్పనాయని అహల్యాసంక్రందన రాధికాసాంత్వనములును, శేషము వేంకటపతి వ్రాసిచ్చిన తారాశశాంకవిజయమును, వెలగపూడి కృష్ణయ వెలయించిన మాలతీమాధవీయాదులును, కుందుర్తి వేంకటాచలపతికవి వ్రాసిన మిత్రవిందాపరిణయమును, రఘునాథ తొండమానుని పార్వతీ పరిణయకావ్యమును, కూచిమంచి సోదరుల రసికజనమనోభిరామ చంద్రరేఖావిలాపాదులును దక్షిణాంధ్రయుగ మధికశృంగార ప్రవృత్తి గల దనుటకు సాక్షీభూతములు. ఈయుగమునకు మూలపురుషుడైన ప్రభువు రఘునాథనాయకుడు. ఇతడు సర్వవిషయము లందును శ్రీకృష్ణదేవరాయలకు తుల్యుడు. స్వయముగ కవి, పండితుడు, రసికుడు నగుటచే శృంగారరచనలను సర్వతోముఖముగ వెలయింపజేసెను.

తల్లికోటయుద్ధముతో విజయనగర సామ్రాజ్యపతనము ప్రారంభించినది. విజయనగరరాజుల పతనముపిమ్మట తంజావూరు ప్రభువుల కభ్యుదయము కల్గు జెల్ల రేగిన సంగతి. రఘునాథనాయకుని ప్రాపును, ప్రోపును బొంది తలప్రాణము తోకకువచ్చిన యాంధ్రసారస్వతము తంజావూరునందు ప్రథమమున జవము జీవమును గొని వికాసము జెందును. ప్రక్రియావైవిధ్యమే[15] విశేషవిలక్షణముగా గల దక్షిణాంధ్ర వాఙ్మయమందు కళాసిద్ధిరచన తలచూపినది. తంజావూరు, పుదుక్కోటశాఖలందు నీయుగ విలక్షణ మనదగు ప్రబలశృంగారరచన నెల కొనినదిగాని యందు ధర్మసౌందర్య మున్నది. కేవలము మధురకవులందే కళాసిద్ధి పేరట కొంత యధర్మశృంగారము వెలసెను. కావ్యకళకును, నీతికిని సంబంధము లేక పోవుటచే నేదో మిషపెట్టి కావ్యమందు ధర్మబోధ చేయదగినంత యవసరము లేదని యీశాఖాకవులు విశ్వసించి రనుటకు తారాశశాంకవిజయ, చంద్రరేఖావిలాపాదులు తార్కాణలు.

చంద్రరేఖావిలాపము హేళనకావ్య[16]మయ్యు తిట్టుకవితను మీరుచున్నది. ఇందలి శృంగారవర్ణన వాసిగన్నది కాదు. తారాశశాంక విజయమునందు చదువరుల కొకింత మెక్కునట్లు నాయికాసంబంధి రసభావములు వర్ణితములు. అన లీయుగకవుల కిది యొక విలక్షణము. వీరు స్త్రీపరమైన శృంగారమును బాగుగ చిత్రింపగలరు. అనగా ఆత్మజ్ఞానములేని పరజ్ఞానము గలవారు. మొత్తము మీద నీయుగకవులు కేవలము ఆనందమును లక్ష్యముగ జేసికొని తమ కావ్యములకు ధర్మసౌందర్యము[17] మాపుకొనిరి. ఇక నీకవులకు మిగిలినది కవితాసౌందర్యము[18]. ఈకవితా సౌందర్యసిద్ధిమాత్రము క్రిక్కిఱిసి పుష్కలముగ నున్న దనవచ్చును. అయ్యు నిట్టి

15. *Variety of method.*
16. *Satire.*
17. *Moral beauty.*
18. *Poetic beauty.*

యవినీతిని ప్రపంచించు కావ్యములను కాల మన్నివేళల మన్నింపలేదు. తుద కదియే దీని నేవగించుకొనును. అందుచే నీకావ్యముల కంతగ ప్రచారము రాలేదు.

ఇంతవఱకును మనము కొంతకొంతగ ధర్మోపదేశకుల పక్షము వహించితి మన దగును. ఇక కళాసిద్ధివాదుల దృష్టికూడ పరికించితిమేని రెండుపక్షములవారిని చాల వఱకు సమాధానపరపవచ్చును. కవి తన కృతియం దుద్దేశింపని సంగతిని విమర్శకు డావశ్యకముగ వాంఛించుటకు కారణము కన్పింపదు. ఉద్దిష్టవిషయము నంగీకరించి యందు లోతుపాతులు గ్రహించి లోపాలోపములగూర్చి చర్చచేయవలెనుగాని, యుగయుగములనాటి ప్రతికవియు నిట్లే యుద్దేశించితీరవలసినదని కవులను నిర్బంధముచేయుట విమర్శకున కక్కరమాలిన పని. కాళిదాస, షేక్స్పియర్ మహాకవులు కొన్నియెడల సమానవిషయముల వర్ణించిరి. కవియొక్క మూల విశ్వాసములను తాత్కాలికముగనైన మన్నించి, యాపైన నతని చిత్రణాపద్ధతియందు లోపముల నరయ నగునుగాని, నత డిట్లేల తప్పుగా విశ్వసింపవలె నని ప్రశ్నించుటకును, నతని విశ్వాసముల సత్యాసత్య సూక్ష్మవిచారణ చేసి లోపములను కనుగొని యాయాహేతువులచే నతనిని కవిగాదనుటకును విమర్శకున కేయధికారమును లేదు. వారివారి మూలవిశ్వాసములు తత్తద్దేశకాలపరిస్థితులపై నాధారపడియుండును. ఐనను కవి యెన్నడును తప్పుగా భావింపనంత సర్వజ్ఞుడని మన మేల యనుకొనవలెను? ఉద్దేశించి, భావించిన కార్యములను అవస్థానుగుణముగ, రసోదంచితముగ వ్యక్తపరచిన చాలును; కవివిధాయకము నెరవేరినదగును. ఇంతకు మించి కవిని నిర్బంధించుటకు కళాసిద్ధివాదు లోర్వరు. ధర్మోపదేశకు లధికబలశాలు రగుదురుగాక. కాని కళాసిద్ధివాదులనుమాత్రము కేవలము దుర్బలు లనలేము.



శతకవాఙ్మయము - శివతత్త్వసారము : : :

= శ్రీ బులుసు వేంకటేశ్వర్లు =

నిత్యనూతన మైన మన యాంధ్రసారస్వతారామమున నత్యంతరమణీయములై దివ్యపరిమళములను వెదజల్లినవి శతకవాఙ్మయలతానికుంజముల నావిర్భవించిన యనంతము లగు శతకకుసుమములు. తోడి ప్రబంధకుసుమసౌరభమునకుఁ గొన్నిపట్ల సీడై, కొన్నిపట్లఁ దత్సౌరభమును ద్రోసిరాజని శతకప్రసూనములు లెక్కకు మిక్కిలిగా వెలసినవి. ఇందలి ప్రథమపుష్పము నెన్ని దాని పరిమళమును గొంత యాఘ్రాణింతము.

ప్రథమశతకము

ఆంధ్రసారస్వతమున నన్నయభారతము జనించిన నూఱుసంవత్సరములకే ప్రథమశతకము పొడచూపినది. అంతకుఁ బూర్వమునైతము శతకము లుండియున్నవనుట కూహాయే ప్రధానముకాని తగిన దృష్టాంతములు లభింపవు. తొల్లిటినుండియుఁ బ్రాకృతసంస్కృతభాషలలో శతకము లుండియున్న కారణమున నాంధ్రమునందు నంతకుమున్నే శతకము లుండవలె ననుట సమంజసమే. ఐనను, మన దురదృష్టవశమున నవి కాలవాహినియందుఁ గలిసిపోయిన వనుటం క్రీ. శ. పండ్రెండవ శతాబ్దమే శతకోద్భవమునకుఁ బ్రారంభమై, 'శివతత్త్వసారము' లేక 'శివశతక'మను ప్రథమశతకమును గాంచినది.

ఈశతకము మల్లికార్జునపండితారాధ్యకృతము. శైవభక్తిప్రతిపాదకము. ఈశతకము జనించునాఁటి కాంధ్రదేశమునందలి మతపరిస్థితు లెట్లున్నవియుఁ దెలిసికొనిన, శతకోద్భవకారణములు మన కెఱుకపడును.

నాఁటి మతస్థితి

అనేక శతాబ్దములకుఁ బూర్వమునుండియు, నవఁగా క్రీస్తు జన్మింపనిక్రితమునుండియు శైవవైష్ణవమతములు కర్ణాటాంధ్రద్రవిడదేశములందు సుప్రతిష్ఠితము లయియేయున్నవి. అందు ముఖ్యముగా, శ్రీరంగక్షేత్రము కల దక్షిణదేశమున వైష్ణవమతమును, శ్రీశైలపుణ్యక్షేత్రము కల కర్ణాటాంధ్రదేశములందు శైవమతమును వ్యాపించియున్నవి. కాని, నాఁటి యాంధ్రదేశమందలి శైవులు పాశుపత, కాలాముఖ, కాపాలికాది భిన్నవర్గములలో నుండి యైక్యతఁ గోల్పోయిరి. ఈ యైక్యతామాత్రనిబద్ధులు కాని శైవు లన్యోన్యకలహములతోఁ, బరస్పరవైమనస్యములతో వారిలో వారు వివాదములకు దిగి ద్వేషించుకొనుచుండిరి. ఈసమయమును గని పెట్టి తమ జైనబౌద్ధమతములు వ్యాపింపఁ జేయుటకును, శైవమతప్రాబల్యము నణఁచుటకును సిద్ధనాగార్జునాది జైనబౌద్ధమతప్రచారకులు శ్రీశైలమును జేరి స్వమతవ్యాప్తికి సర్వతోముఖముగాఁ బాటుపడఁజొచ్చిరి. శైవుల మతవిభేదములకుఁదోడు జైన

బౌద్ధమతము లహింసాతత్త్వప్రతిపాదకము లగుట చేతను, జాతిభేదవిరహితము లగుటచేతను, మీఁదు మిక్కిలి కర్మసిద్ధాంతమును తృణీకరించినవగుటచేతను జనావళిమనముల నల్పకాలమున నాకర్షింపఁజొచ్చినవి. ఆపిమ్మట, శ్రీశంకరుని యద్వైతఝంఝామారుతము సోఁకిన వెంటనే జైనబౌద్ధమతములతోఁ బాటు శైవ మతముకూడ నొక్కపెట్టుగా సన్నగిలఁ జొచ్చినది.

మల్లికార్జున పండితారాధ్యులు

అట్టి సమయమున నాంధ్రదేశమున వెలసి చక్కని సంస్కరణము మూలమున స్వమతోద్ధరణమునకుఁ బాటుపడిన మహనీయుఁడు మల్లికార్జున పండితారాధ్యులు. ఈతఁడు బ్రాహ్మణులను, వేదములను నిందింపకుండ యుక్తియుక్తముగాఁ దన మతవ్యాప్తికీ శతకమును విరచించెను. జైనబౌద్ధమతముల వ్యాప్తికి వారు ప్రాకృతభాషలో రచించిన శతకము లెక్కువగాఁ దోడ్పడుటఁ గన్నారఁ గాంచిన పండితారాధ్యులా శతకవాఙ్మయము ననుసరించి యాంధ్రమునఁ గావ్యముకన్న శతకమే మతవ్యాప్తికిఁ బ్రబలోపకారి యను నుద్దేశముతోఁ దన మతవ్యాప్తికీ శతకమును రచించి యాంధ్రసారస్వతమున శతకవాఙ్మయబ్రహ్మత్వగౌరవమును గైకొనియున్నాఁడు.

మల్లికార్జున పండితారాధ్యులు క్రీస్తుశకము పండ్రెండవ శతాబ్దమునకుఁ జెందినవాఁడు. ఈశతకము ౧౧౬౦-౮౦ ప్రాంతమున రచియింపఁబడి యుండవలెను. ఈతఁడు గోదావరీ మండలమునఁ గల భీమేశ్వరమున భీమేశ్వరున కర్చకుఁడైన భీమనపండితునకును, గౌరాంబకును బుట్టిన ఋగ్వేదశాఖీయుఁడు. గౌతమసగోత్రుఁడు. ఈతఁడు వీరమాహేశ్వరాచారముల ననుసరించినను బ్రాహ్మణత్వమును, గార్హస్థ్యధర్మములను మాత్రము విడువనొల్లక, ఆచరణపూర్వమైన సత్యములనే తన శతకమునందు వివరించియున్నాఁడు. శతకమునందలి కొన్ని పద్యములును, జందెము విడిచి జాతిఁ బోఁద్రోలి తనతో రమ్మని పిల్చిన బసవనికి "భక్తి మీఁదివలపు బ్రాహ్మ్యంబుతోఁ బాత్తుఁ బాయలేను నేను బసవలింగ" అని యిచ్చిన సమాధానమును నిందులకుఁ బ్రమాణములు.

శతకవిషయము

ఈశతకమునందు ముఖ్యముగా పశుపాశపతిజ్ఞానము, అద్వైతమతఖండనము, జగత్కర్తృత్వవిచారము, భవాదిశబ్ద వివరణము, జగత్కర్తృ లక్షణము, శివభక్తి విభృతి, భక్తుల మహిమ, శివనిర్మాల్యము, శివదీక్షితుఁడు, శివభక్తుఁడు కాని పతి, భక్తిప్రాశస్త్యము, బాహ్యపూజావశ్యకత, శివాపచార మహాదోషము, దక్షాధ్వరధ్వంసము, ప్రళయవర్ణనము, శివగణవర్ణనము, సద్భక్తప్రశంసాదికము చక్కఁగా వివరింపఁబడినవి. మఱియు :

"శ్రీపతి వాక్పతిముఖ్యమ
హాపురుషులు నెఱుఁగనోప రతివాఙ్మనస
వ్యాపారమైన నీనిజ
రూపము నే నెట్టిదని నిరూపింతు శివా!"

అని శ్రీకారముతోడనే గ్రంథారంభము చేసి, శివమార్గమునకు, శివసంహితలకు, శివపంచాక్షరికి, శివగణములకు, శివునకు సంబంధించిన సమస్తమునకు జయ మపేక్షించి తన యఖండశివభక్తిని వెల్లడించినాఁడు.

పిమ్మట పాశుపతశైవ సిద్ధాంతము నిట్లు నిరూపించినాఁడు :

"జీవు లనేకులు పశువులు
భావింపఁగఁ బ్రకృతివికృతి బంధము పాశం
బావృతము లవఁ బశువులు
నీ వారెంటికిని పతివి..."

మఱియుఁ, బాశుపతు లద్వైతమును గర్హింతురు; సన్న్యాసమును నిందింతురు. వీరి సిద్ధాంతము లనేకములు విశిష్టాద్వైతసిద్ధాంతములను బోలును. వీరును శ్రౌతస్మార్తకర్మలతో సమానముగా నాగమోక్తములైన కర్మల నాచరింతురు. ఈవిషయము లెల్ల నిందు వ్యక్తములై యున్నవి.

ఇఁక నద్వైతమతఖండనవిషయమున శ్రీశంకరుని మాయావాదమును దన యుక్తులచే ఖండింపఁ జూచినాఁడు. అద్వైతప్రతిపాదకములగు విషయములను ద్రిప్పి ద్వైతపరములుగా నర్థము చెప్పి తన వాదమున కుపయోగించుకొనుటఁ జూడఁ జిత్రముగా

నుండును. మాయావాదఖండన విషయమునమాత్రము విశిష్టాద్వైతమును గ్రహించి మిగిలినపట్లఁ గేవల ద్వైత భావములను జూపినాఁడు. ఆతని మత మిది: "జీవుఁడు శివుఁ డను వాక్యము దోషము. జీవునకు బంధమోక్ష దశావస్థలు గలవు. శివునకు లేవు. పరమేశ్వరునకు, జీవునకు మహాధాత్రీధర, పరమాణువుల యంతరము కలదు. అందుచే జీవుఁడు శివుని వేదోక్తమార్గమున మహాభక్తితోఁ గొలిచి దేహపాశబంధచ్ఛేదనమున ముక్తి నందవలెను."

ఈ శతకమున మనము గ్రహించి యానందించ వలసినది భక్తిప్రాశస్త్యవివరణము.

"శివునకుఁ దనువును మనువును
శివభక్తులకును ధనంబుఁ జిత్తప్రీతిన్
భువి నిచ్చి యెల్లవారికి,
శివుఁడను నే ననక యునికి శివభక్తి యగున్."

అనియును,

"స్వర్గాపవర్గసుఖము ని
రర్గళసామ్రాజ్యసుఖము సాత్మజవిద్యా
వర్గాదిలోకసుఖములు
భర్గ భవత్పాదభక్తిఫలములుఁ రుద్రా!"

అను తత్ఫలితములును శతకమం దెల్ల వివరింపఁబడి నవి. ఈతని భక్తిభావము లిట్టివి: "భక్తితో భవునిఁ గొల్వనఁగాని ముక్తి లేదు. భక్తి ధర్మమువలన జనించును. ధర్మము వేదోక్తసదాచారమువలనఁ గలుగును. ఈ ధర్మాధిక్యముచే నతినిర్మలబోధయు, విరక్తియు, నిష్ఠయును గలుగును. దీనివలన భక్తి వృద్ధి యగును. శివభక్తి నరసురతిర్యగ్గర్భయౌవనస్థాది పశూత్కారములకు సిద్ధి నిచ్చును. శివభక్తి లేని వివిధాధ్వరముఖ్యసకలవేదపురాణాది విహితకర్మ లన్నియు నిష్ఫలములే" ఇట్టి మహోన్నతభక్తిభావము లేమత స్థులకైనను గ్రాహ్యము లేకదా.

పైఁ దేర్కొనినట్లీశతకము, శివతత్త్వప్రతి పాదక మగుట గ్రంథస్థవిషయ మెల్ల వీరశైవుల కత్యంతోపయోగకరముగా నుండును. అందుచే, నిఁక నీశతకమునుబట్టి శతకకర్తపాండిత్యము, బోధనాపటిమ, శాస్త్రపరిచితి మొదలగు విషయములనే కొంచి సార స్వతదృష్టితో నీశతకస్థానమును నిరూపింతము.

ఈ శతకకర్త యగు పండితారాధ్యులు దివ్య మహిమోపేతుఁడు. ఈతని మహిమలను గుఱించియుఁ, దదితరవిషయములనుగూర్చియు కీ. శే. కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారు శివతత్త్వసారపీఠికలో వివరించి యున్నారు. వారు విడిచిపెట్టిన విషయములే ముఖ్య ముగా నిం దుల్లేఖితములు.

మొదటఁ దేర్కొనినరీతిని పండితారాధ్యులు బ్రాహ్మణులను, వేదములను నిందింపకుండ తన మత మును బ్రతిపాదించినాఁడు. అందుకై తనకు వేద ప్రామాణ్యము, బ్రాహ్మణభక్తి కలదని వెల్లడించు కొన్నాఁడు. "వేదోక్తమార్గమున నత్యాదరమున నిన్నుఁ గొలిచి ... ముక్తులగుట సిద్ధము రుద్రా" యనియు, "వేదోక్తసదాచారా, పాదనమున ... పురా, పాదితదురితక్షయమా" అనియు, "జయమగు వేదంబులకును" మొదలగు ననేక ప్రదేశములందుఁ దనకు వేదప్రామాణ్యము కలదనియు, "శివమగు గోబ్రాహ్మణులకు", "జయమగు వేదాది ధర్మచరితు లకు", "వేదోక్తకర్మపరులకు నాదరమగు" మొదలగు పలుతావుల బ్రాహ్మణభక్తి కలదనియుఁ జూపి యున్నాఁడు.

అద్వైతమతఖండనము

మఱియు, నద్వైతప్రతిపాదకము లగు పరమ సత్యములను ద్వైతప్రతిపాదకములుగాఁ బ్రతిపాదించు టలో నీతని యుక్తి, వాదశక్తి, ప్రతిభావ్యుత్పత్తులు వెల్లడియగుచున్నవి. వేదవాక్యములు ద్వైతమే బోధించు ననుటయు, "తత్త్వమసి" యను సూత్రమును "తస్య త్వం అసి" అని యర్థముచేయుటయు మొదలగునవి యిందుల కుదాహరణములు. ఆయాపట్టుల నీతని బోధ కశాశక్తియు నద్భుతముగాఁ గానవచ్చుచున్నది.

"కల దననోపక లేదని
పలుకఁగ నేరకయు మూగబధిరులక్రియ ని
మ్మల నద్వైతులు తమలో
పల వగతు" రఁట.

"నిత్యమహాజనదూష్యము
ప్రత్యక్షాది ప్రమాణ బాధాబాహ్యం
బత్యనుచిత మద్వైత"
మ్మనియును,
"మాతయు మానము మేయము
ఖ్యాతిగ మిథ్య యని పల్కు పాతకు లాత్మా
ద్వైతులు ప్రమాణశూన్య..."
లనుటలోను పండితారాధ్యుల వాదశక్తికంటె వాదిశక్తియే గోచరించుచుండును.

శ్రుతిస్మృతి భాష్యజ్ఞానము

తన వాదమును శక్తివంతముగాఁ జేయుటకొఱకై పండితారాధ్యులు శ్రుత్యుక్తులనే పద్యములందు వాడి యున్నాఁడు. "మద్భక్తా న వినశ్యంతి", "లింగద్వయం సమాఖ్యాతమ్", "న మే భక్తాః ప్రణశ్యంతి", "తేనసహ సంవసేత్", "తస్మై దేయమ్, తస్మాద్ గ్రాహ్యమ్", "నకర్మణా నతపసా నజపైర్న సమాధిభిః", "రజ్జౌ సర్పా దృష్టం యథా", "పథవర్తిని తేషామ్ యథా తథా", "కుమారమపి గంతవ్యమ్" మొదలగున వెన్నియో యిందులకుఁ దార్కాణములు. వీనివలన పండితారాధ్యుల శ్రుతిస్మృతిజ్ఞానమును, మాయావాదమును ఖండించుటలో—

"నిర్వచనీయము లేక య
నిర్వచనీయంబు గలదె నిర్వచనీయా
నిర్వచనీయోత్పత్తిన
సర్వాద్వైతంబు చెడదె..."

యనుచోటఁ జూపిన యనిర్వచనీయాద్యుపపత్తులు, ప్రత్యక్షాది ప్రమాణములఁ జేర్కొన్నతఱిని పండితారాధ్యుని భాష్యజ్ఞానము చక్కఁగా విదితమగుచున్నది.

లోకోక్తులు

చక్కని కందపద్యములతో నున్న యీశతకమున మిక్కుటముగ లోకోక్తులను గ్రంథమునకు వన్నెఁదెచ్చుచున్నవి: "పువ్వులకతమున నారలు తల కెక్కినట్లు", "పలమెను ప్రత్తికినై కుల మమ్మికను పోయినట్లు", "పిండమూఁడువెట్టిన మొఱయుల క్రియ", "పుట్టవని చచ్చి చావని పుట్టెడు ప్రువ్వులవిధమున", "పీడునఁ బోసిన జలముల యుక్తి", "మసికప్పడమునఁ బొదవిన యపద్భృతమాణిక్యమట్లు", "పసిఁడి గమ్మఁగ కలచినట్లు" (బంగారమునకుఁ దావి యబ్బినట్లు) మొదలగు లోకోక్తు లెంత పురాతనములో మనకుఁ దెలియుచున్నవి.

భాషావిశేషములు

పండితారాధ్యులకుఁ బూర్వకవి యొక్క నన్నయ దక్క నిశ్చయముగాఁ జెప్పఁదగిన దే యితర కవియుఁ గానరాఁడు. నన్నయ పాటించిన లక్షణశుద్ధి, శబ్దజాలము నిందుఁ జక్కఁగాఁ గానవచ్చుచున్నవి. ఈతని కవిత్వమున భాషాదోషము లేమియుఁ గానరావు. చక్కని నిర్దుష్టశివభావ. యీతని హస్తమున నాతిశేతినది. కాని, యీశతకమునఁ బ్రస్తుతము కానరాని కొన్ని మాఱుమూలపదములు కానవచ్చుచున్నవి. కొన్నిటి యర్థములును సందేహాస్పదముగా నున్నవి. నన్నయతిక్కనల నడిమికాలపు కవిత్వమునకు నీపరిశీలనము భాషావిషయమునఁ గొంత యుపకరింపఁగలదు. 'పానలు' 'నిరాణ' 'వక్కఁడు' 'రట్టడి' 'పినుఁగు' 'బడరుఁడు' 'బత్తళి' 'తోడుకోను' 'ముద్దటలు' 'పాదతే' 'మూడుపట్టెలాడు' 'అఱిమెల్వడు' 'పాసపోరు' 'మొల్లమొఱితెయులు' 'బిలబిలినిష్ఠలు' మొదలగునవి యీ మాఱుమూలపదములు.

శబ్దార్థవిచారము

ఇందు 'పానలు' అను పద మీక్రిందిపద్యమునఁ బ్రయోగింపఁబడినది:

"ఏన మహేశ్వరుఁడన
జ్ఞానంబున నిన్ను నెఱుఁగఁజాలన యను వి
జ్ఞాన విహీనాత్ముల (చెడు)
పానలు వోవిడిచి నిన్నె భజియింతు శివా."

దీనికి శబ్దరత్నాకరకారుఁడు "వి. బ. సందేహము." అని వ్రాసియున్నాఁడు. కాని, యీప్రయోగమున నాయర్థము పొసఁగ దనుటకు సందేహము లేదు. పానశబ్దమునకుఁ గన్నడమునఁ గల 'జలమార్గ' మను నర్థమును బట్టి యిచట పానలనఁగా మార్గము లను

భాసుని నాయికలు

= కీ. శే. శ్రీ కపిస్థలం కృష్ణమాచార్యులు =

సీత:—

నవ్వుటాలకే అనుకోండి—నారచీరతో ముస్తాబై, తన వింతపోయగం చూస్తూచూస్తూ నిలువుటద్దం ముందు నిలబడిపోయింది సీత. ఆ నిలువునిద్రలో, పగటికలలలో మునిగిపోయిన ఆమెను దాసీదాని వింతపిలుపు తట్టిలేపింది. చేటిధోరణి అవకతవకగా వున్న దామెకు. నిలిచిన చోట నిలవ దెందుకూ? మొగాన ఆ వికాసం, వంటిలో ఆ వుత్సాహం—వీటి కేమిటి అర్థం?—ఏమీ? పట్టాభిషేకమా? శ్రీరా... మాస్వామికా?—ఐతే, 'మామగారికి క్షేమమేగా?' అంటుంది సీత, తెల్లబోతూ. ఔనంటుంది దాసీది. అంటే, సీతకు అంతా అయోమయంగా తోచింది.

ఆమె కొత్త కోడలు. మెట్టినింటిలో, యీ రాచనగరిలో ఆచారాలూ, వ్యవహారాలూ ఆమెకు మాత్రం అర్థంకాలేదు. కాకుంటే, యీ వింత యేమిటి?—నిక్షేపంలాంటి మామగారు అటు వుంటూ వుంటే, యిప్పు డీపట్టాభిషేకం యెందుకు పుట్టుకొచ్చిందీ? తండ్రి ఇంకావుండగానే యెవ్వరేనా కొడుకుకు పట్టంకడతారా? ఎంత అడిగినా, దాసీ దేమో పట్టాభిషేకం జరగట మన్నది నిజమేనంటుంది. ఐతే, అందరికీ నచ్చిం దన్నమాటే యిది! లోకం మెచ్చిన దాన్ని కాదనటానికి తన కేం తాహతు వుందని మహా! —అని అనుకుంటూవుంటే, తెల్లబోయిన ఆమెమనసులో పాలుపొంగింది.

అప్పుడే రాముడూ అక్కడికి వస్తాడు. అతని దుస్తులు చూస్తే, సీతకు మళ్లీ సందేహం. ఎందుకంటే, రోజూ తొడిగే దుస్తు లవి. పట్టాభిషేకమే నిజమైతే యిలా తయారౌతారా వీరు?—ఏమో పోనిద్దూ, తన కెందుకీసమస్యలు? తల దిమ్మెక్కుతోంటే. అని వూరుకుంటుంది. రాము డామెకు జరిగిందంతా చెప్పేసరికి చింతగానీ, కోపంగానీ, నిరుత్సాహంగానీ కలగలే దామెకు. "ఆహా! మళ్లీ మహారాజు మహారాజే, ఆర్యపుత్రుడు ఆర్యపుత్రుడే" అన్నప్పుడు సీత హృదయం నివాతదీపం.

వీరి ప్రణయం ముగ్ధమోహనం. వల్కలం ధరించే తొందరలో వంటిమీది నగలు ఆదరాబాదరా తీసి పెట్టేసింది సీత. చెవిలో పొమ్ములు లాగేటప్పుడు కురు లొకకొన్ని తెగిపొయ్యాయి. గాజులూ అవీ తీసుండటంచేత చేతులేమో అక్కడక్కడ పాలిపొయ్యాయి. రాముని చూపుల నీలాంటి మార్పులు తప్పుకుంటాయా? "చాల్లేద్దూ, నీవూ నీసింగారమూ—ఏం బావుందని? మళ్లీ తొడుక్కోవూ ఆపొమ్ములన్నీ?" అని బుజ్జగిస్తూ, ఆమెకోసం అద్దం పట్టుకుంటాడు రాముడు. సిగ్గులోనూ, తొట్రుపాటులోనూ వూగిసలాడుతుంది సీత.

మంథరపుణ్యమా అని అరణ్యవాసం తప్పకపోయింది. అడవికి పైనమైనాడు రాముడు. తనూ వెంటవస్తా నంటుంది సీత. సింహాలూ అవీ వుంటాయిట! అమ్మొయ్!! యిం కెలాగా? — రోసేం చంటి

బిడ్డ అనుకున్నారుకామాల్ను! ఏమైనా సరే, వారెక్కడ వుంటే తనూ అక్కడే వుండాలి; వుంటుంది-వుండితీరుతుంది. తన మాటలు నెగ్గకపోవటం చూచి, లక్ష్మణుణ్ణి అడుగుతాడు రాముడు, మరదల్ని వొప్పించమని. కాని, లక్ష్మణుడు వొప్పుకోడు. పైపెచ్చు, సమర్థిస్తాడు సీతమతాన్ని—"రాహుదోషంలో వున్నాడని చంద్రుణ్ణి అనుసరించటం మానుతుందా తార? నరుకబడ్డ చెట్టుతోటే వొరిగిపోదూ తీగకూడా? రొంపిలో దిగబడిందని గజేంద్రాన్ని త్యజిస్తుందా కరేణువు?" అని. చివరికి, ఎలాగైతేనేం, సీత వారిని అనుగమించగలుగుతుంది.

వారిప్పుడు దండకారణ్యంలో వాసం చేస్తున్నారు. గోదావరీతీరంలో, ఆ పర్ణకుటీరంలో బ్రతుకు లీలగా సాగిపోతోంది దంపతులకు. సీత తన ఆశ్రమంలో యెలదీగలకూ చిరుమొక్కలకూ నీరు పారిస్తూ, రోజురోజూ అవి మారిపోడం చూసుకుంటూ హాయిగా గడుపుతోంది కాలం. ఆమెకు అదే లోకం అవటం చూచి రాము డంటాడు: "ఏమి యీవింత—అంతఃపురంలో అద్దం పట్టుకోమంటే అలసిపొయ్యే సీత యీ ఆశ్రమంలో యెన్ని కడవలని మోస్తోంది లీలగా!"

తన అప్పటి పరిస్థితుల్లో తండ్రిగారి శ్రాద్ధం యెలా చెయ్యనా అని ఆమెతో కలిసి ఆలోచించాలని రాముడు వొకరోజు ఆమెను వెదుక్కుంటూ వస్తాడు. సీత కనబడదు. ఎక్కడికి వెళ్లిందా అని ఆలోచిస్తూ వొక చెట్టుకింద నిలబడ్డాడు. దాని వేళ్లవద్ద నురుగులతో నీరింకా తిరుగుతోనే వుంది; దప్పిగొన్న పిట్టలు చెట్టునుండి వ్రాలినా, ఆ మురికి నీటిని ముట్టుకోవు; తమ డొంకల్లో నీరు నిండటం చూచి, పురుగులేమో పాడిసేల వెదుక్కుంటూ పైకి వస్తాయి; నీరు యింకనూ యింకనూ చెట్టు మొదటిలో కొత్తకొత్తగా వలయాలే కనబడుతున్నాయి—సరే, యింకెందుకూ సందేహం?—సీత అక్కడేయెక్కడో-దగ్గరే వుంటుంది. కాస్సేపటికి ఆమెవున్న చోటికి వెళ్లి సలహా అడుగుతాడు. శ్రాద్ధం యెలా చేస్తే బావుంటుందా అని. "ఇంతేనా?—శ్రాద్ధం వైభవంతో, లక్షణంగా చెయ్యటానికి భరతుడెలాగూ వున్నాడుగా? ఇహ, యిక్కడ నీళ్లూ, పళ్లూ చాలవూ? తండ్రిగారికి యీశ్రాద్ధమే మరీ ప్రియం కాకపోతుందా?" అని సలహా యిస్తుంది సీత.

అశోకవనిక. ఎటు చూచినా అసురాంగనలే. చాలనిదానికి రావణుడు—ఎప్పుడు పట్టినా వొకే యేడుపు—ప్రేమ, ప్రేమ, ప్రేమ అని. మరేం కావాలి పాపం, సీతకు! మండుటెండలో తామరతూడే కాదా ఆమె? ఆంజనేయుణ్ణి సంశయిస్తుంది. అతని మాటలు నమ్మనంటుంది. ఆమెకు రావణుడంటే అంత భయం. అసుర యెవడో కోతి అయివుంటాడు తన్ను నమ్మించి మోసపుచ్చటానికి అనుకుంది, పాపం! వాయుసూనుడు వదులుతాడా? రామనామస్మరణ చేస్తాడు-అతని దివ్యమంగళవిగ్రహం ఆమెకళ్లకు కట్టనీ అని. అంతటితో మాయమైంది సీతశంక. "ఎవ్వడేనా కానీ, నాస్వామినామం వుచ్చరించాడు. ఇహ బదులు చెప్పకతీరదు"అనుకుంటుంది. భర్త అంటే అంత గౌరవం! తను యింత కష్టపడుతున్నప్పటికీ ఆమెధ్యానం ఎక్కడ?-నాథుని మీద. వారెక్కడ వున్నారో, ఎలా వున్నారో అని. వారికి కష్టాలే రాకుంటే, తన కదే పదివేలని ఆమె మొక్కని దైవమంటూ వుండబోదు. "నావృత్తాంతం ఎలా చెబుతావో నాయనా వారికి? జాగర్త సుమా! ఇంత మరిచావా, వారు వోర్చుకోరు" అంటుంది హనుమంతునితో. స్వామిమనసుకు కష్టం లేక చెప్పాలిట తన అవస్థలు. భర్త అంటే ఎంత భక్తి! ఎంత ఆస్థ!

రాఘుని శక్తిసామర్థ్యాలు తెలీవని కాదు సీతకు. "రావణా, నీ వొక దద్దమ్మవి. కాకుంటే, మంధర పర్వతాన్ని చేతులతో కదిలిస్తా నంటావా?" అనిందిగా. యుద్ధభూమిలో రాము డజేయుడని ఆమెకు బాగా తెలుసు. కాని, రావణుడు రామలక్ష్మణుల శిరస్సుల్లాంటివి రెంటిని తనముందు వుంచి, అవి అప్పుడే మొండెములనుండి ఖండించబడ్డాయంటే నిట్టనిలువునా కూలిపోయింది, పాపం, సీత. అందులో యేదో మోసం వుందని వోర్చుకోగల గుండెనిబ్బరం లేకపోయిందామెకు. అంటే, అది వొక లోటని కాదు ఇంతకీ. ఆమెకూడా అడుదేగా? క్షణం క్రిందటి స్థైర్య

మూ, విశ్వాసమూ అంతరించా యిప్పుడు. ఇలాం టప్పుడు అబలలేమిటి, పురుషులైనా యిలాగే తప్ప కుండా వాడలిపోతారు.

భాసుని సీత అమాయికతలో శిశువే అనవచ్చు. ఆ ముగ్ధలువోలికిన కొత్తకోడలే దండకలో సహ ధర్మచారిణి; అశోకవనికలో రసైకమూర్తి. మౌగ్ధ్యం, మాధుర్యం, లాలిత్యం, రసతృష్ణ—ఇవి సీతకడనే చేర్చుకుంది శకుంతల. గౌరవం అంటే యిదేకదూ?

వాసవదత్త:—

వాసవదత్త పతిశీల. తనకు మంత్రియెత్తు బోధపడదు. అని శంకలేదు. తన్ను పద్మావతికి అప్ప గించి వెళ్లిపోతూ యౌగంధరాయణు డన్నదేమిటి?— "నీభర్త విజయంతో నీకు మళ్లీ సౌఖ్యం" అనేగా? అం టే, అది అవటం యెలాగో, దానికీ తన దాస్యానికీ యేం సంబంధం వున్నదో అడగనేనా అడగలేదు. ఆమెకు ఆతనంటే అంత నమ్మకం! ఆమె యీవిశ్వాసంలో స్వార్థం లేదని కాదు. అది సహజసుందరం. పతికీ తనకూ అదే తారకం.

తన పతి పద్మావతిని పరిణయ మాడాడని విన్న ప్పుడు "అయ్యో, నాస్వామి వొరుల సొమ్మైనాడే" అంటుంది, పాపం, వాసవదత్త. అంతకంటే యేమీ చెయ్యలేదు; చెయ్యరాదు. తనెవరో పద్మావతికి విప్పిచెప్పి, యీపెళ్లి ఆపెయ్యజాలదు. ఆలా చేస్తేనా, మంత్రియెత్తు బూదికాదూ? అప్పుడప్పుడు తనెవ్వరో తెలిపే మాటలు నోటివెంట రాబోతుంటే, ఆపళంగా వాటి నాపి, "నాథునిపై ఈప్రేమ నాకన్నులు కప్పేనే! ఎంత ప్రమాదం!" అనుకుంటుండేది. ఒకరోజు ధారాగృహంలో—ఆ పడుకున్నది పద్మావతి యను కుని - నాథునిప్రక్కన పడుకుంది. కాని, అది యెవరో యెరిగేసరికి ఆమెగుండె అట్టే ఆగిం దంటే తప్పులేదు. ఆ అనుభూతి అలాంటిది. ఆ పూలసెజ్జ అంపశయ్య అన్నట్టు సద్రువ లేస్తూ "అయ్యో, యిది నాస్వామి!" అంటుంది, పాపం. ఆమె తలపులలో యెన్ని మెరుపులు మెరిశాయి!—"చూచారా! —గ్రహించారా? మాభావి - మంత్రియెత్తూ నశిం చాయే"—యౌగంధరాయణు డంటే అంత విధేయత! ఆమె త్యాగి. నాథుని సౌఖ్యంకోసం తను యెన్నికష్టా లని వోర్చుకోలేదు, పాపం! మరోస్త్రీతో తాను మహారాణి, హక్కులే పంచుకుందిగా!

పద్మావతి అంటే వాసవదత్తకు ఈర్ష్య లేదు. గౌరవమే. కాని ఆమె స్త్రీ; అందులోనూ యువతి. కాబట్టి, ఆమెలోనూ అప్పుడప్పుడు యువతులతో పుట్టిన గుణం మెరిసిపోవటం వింతకాదు. పద్మావతికీ, ఉదయనునికీ పెళ్లి. సవతిపెళ్లికి పూలమాలలు తనే కట్టాలీ అంటే, ఏయాడుది వొప్పుతుంది? వాసవదత్తకు ఆగతి పడితే, ఏం చేసిం దామె, పాపం? "ఇదికూడా చేసే చెయ్యాలి! అబ్బ, ఆదేవుని కెంతటి కటిగ్గుండె!" ఇంతేగా. "అయ్యోపాపం! కాదా మరి" అనమూ మనం?

ఈమెవింతకోరిక చూడండి — "భర్తగారు ప్రేమిస్తారా మిమ్మల్ని" అని అడుగుతుంది పద్మా వతిని. "ఏమోనమ్మా, నాకేం తెలుసు? నాకుమాత్రం వారులేనిదే శాంతిలేదు" అంటుం దామె. ఆ, హా! యింకేంగావాలీ? తను కోరిందీ అంతేగా? ఎంత తేలిగ్గా, యెంత నేర్పుతో నేర్చుకుం దీరహస్యం! గడుసరి అంటే వాసవదత్తే.

సీతలాగూ, పద్మావతిలాగూ, శకుంతలలాగూ వాసవదత్త ముగ్ధ కాదు; అమాయిక కాదు. ఆమె ముఖంలో పాదరసంలా చురుకుదనం మెరుస్తుంది. కాని తెలివికి దాసీ కాలే దామె. స్వామిసౌఖ్యమే ఆమెజీవితపు ధ్రువతార. ఆమెకు బ్రతుకొక తపస్సు. కష్టం యెంత వచ్చినా, త్యాగం యెంత చేసినా నిరాశా, నిరుత్సాహం అన్నవి యెరుగదు. ధీర అంటే ఆమే. ఆమె నిజంగా ఆశాజీవి. అందుచేతనే అమర జ్యోతి!*

* అనువదించింది: శ్రీకపిస్థలం శ్రీరంగాచారి.

దర్శనపరీక్ష

= 'సంపత్' =

రుద్రనేత్రం తెరచిచూస్తే—
మృత్యుగానపుటులూకాలు,
రక్తపానపుజలూకాలు,
మర్మఘాతుకశలాకాలు,

గుండెరేకులు చీల్చివేస్తూ,
జీవసారం పీల్చివేస్తూ,
స్వప్నసౌధం కూల్చివేస్తూ
హృదయమును రణభూమిచేస్తాయి.

ధ్యాననేత్రం తెరచిచూస్తే—
ప్రేమకత్తిన ధూపధూమం,
చిత్తరసఋషియజ్ఞహోమం,
సుప్తధాత్రీ స్వప్నధామం,

సకలభువనా లుద్గమిస్తూ
సోమకలశా లుద్భవిస్తూ
ఆత్మనయనా లుజ్జ్వలిస్తూ
హృదయకర్ణికలో నటిస్తాయి.

వేపరాగాల మేజువాణీ

= శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు =

నాటకం దృశ్య ప్రబంధం. దృశ్యంలోకూడా ఆదర్శమూ, ప్రత్యక్షమూ ఉన్నాయి. ఆదర్శం ఆకాశం; ప్రత్యక్షం భూమి! ఆదర్శం మానసికం; ప్రత్యక్షం భౌతికం! ఆదర్శం అటు; ప్రత్యక్షం ఇటు! కొందరు ఆదర్శప్రియులు; కొందరు ప్రత్యక్షాసక్తులు! ఆదర్శవాదుల మాటలు ఆకాశాన్ని దాటి పైకి వెడితే ప్రత్యక్షవాదులకి అసలు నోరే పెగల్దు. ప్రత్యక్షవాదుల పన్లతో భూమి నిండినా, ఆదర్శవాదులకి అసలు చెయ్యే ఆడదు. ఆదర్శవాదుల ఆలోచనలో ప్రత్యక్షవాదులు నీచులు; ప్రత్యక్షవాదుల దృష్టిలో ఆదర్శవాదులు పనికిమాలినవాళ్లు. ఆదర్శాలు లేనివాడు జీవితాభివృద్ధి ఉండదని ఆదర్శవాదుల దెబ్బలాట. ప్రత్యక్షాలు గోచరించని పక్షానికి అభివృద్ధిమాట దేవుడికి తెలుసు - అసలు జీవితమే ఉండదని ప్రత్యక్షవాదుల పక్షం. మానవులయొక్క భావనాశక్తి వ్యర్థం కాకూడ దంటారు ఆదర్శవాదులు; మానవులయొక్క వివేచనాశక్తి ఏమ్యం కాకూడ దంటారు ప్రత్యక్షవాదులు. భూతకాలాన్ని ఇవతలకి లాగి సంగతులు ఋజావుచేసుకోడానికి వీల్లేదుగనక "పూర్వం" అన్నీ ఆదర్శప్రాయంగా ఉండేవిట అనిన్నీ, భవిష్యత్తుయొక్క సైజు మనకి తెలియనే తెలియదు గనక ఆదర్శాలన్నీ రాబోయే కాలంలో అంకురాలా ఎప్పుడో ఒకప్పుడు ఎందుకు ఫలోన్ముఖానికి రాకూడదూ అనిన్నీ ఆదర్శవాదులు భూతకాలాన్ని వెనకేసుకొచ్చి భవిష్యత్తునిమాత్రమే నమ్ముతూ తమ క్రియాశూన్యత్వాన్ని సమర్థించుకుంటారు. భూతకాలం మనది కాదు గనకనున్నూ, భవిష్యత్తు మనది ఎంతవరకో తెలియదుగనకనున్నూ వర్తమానమే మనది అని వ్యవహరించమంటారు ప్రత్యక్షవాదులు. ప్రత్యక్షవాదులు ఎక్కడ పనిచేసిపోతారో అని ఆదర్శవాదుల భయం. కాని ప్రత్యక్షవాదులు పుట్టి పని మాపెట్టింతరవాతగాని ఆదర్శవాదులకి జన్మే లేదు. ఆదర్శవాదులు పనే చెయ్యలేక, చెయ్యక, బుద్ధికొద్దీ చేసినా ఎందునా బొందకుండా అవకతవకగా తగలేసి, చూసే కన్ను కళాదృష్టితో చూడలేకపోయిందనీ, వినే చెవి కళాశ్రవణంతో వినలేకపోయిందనీ ఆస్వాదకుల దుస్థితి గురించి కంట తడిపెట్టుకుంటారు. అదీకాక ఆదర్శవాదులు పరలోకసౌఖ్యమే తమ పరమార్థం అని మాటల్తో గోలచేస్తూనే ప్రత్యక్షవాదులు ఆర్జించుకునే భూలోకలాభాలగురించి కుళ్లుతారు. కేవల ఆదర్శవాదులు తాము అకర్మలో పడి ఇతరుల్ని పడగొడతారు; కేవలప్రత్యక్షవాదులు తాము పశుత్వంలో దిగి ఇతరుల్ని దింపుతారు. చేతగాని ప్రత్యక్షవాదులు మతం మారి ఆదర్శవాదులు కావడం జరుగుతుంది; వాతగాని ఆదర్శవాదులు మతం మారి ప్రత్యక్షవాదులు కావడం మరోజన్మలో జరగచ్చు. ఈ ఆదర్శ, ప్రత్యక్షవాదుల సందున పడి నలిగిపోయి జనం ఉక్కిరిబిక్కిరి అవుతూంటారు. ఎవరో మధ్యనుంచి 'యోగః కర్మసు కౌశలం' అని కేకలేస్తుంటారు. 'అదెక్కడ కుదురుతుంది పోదూ' అని మరోరు సమాధానం చెబు

తూంటారు. అన్ని విషయాల్లోనూ సంగతి ఇల్లానే ఉన్నట్టు కనిపిస్తుంది. దృశ్య విషయమైన నాటక ప్రమేయంలో కూడా స్థితి ఇల్లానే ఉంది.

ఇదివరకే నాటకవిషయంలో బోలెడు ఆదర్శాలు ఉన్నాయి. "విష్ణువు వేషధారి, శివుడు నర్తకుడు, పార్వతి నర్తకి, నంది తల ఊగించాడు. బ్రహ్మగారు నాలుగు వేదాలూ రాగాలుతీశాడు. నారదుడు జంత్రగాత్ర కలహాలు విశోయించాడు. సరస్వతి సంగీతసాహిత్యాలు జోడించింది. మయుడు శిల్పి. అనగా వేషం, నృత్యం, అభినయం, శ్లోకం, గానం, కీర్తన, శిల్పం—ఇవన్నీ చక్కటి సంత ర్పణభప్పళంలాగ మేళవించి 'నాట్యం'గా మూర్తీభ వించాయి. అవన్నీ మూర్తీభవించేదే పవిత్రమైన నాటక రంగభూమి. నాట్యశాస్త్రం రచించిన భరతుడు ముని. నాటకాలు రూపకాలు. పదిపన్నెండు రకాలుగా వెనక ఉండే రీతిని తప్ప అవి ఉండకూడదు. ఉంటే చెత్తరకం అన్నమాట. పూర్వలక్షణ ప్రకారం లేని ఇప్పటి నాటకం నాసిరకం. సూచించినచోట, పదసామగ్రి చెడకుండా ఉచితంగా గానం చెయ్యాలి" అని. ఇదంతా సంస్కృతనాటకంమాట. ఇక నాటకాలు తెలుగులో పుట్టింతరవాత మరోకొన్ని ఆదర్శాలు వచ్చిపడ్డాయి. "సంస్కృతనాటక లక్షణాన్నిబట్టి తెలుగునాటకం ఉండాలి. పూర్వకాలపు ఆంధ్రఅష్టా దశవర్ణాల జనాన్నీ ఆబాలగోపాలంగా సంస్కృత నాటకాలు ఆకర్షించిఉండడం రూఢే అని మాకు తెలుసుగనక ఆనాటకాలయొక్క తెలుగువకల్లు ఇప్పటి జనం మెచ్చుగోకపోతే ఇప్పటి జనానికి కళ్లు లేవన్న మాట. (అనగా ఒక్కొక్క ఆదర్శవాదిఉద్దేశంలో: జీటివరకూ నిల్చిన ప్రతీ సంస్కృతనాటకమూ వెనక ప్రతీ ఊళ్లోనూ ఆడగా అప్పట్లో బ్రతికి ఉండే ప్రతీ ఆంధ్రుడూ రొట్టలేస్తూ గ్రహించిఉంటాడు అని గావును) సంస్కృత పాండిత్యం లేని తెలుగునాటకం వ్యర్థం. జనభాషకి నాటకభాష దగ్గిరగా ఉంటే అందులో ఏముంది? కవే సర్వజ్ఞుడు కావలసినప్పుడు నాటకకవికి ఇంకా ఎక్కువలక్షణా లుండాలి. రంగానుభవమేగాక అధమం ఆరుశాస్త్రాల్లోనూ, పద్ధాలుగు విద్యల్లోనూ (అరవైనాలు గింటల్లోనూ పోనీ), అయిదు లలితకళల్లోనూ ప్రవీణుడైతేగాని తెలుగు నాటకం రాయకూడదు! (రాస్తే వాడి చెయ్యి విరగ్గొట్టాలి). నాటకం లిపిలో ఆకారం దాలిస్తే దృశ్యప్రబంధమే. మరి ఆడక్కర్లేదు. అది ఎట్లా ఉందో చెప్పవలసినవాడికి పైలక్షణాల్లో ఏదీ అవసరంలేదు సరి గదా, ఇతర లక్షణాలు ఏమున్నా చాలు. నటించేవాడికి మొత్తం శరీరానికైతేం, మనస్సుకైతేం, ఆత్మకైతేం యాభైఆరు లక్షణా లుండాలి! ఆలక్షణాల్లో ఆఖరికి ఒకటి లోటున్నాసరే నాటకరంగంమీద నిలబడ్డాడా వాడి కాలు విరగ్గొట్టాలి. అనటుడి నటన గురించి చెప్పడానికి స్మారకంలేనివాడుకూడా అర్హుడే. నాటకం చూసేవాడు మంచి పారిషదుడు, రసజ్ఞుడు, ఇంగితవేది కావాలిగాని, సార్థకనాటకం పామరుణ్ణీ, మూర్ఖుణ్ణీ, తాగినవాణ్ణీకూడా ఆకర్షించితీరాలి. బతికి ఉండే నటుల్లో ఎవడూ సమర్థుడు లేకపోడంవల్ల కొన్నికొన్ని సలక్షణ మహానాటకాలు ఏరంగంమీదా ఆడడం పడకపోయినా సరే, అవి ఆనాటకకవుల అంతరంగాల్లో జరిగిపోయాయిగనక అవీ ఆదర్శనాటకాలే. కొన్నికొన్ని గొప్పనాటకాల్ని భౌతికంగా రూపించి చెరచకుండా లిపిలోనే ఉండనియ్యడం మంచిది. ఆడిన నాటకాన్ని మెచ్చుకున్న జనాభిరుచి నీచాభిరుచి! నాటకరంగంమీద తెలుగుపద్యాలు నటుడు పాడితీరాలి అనే మాట ముంజాపుగల భరతమునీ, వాల్మీకీ వెనకే రాశారు. మంచిపీక లేని బ్రహ్మ, నారదుడూ, నలుడూ, హరిశ్చంద్రుడూ, రాముడూ, సత్యవంతుడూ, వెంకట్రావూ, బుస్సీ, గిరీశమూ–వీళ్లంతా దిక్కుమాలిరకం! వీళ్లంతా మళ్లీ పీక ఉంది గదా అని కచేరీ చేశారా వీళ్లందర్నీ చావగొట్టాలి. నాటకం రాయమన్నవాడూ, రాసినవాడూ, ఆడించినవాడూ, చూసినవాళ్లూ పేరూ, కీర్తీ, ధనమూ, గౌరవమూ సంపాదించుకోవచ్చు. గాని నాటక వేషం కట్టినవాడుమాత్రం డబ్బు నొల్లుకున్నాసరే అపాంక్తేయుడు. వేర్వేరు నాటకాల వృత్తాంతాలు తెలిపే మాటలు వేర్వేరుగా ఉండాలి గాని వేర్వేరు పాత్రల వేషాలూ, రాగాలూ, చేష్టలూ మారకపోయినా బందిలేదు. నటుడు నాటకపద్యం ఉచిత

రాగంలో తనకీర్తిని పాడి అర్థాంగా అభినయించక పోతే తెలుగుకవిత్వం ఏకమొత్తంగా నశించి బూడిదైపోయి నాటకప్పాకలు తగులడిపోతాయి. అడేటప్పుడు కాదు, ప్రతీ ఊహాశూన్యుడూ చదువుకోడానికికూడా బాగుండే మంచి నాటకం. నాటక రచన గురించీ, నాటకప్రదర్శనం గురించీ బాధ్యతలూ, నియమాలూ, షరతులూ, సంకెళ్లూ ఉంటాయిగాని, వాటిని ఆస్వాదన చెయ్యడానికి బయల్దేరినవాడికి హక్కులు మాత్రమే ఉంటాయి" మొదలైనవి.

ఇవన్నీ, నా అల్పజ్ఞతకి స్ఫురించని ఇంకా కొన్నిన్నీ ఆదర్శాలతో గరాం లో గద్య నాటకాలతో ప్రారంభించి, ఆదాయాభివృద్ధినిమిత్తం ప్రదర్శనానికి రావలసిన పామరజన వ్యామోహానికి వీలుగా ఉండే 'పీకమంచితనం' అనే గాత్రపుసిరితో పుట్టిన వ్యక్తులు వేషాలెయ్యడానికి వచ్చినకొద్దీ గణగణ ధ్వని గల పద్యాలూ, పార్శీరసలకి ప్రతిగా టుమ్రీ, టప్పా, దరువూ, గజల్ వంటి పాటలూ తయారుచేస్తూ, జోనుపురతూ, (కీ. శే.) ఇమ్మానేని హనుమంతరావు నాయుడువంటివార్ల సలహా వినక నాటక కర్తలు సంగీత నాటకరచన చేశారు. మొత్తంమీద తెలుగులో 'నాటకం' అంటే 'సంగీత నాటకం' అనిన్నీ, 'నాటకం ఆడడం' అంటే 'నాటకం పాడడం' అనిన్నీ అర్థాలు వచ్చాయి. తెలుగు సంగీతనాటకం అరవైఏళ్ల పంట. వెయ్యిపైగా అచ్చు అయినాయి. సుమారు రెండు వందలు జనసమక్షాన్ని పాడబడ్డాయి. ఇన్ని ఏళ్ల ప్రయత్నానికి ఏడెనిమిది సంగీతనాటకాల పేర్లూ, అయిదారు సంగీత నాటకశాలల పేర్లూ, మూడు నాలుగు ఇష్ట నాటకకర్తల పేర్లూ, ఇద్దరుముగ్గురు సంగీత నటుల పేర్లూ, ఓయాభై రాగాల పేర్లూ కొంత మంది జనుల హృదయాల్లో నిల్చిఉన్నాయి. నాటకత్వం, వేషధారణం, వాచికం, ప్రదర్శకత్వం, జాతిజ్ఞానం ఎంతవరకు అభివృద్ధి అయాయో అందరికీ తెలుసు. కాని తెలుగు నాటకరంగంమీద 'క్షుద్ర రాగం' అనే నల్లమందు చాలా ఉపకారాలు చేసి పెట్టింది. నూటికి తొంభై మంది కర్తలయొక్క కవిత్వరహిత పద్యాల్ని కవిత్వంగా మార్చి వారి నాటకాలకి అనర్హరాష్ట్రాల్లో కూడా ప్రచారం తెచ్చింది. నూటికి తొంభై మంది సంగీత నటులయొక్క అభినయ శూన్యత్వాన్ని నటనగా మార్చి వారి కళకి ధనం తెచ్చింది. నూటికి తొంభై మంది సంగీత నాటక సభ్యులయొక్క అరసికతని రసజ్ఞతగా మార్చి వారి క్షణిక విమర్శయొక్క ప్రకటనకి తరుణం ఇచ్చింది. నేటికాలంలో సంగీత నాటకరచన మరి ఆగింది అని చెప్పవచ్చు. అనగా సంగీత నాటకశకం అయిపోయింది. బస్తీలలోనూ, పల్లెటూళ్లలోనూ కూడా వెనక ఉంటూండే నాటకశాలలు గతించాయి. ఆ నాటకశాలలు ఇప్పుడు లేవు. కాని మరోపనికీ మరోపనికీ ఉద్దేశింపబడ్డ శాలల్లో (అనగా టాకీ శాలలూ, సంతపాకలూ, బియ్యంమరలూ- వీటిల్లో) నేటివరకూ అడపా తడపా తెలుగు సంగీత నాటకం కడుతూనే ఉన్నారు. తోలుబొమ్మల యుగమూ, కలాపాల కాలమూ, భాగవతాల రోజులూ, యక్షగానాల దినాలూ గతించినా అటువంటివి ఎక్కడేనా, ఎవరి పురమాయింపుమీదో ఇంకా జరుగుతూ ఉన్నట్టే తెలుగు సంగీత నాటక ప్రదర్శనాలు కూడా అక్కడక్కడ ఎవరి మధ్యవర్తిత్వం ధర్మమా అని నేటికీ సంభవిస్తూనేఉన్నాయి. ఈప్రదర్శనాలు విధిగా పురాణపాత్రల సంగతులై, జనానికి కథ యావత్తూ లోగడనే తెలిసినవై, ఖరీదైన ఏవేషాలైనాసరే వెయ్యడానికి వీలైనవై, 'మంచిపీక'గలవాళ్లచేత ముఖ్య పాత్రలు ఆడబడేవై ఉంటాయి. పేరుపొందిన భ్రుకుంసుల్ని మినహాయిస్తే స్త్రీపాత్రలు స్త్రీలే వేస్తూంటారు. కాని ప్రతీపురుషుడూ నటుడు కాజాలనట్టుగానే, ప్రతీస్త్రీ నటి కాజాలదు అనేమాట నిజమైనా, స్త్రీపాత్ర ఏస్త్రీ వేసినాసరే ఒప్పుతుందనిన్నీ, ఏమైనా మంచి మేజువాణీకి లోటుండదుగదా అనిన్నీ సంగీతనాటకసభ్యుల మతం అయినట్టు వారి చర్యల వల్ల బోధపడుతుంది. పెద్ద నటుడు ప్రతీవాడూ పాతికముప్ఫైవేషాలు వేసిఉన్నవాడైనా, వాటిల్లో ఏ ఒకటిరెండింటిల్లోనో వాడికీ, పాత్రకీ కేవలాభిన్నత్వం కుదిరినట్టు జనానికి గోచరిస్తుందిగావును, వాణ్ణి ఆఒకటిరెండు పాత్రల వేషాల్లోనూ చూస్తే చాలని జనం అహోరిస్తారు. అవ్యక్తి వేషం వేసుకుని, వారి ఎదట నిలబడి, నాలుగుపద్యాలు మాటెట్టుకుని, ఆ

స్వరంతో, తన నాలుగురాగాలూ తన మోతాదు ప్రకారం (తక్కిన పాత్రలకి శూన్యం పెట్టి) పాడడమూ, ఏమన్నా రెండుమూడు పాటలు ఆంధ్రేతర గానంతో బజాయించడమూ, ఇతరప్రజ్ఞలు వాడిదగ్గిర ఏమన్నా ఉంటే ఆవేశంలోనే—నాటకం ఆపి—అవికూడా వారి కోరికచొప్పున కనపరిచి వాళ్లని ఆనందపరచడమూ— ఇదిట ఆనాధసంగీతనాటకసభలో డబ్బుపెట్టించి సభ్యత్వం కొనుక్కునేవారి ముచ్చటలు! ఆముచ్చట్లు పుణ్యమా అని, కంట్రాక్టరుయొక్క ప్రాదుర్భావం, ప్రదర్శనదినం వస్తోందనే ఘోషణా, ప్రదర్శనస్థలంయొక్క గేటుదగ్గిర గలిభీ, అధ్యక్షుడు లేని సభలో సభ్యులు ఆసీనులు కావడం, తెర లేవడం, కంట్రాక్టరుయొక్క అంతర్ధానం, నటసభ్య సంవాదం, యుద్ధం, రాయబారం, శాంతి, తిరోగమనం- ఇంత భాగవతమూ ప్రతిసంగీతనాటకప్రదర్శనంగురించీ జరుగుతుంది. ఏది ఎల్లా నాశనం అయితేం "ఆదర్శం ఎక్కడికి పోతుందీ" అనే ఆదర్శవాదు లందరికీ ప్రత్యక్షంగా నమస్కరించి, సంగీతనాటకప్రదర్శనా భాగోతంగురించి విన్నంత, కన్నంత మనవిచేస్తాను.

సంగీతనాటకంలోంచి నృత్యం వేరైపోయింది గనక, కంట్రాక్టరుకి అది తప్ప కడంవన్నీ తెలిస్తే చాలు. అందుకని అతడు సాధారణంగా తెలుగుసాహిత్యం నాటకాంతంవరకూ చదివినవాడై, అధమం ఆంధ్ర ఆంధ్రేతర దేశీయగానాలు ఎరిగున్నవాడై, అభినయవిద్య తెలిసినవాడై ఉంటాడు. అతడి బాధ ఏమిటీ అంటే, "నాటకరంగం ఎక్కి ఇన్నికళల సంపుటీ ఒకేసారి కనపరచగల సంగీతనటులు అక్కడక్కడ ఉన్నారే, వాళ్లనందర్నీ సమావేశపరిస్తే మూర్ఖజనమేకాకుండా కళాభిలాషులుకూడా రెండుమూడుగంటల్లో అనేకానందాలయొక్క నిస్థ పొందటానికి వీలుంటుంది. ఇటువంటి తరుణం ఆంధ్రజనానికి కలిగించడంకంటె, కలిగించి తద్వారా ఆంధ్రమహాజనానికి ఆనందబోధ చేయించడంకంటె, చేయించి ఆంధ్రదేశంయొక్క జ్ఞానాభిరుచుల మట్టం పైకి లేవగొట్టడంకంటె మరి మన జన్మకి కావలసిం దేమిటి?" అని! ఆపళంగా అతడు సాహసించి పేరున్న నటీనటుల్ని 'బుక్కు' చేస్తాడు. వాళ్లకిచ్చే కట్నాలు మూడువందలరూపాయిల మొదలు మూడురూపాయిల వరకూ ఉన్నాయి. మరీ గొప్పవాళ్లకి అడ్వాన్సుగా (లేకపోతే టిక్కట్లు అమ్మినాసరే ఆట కక్కున ఆగిపోతుంది!), మధ్యవాళ్లకి అర్ధకుసిగా, తక్కినవాళ్లకి వెనకనించీ అవి ముట్టుతాయి. నటులకి తమరు చెయ్యవలిసింది ఏవేషమో తెలుస్తుందిటగాని కంట్రాక్టరు రాసే ఉత్తరంలో స్థలం తక్కువకావడంచేత ఏ నాటకమో, ఏకవినాటకమోకూడా వాళ్లకి తెలియదు. నాటకకర్తదగ్గిర ఆ 'నాటకం ఆడుకోడానికి' అనుమతి తీసుగోవాలనే సందేహమేకూడా లేని కంట్రాక్టరు అదృష్టవంతుడుగనక నాటకకర్త బ్రతికిఉన్నా సరే వాణ్ణి హెచ్చరించకుండానే ప్రదర్శనం ఖంజాయింపుచేస్తాడు. లిఖితానుమతి ఉండాలిగావునని తెలిసినవాడు (ఆడేదానికీ పుస్తకానికీ సంబంధం లేకపోయినా) అది సంపాదిస్తాడు. పదిహేనురోజులు కద్దనగా, కంట్రాక్టరు ఘోషణ ప్రారంభిస్తాడు. రాష్ట్రీయస్థానికపత్రికల్లో వేయిస్తాడు. కరపత్రాల్లో కొట్టిస్తాడు. కాకితంలేని చోట ఖర్చుతగ్గడానికి రావిఆకుమీద వేయిస్తాడు ("అశ్వత్థం ప్రాహు రవ్యయం" అని అతడికి తెలియబట్టి!). కాఫ్యాలయాలదగ్గిర అట్టలు కట్టిస్తాడు. గోడలమీద అంటిస్తాడు, రోడ్లమీద పామిస్తాడు, సినీమా 'ఇంటర్వల్'లో జొనిపిస్తాడు, కర్రఅట్టల కుర్రాళ్లచేత పాడిస్తాడు, బాజాలు వాయింపిస్తాడు, డప్పులు కొట్టిస్తాడు (పోటాపోటీలు వచ్చినప్పుడు నాటకపద్యాలు వేషధారులకంటె బాగా పాడగల డప్పు మెడలిస్టుల్ని దిగుమతీచేసి నాటకపాటనాటి పగలు వాళ్లని ఊరేగిస్తాడు), తన ప్రదర్శనానికి క్రితంరోజుల్లో జరిగే ప్రదర్శనాలవేళ హాలల్లోకి ప్రవేశం పొంది, మహాసభ్యులమీద తన ప్రదర్శనపు నోటీసుకరపత్రాలు అంజలి చల్లుతాడు! ఆంధ్రకళలమీది ప్రేమకొద్దీ సొమ్ము విరజిమ్ముతాడు. నోటీసుల్లో పురుషపాత్రల ఇంటిపేర్లూ, స్త్రీపాత్రల నవీననామధేయాలూ, వాళ్లవాళ్ల బిరుదులూ, బిరుదులులేనివాళ్లు కూడా మనవాళ్లే అనీ తనుసమర్థులనీ అభయమూ, ఖరీదుగల తనపేరు సూచించే పొడిఅక్షరాలూ, అదృశ్యలిపిలో కవిపేరూ, రేట్లూ, "సమయానుకూలంగా రేట్లు

హెచ్చింపబడే వరకూ, ఇటువంటి మేళం మళ్లీమళ్లీ అతుక్కోదుగనక జనం తొందరపడవలసిఉంటుం దనే సలహో, ఆట సుమారుగా ప్రారంభంఅయే క్షణమూ - ఇవన్నీ ఉంటాయి. రంగనక్షత్రాల్లో ఎవరైనా పూర్వం ఆఊరు వస్తాం అని కారణాంతరాలవల్ల రాలేకపోయి జనానికి ఆశాభంగం కలిగించిన బాపతు ఉంటే, ఆయానక్షత్రాల్ని, సవేమంగా, 'ఫలానా సంగీతనాటకరంగ పహిల్వాన్‌కీ జయ్' అనే కేకల్తో పేలునిబట్టి పూలదండల టాక్సీకారులోనో, కాలమానం బట్టి తోరణాల బొగ్గుబస్సులోనో నాటకంనాటి పగలు- అతడు "అనిన మాటను తప్పా టనుచితంబని" వచ్చి హరిశ్చంద్రుడైనందుకు పెండ్లి కాబోయే యువరాజునిలాగ దిగ్విజయం చేయిస్తారు. రావలసినవాళ్లు సమూలంగా వచ్చేసిన సంగతి ప్రదర్శనకాలానికి ముందు మళ్లీ తెలుపుదుచేస్తారు. టిక్కట్లు ప్రదర్శనానికి వారంపదిరోజులు ముందునుంచీ అదే హాలుదగ్గిర అమ్ముతారు. కుర్చీనెంబర్ల అట్టప్రకారం రంగానికి ఎట్టఎదరగా పడ్డనెంబర్లు కొందరు జాగ్రత్తపడి కొయించుకుంటారు. ప్రదర్శనానికి పూర్వం టిక్కట్లగదిదగ్గిర రైలుటిక్కట్లగదిదగ్గిరలాగే ఆంధ్రమహాజనులు ఒకడి తరవాత ఒకడు తీరుగా టిక్కట్టు తీసుకుంటారే గాని చొక్కాలు చిరగడం, పర్సులు ఎగరడం, పిలకలు ఊడడం, ఆకేసిచేతులు టిక్కట్లిచ్చే ద్వారంలో చిక్కడి ఇచ్చేవాడి చెయ్యికూడా పట్టుగోడం వెందలైనవి సాధారణంగా ఉండవ్! తెరఎత్తడానికి గంట పూర్వమే టిక్కట్టుధరలు లేచిపోతాయి. దాన్తో ప్రదర్శనం గొప్పగా ఉంటుం దనే ఆశా, చూడాలని కుతూహలమూకూడా కొందరు జనానికి హెచ్చిపోతాయి. గేటుదగ్గిర తోపిడి జరుగుతుంది. అక్కడికి మఫ్టీగానూ, డ్రెస్సులోనూ కూడా పోలీసులు అనేకకళల సంపుటే అయిన ప్రదర్శనం శాంతియుతంగా జరగాలనే అభిమానంతో వస్తారు. సకాలంలో టిక్కట్టు కొనుక్కున్నా, వీరు లోపలి హాలుస్థితి చూసొచ్చి జనాన్ని లోపలికి వొదల్రు. టిక్కట్లు కొనుక్కున్నవాళ్ల హక్కులుగురించి గేటు దగ్గిర ఎవడేనా వాగితే కమ్చా ప్రయోగిస్తారు. ఒకమాటు ఓపాతిక టిక్కట్ల జనాన్ని తోసేసి బేడ్రెస్సు పోలీసు ఇనస్పెక్టరు కొట్టిన కొరడాదెబ్బలో కొంత భాగం తినడం అనే పుణ్యం నాకుకూడా పట్టి సైడుకాలవల్లో స్నానంఅంత పని జరిగింది. మరోసారి గేటుదగ్గిర పోలీసే తిన్నాడు. ఇల్లాంటివి గడిచింతరవాత, లోపలికి!

ప్రదర్శనశాలలో ఎనిమిదిగంటలు లగాయితు జనం ఆసీనులవడం ప్రారంభిస్తారు. రిజర్వుడువాళ్లులాగ సకాలానికి వెళ్లచ్చుననుకోకుండా తక్కిన క్లాసుల టిక్కట్లవాళ్లు సాయంత్రంవేళే పాడి అన్నం ఉన్నదేదో వేసుకు తిని దాహం తాగి కాలకృత్యాలు తీర్చుగుని ఎదర ఎదర వరసల్లో తిష్ఠవేస్తారు (కూచున్నచోట్నించి ఊడిరావడం ఎప్పుడో తెలియకపోడంవల్ల). నాటకశాలలే లేనప్పుడు ప్రదర్శనశాలగురించి ఎత్తుకోడం అనవసరం. కడవాడికికూడా శబ్దం స్పష్టంగా వినపడాలంటే శాలపొడుగు ఇంత ఉండాలి అని ఉన్న సంగతి గమనించారా లేదా అనే, విచారానికి చోటేలేదు. టాకీహాలు ఎంతవెడల్పైనా బందిలేదు. ఎంచేతంటే, మాసీది యావత్తూ తెరమీదే పడడంవల్ల. కాని తెరయొక్క బారుకి నాలుగురెట్లు హాలువెడల్పుండి, సగాన్ని మించిన గొయ్యి నేలకి ఉండి, గోతిలో కుర్చీకి కుర్చీకి సందున ముందువెనకలగాని, కుడి ఎడమల్నిగాని కాళితంగాని, దారంగాని పట్టడానికి వీల్లేకుండా ఉండే సదుపాయం సభ్యులకి ఏర్పాటుఉంటే, బుర్ర లేక ప్రదర్శనానికి వెళ్లినందుకు కాళ్లు పోయి ఇంటికెళ్లాలి. శాలాప్రవేశం పెందరాళే చేసినవాళ్లు పెందటితెర లేసి చూస్తూ, యథాశక్తి ధూమపాన తాంబూలచర్వణ నస్యగ్రహణాదికం కానిస్తూ, మధ్యమధ్య అరుస్తూ కబుర్లు చెప్పుకుంటూ, ఇదవుతారు. ప్రకటనవేళకి హాలు నిండి జనాన్ని కక్కుతూ ఉంటుంది. జనం మాంచి కావకట్టినట్టు వేండ్రంలో పడిపోతారు. సోడా, కిల్లీ, సిగరెట్‌వంటివాట్ల సరఫరాదార్ల వింతైన నడకా, సువాసనగల దుస్తులూ, కోమలమైన గాత్రాలూ గోచరిస్తాయి. ఇక సంగీతనాటకసభకి వచ్చేవార్ని కేటాయించడం కష్టం. తెలుగువాళ్లయిన (లేక తెలుగు వచ్చిన) స్త్రీలూ, పురుషులూ అని ఒక విభజన! అయితే, ఓనాడు ఇద్దరు వర్షధరులొస్తే వార్ని గమనించడమే కొందరికి నాటకం అయింది గనక వాళ్లూ రావచ్చు! రిజర్వుడు, కుర్చీ, బెంచీ, చాప అనేది చెల్లించ

కలిపిన సామ్యంతుబట్టి విభజన. కాని చాపమీద చదవగలవాళ్లూ, రిజర్వుడులో చదవలేనివాళ్లూ ఉండవచ్చు గనక అదీ తేలదు. అంతా స్పృహగలవాళ్లేనా అంటే స్పృహలేనివాళ్లుకూడా రావచ్చు. మెలకువగా ఉండే వాళ్లేనా అంటే కొందరు నిద్రపోతూ చూడ్డానికీ, వినడానికీ తమకి హక్కుందిట, ఆహక్కు డబ్బెట్టి కొనుక్కుంటారు. సభకి సక్రమత్వం, జరుగుబాటూ ఉండాలంటే ఓ అధ్యక్షుడు ఉండాలి. సాధారణంగా సంగీత నాటకసభ అనాథసభ. నాటకరచన ఎవడి పేరూ లేక అనాథగా ఎల్లా ఉంటుందో, నటవర్గశిక్షణ ఎవరి పేరూ లేక అనాథగా ఎల్లా ఉంటుందో ప్రదర్శనం వీక్షించే సభకూడా అంతే! ఈ సభలో సభ్యులంతా ఆదర్శవాదులు చెప్పే సకల కళా సన్నిపాతత్వంచేత పావనమైన నాటకరంగం ఎక్కే సార్థక నటుడుయొక్క అవ్యవస్థ గురించి సానుభూతి కలిగి, వాడి అవస్థలో తమరుకూడా పడి ఆనందిస్తూ తద్వారా మానవప్రకృతీ, జీవితంయొక్క సుఖదుఃఖ సమ్మిశ్రితత్వం, పాపభంజనం, సత్యవిజయం, సకలజీవ సమత్వం, మిథ్యాసంభవాలవల్ల యథార్థ రసోదయం మొదలైన మహావిషయాలు తెలుసుకుని ఉండడమే కాదు, కవనగానాభినయాల మేళవింపు విని, తక్షణం గ్రహించి, విరుపులూ, అంకులూకూడా కటాక్షించే సామర్థ్యంకూడా కలిగిఉంటారు. అర్ధవేళపట్టున వస్తారు రిజర్వుడువాళ్లు. గేటువాడు వాళ్ల నెంబరు చూసి, ఆ నెంబరు కుర్చీ ఉంటుంది వెతుక్కుని కూచోమంటాడు. వెతకాలి. తను రాడు, ఇంకోణ్ణి పంపడు. ఏమంటే, వెతుక్కోడానికి వెళ్లేవాడు కూచున్నవాళ్ల మోకాళ్ల చిప్పలు ఊడగొట్టాలి; వాళ్లు తమ ఎదటికీ, ఎదటివాళ్లు వెనక్కీ రిజర్వుడువాణ్ణి నెట్టేసరికి వాడు అప్పడమేనా అవుతాడు, వాడి మడుసులేనా విరుగుతాయి. వాణ్ణెల్లి బుక్కింగువారితో మొర పెట్టుకుంటే "సరిగ్గా చూడవయ్యా, ఆకుర్చీ అక్కడే ఉంటుంది" అంటారు. వాడు ఖాళీగా ఉండేచోట, అనగా ఏ ఆఖరు క్లాసులోనో తలదాచుకుంటాడు. ధనికులూ, సాహుకార్లూ, వర్తకులూ, నౌకర్లూ, సర్వర్లూ, దర్జీలూ, పై ఆర్జన గల గుమాస్తాలూ, పాటక జనమూ- టిక్కట్టు ఎంతైనాసరే, అందులో ఈరోజుల్లో, పారేసి, సర్వకళాసారం గ్రోలడానికి వస్తారు. అక్కణ్ణించి ఇంకా కళారాధన చేస్తూండే వ్యక్తుల యొక్క శాలాప్రవేశం గోచరిస్తుంది. వాళ్ల నిమిత్తం గోతులో వరసముందు వరస కుర్చీలు సృష్టింపబడి పడిపోతాయి. స్థలయజమానులూ, శాలాయజమానులూ, ఆయాపరికరాల యజమానులూ కూడా మంచి కళా దృష్టితో వస్తారు. అసలు అధికారులుకూడా వచ్చేస్తారు- వినోదసుంకం శాఖవారూ వాళ్ల దండూ, రివిన్యూఉద్యోగులూ వాళ్ల సిబ్బందీ, పోలీసుఆఫీసర్లూ వాళ్ల బలగమూ, పురపాలకవర్గమూ వాళ్ల సత్తరకాయలూ, ఆరోగ్య శాఖా వాళ్ల అనుచర్లూ — ఇల్లాగ్గా అందరూ కూడా మహత్తరమైన ఆంధ్రభాషాభిమానంతో నాటకకళని ఉద్ధరించే అభిప్రాయంతో వ్యయప్రయాసల కోర్చి వస్తారు. వాళ్లు శాలలోకి వచ్చే కాలంలో కంట్రాక్టరు స్థూలశరీరంలోనే కనిపిస్తాడు. మరీ ఆలస్యంగా వచ్చేవాళ్లని రంగానికి కుడీఎడమల్నీ కూచోపెడతారు. వాళ్లెవరంటే, కోపంవచ్చి వెళ్లిపోతాం అని బెదిరించే అధికారులూ, అక్కర్లేనంత డబ్బు తమరికి వస్తూండడంవల్ల రెండెడ్లబండిమీద ఎక్కి, పదిహేను మైళ్ల దూరాన్నించి తండాలుగా వచ్చి టిక్కట్టు ఖరీదు ఎంతైనా సరే పారేసి ఎక్కడైనా సరే కూచునిచూస్తాం అనే పల్లెటూరి రకమూ, నటీనటుల మోహనాటక్షులూ మొదలైనవాళ్లు. ఇదంతా అయేసరికి అన్నవేళ దాటిపోతుంది. జనం కేకలూ, రాగాలూ ప్రారంభించి, ఒక్క దరువేసి కొన్నిరకాల కూతలూ, ఈలలూ, అతిమార్దవంగా, శ్రావ్యంగా వినిపిస్తారు. అప్పుడు లోపల్నుంచి గంట వినిపిస్తుంది. సమయానుకూలంగా మూడు నాలుగు గంటలు అల్లా వినిపిస్తుంటాయి.

తెరవెనక సంగతులు రహస్యాలు గనక అస్త దారులకి అది అగోచరం. 'ప్రాంప్టింగు' అచ్చుగున్న వాడు పుస్తకం చేతబట్టి తిరుగుతూ రంగనక్షత్రాల్నీ, రంగతారల్నీ ఎవరెవరు ఏ వేషమో గ్రహిస్తాడు. ఒక్కొక్కప్పుడు ఆ నాటకం వేర్వేరు కవుల పుస్తకాల్నించి తయారైనవాళ్లు 'బుక్కు' అవుతారు. 'బుక్కు' అంటే ఆదో అర్థం గావును. ఏయే రంగాలూ, వేషాలూ ఉంటాయో పోతాయో దైవా

జీవం. కొందరికి పాడరు పూస్తా ఆరాత్రి వాళ్లు ఏవేషం వెయ్యవలసిఉంటుందో చెబుతారు. అనుకున్న వాళ్లలో ఒకరిద్దరు అంతరకారణాలవల్ల రాలేక పోతే తట్ట తగలెయ్యడానికి కంట్రాక్టరే వెళ్లి స్థానిక నటుల్ని పోగుచేసుకొస్తాడు. డబ్బు కక్కుర్తిపడి, వాళ్లు, సభవాళ్లు వద్దంటూన్నా, తమ నాట్యకళ చూపించి మరీ చెడతారు. పెద్దవేషాలవాళ్లు తమ పాత్ర వచ్చే రంగా లంటే చాలంటారు. అంతేకాక తక్కువ వేషాలు పాడైతే గాని తనవేషం ఫస్టుగా ఉండదుగనక, అవతలవాణ్ణి పూర్తిగా మాట్లాడనియ్యకుండానో, అందులోలేని ముక్క వాడికి అందించో, వాడు ముందుకొచ్చి ముక్క చెప్పకుండా చేసో, అవతలవాడికీ మంచిపేరయితే పద్యభాగాలు తగ్గించో, తీసేసో చాలా అప్యాయంగా మరమ్మతుచేస్తారు. ఒక్కొక్కప్పుడు ఇక తెరతీచే టైంలో హార్మోనిస్టు వెళ్లిపోతాడు. దాంతో సంగీతనాటకానికి మృతి సంభవిస్తుం దనే భయంతో కంట్రాక్టరు వెళ్లి అతడి కాళ్లావేళ్లా పడి అతణ్ణి పట్టుగొస్తాడు. సరిగా తెర తీచేముహూర్తానికి కంట్రాక్టరు తన సొమ్ము లెఖ్ఖచూసుకుని, అది మరీ ఎక్కువగా ఉంటే అది పుచ్చుకుని తక్కువ రిజర్వుడువర్గారా టిక్కట్లు పెట్టి అక్కడ వొదిలేసి (ఒకచోట అవి అల్లా ఒదిలెయ్యగా, బలంగలవాళ్లు అవి పుచ్చుకుని వెంటనే చేసికీ, పావలాకీ వాటిని అమ్మేసరికి హాలులో కంటె రంగంమీదే జనం ఎక్కువయారు), ఇప్పుడే వస్తానని చెబుతూ, అంతర్ధానం అయిపోతాడు. కొన్నిచోట్ల తెర ఎత్తుతా రనగానే, కంట్రాక్టరు తన బుక్కింగు గదికి తాళంవేసి, పెట్టె పుచ్చుకుని పరారీ అవుతాడు. ఆ పెట్టెపళంగా వాడు పందులంట ఘాడు తీస్తాంటే ఒక ఊళ్లో వాణ్ణి సభవాళ్లు లేచివెళ్లి వెంట తరిమిపట్టుగొని వెనక్కి లాక్కొచ్చారుకూడానూ! నాటకం ప్రారంభించకుండానే "ఫలానా ప్రధానవేషధారి అనివార్యకారణాలచే ఈవేళ రాలేదు, అంచేత ఫలానా వారిచేత ఆపాత్ర ఆడిస్తున్నాం" అని మరో ప్రధాన వేషధారి వచ్చి చెబుతాడా, నాటకసభ్యుల గోల వెంటనే మొదలై, ఓపట్టాన తెరే లేవదు. "అల్లా పనికిరాదురోయ్, ఏడిశావు వెళ్లరోయ్, నువ్వెవడవురోయ్, కంట్రాక్టరు ఏడిరోయ్" అని సభ్యులు వినయపూర్వకంగా వాణ్ణి మందలించి డబ్బు వాపసుకోరతారు. సరి, వచ్చేదీ, అది అప్పుడే అయిపోయుంటుంది. అందువల్ల కంట్రాక్టర్ని రంగంమీదికి ఈడుచుకొచ్చి రెండు మూడుగంటలు తర్జనభర్జన పడి రాతికి వస్తారు. దత్తమండలక్షామనివారణకో, దత్తమండలాలవాళ్లు ఇంతా చేసి ఆంధ్రులేకనక వాళ్ల మాట అల్లా ఉంచి పోనీ విధిగా ముందు బెంగాలుక్షామనివారణకో, ఆకస్మిక ధనికుడైన ఆకంట్రాక్టరు కొంత చందా ఇచ్చే షరతుకి సంగీతనాటకప్రేక్షకులు ఒప్పుకుని తమఔదార్యం చూపిస్తారు. అక్కణ్ణించి ఎల్లానో సంగీతనటులు నాటకరథాన్ని ఈడవడం మొదలెడతారు. ఆరథం జరగదు. ఆపద్ధర్మంగా వేషంవేసినవాడొచ్చినప్పుడూ, కాకిగాత్రం గలవాళ్లొచ్చినప్పుడూ, రంగాలు దాటించేసినప్పుడూ, "నువ్వుపాడింది మాకళాశ్రవణంలో బాగా ఉంది, అదే మళ్లీ కానీరా, వేషం వేసుకున్న ఫలానా పేరింటిగాడా" అని కొందరు జనం తమ వాంఛ ప్రాకాశ్యంగా తెలియచేసినప్పుడూ, స్త్రీపురుషపాత్రధార్లు శ్రుతిమీరిన చేష్టాదికం రంగంమీద ప్రత్యక్షం చేసినప్పుడూ సంగీతనాటకప్రేక్షకులకి పండగ! నటులనబడే అల్పగాయకులు కొద్దిమంది; అనేకగ్రామాల్నించి కొట్టుకొచ్చి కలిసిన బాపతు; పనికిముందే డబ్బుతిన్న రకం; మంచిపీకనిపాకర్తలు! ఇక, ప్రేక్షకులనబడే శ్రావకులు చాలామంది; విస్తారంగా ఒకే గ్రామానికి చెందిన బాపతు; రొఖ్ఖమో దినుసో, కాలమో అధికారమో దానంచేసిన రకం; మంచి పీకనిపాకళాపిపాసులు. అంచేత, సమస్య ఏది బయల్దేరినాసరే విజయం శ్రావకులది, పరాజయం సంగీతనటులది. ఒక్కొక్కప్పుడు ప్రదర్శనం సగం జరిగిం తరవాత నటప్రేక్షకవాక్కలహం పొసుగుతుంది. ఆ కలహం వచనంలో నడుస్తుందేగాని అందులో పద్యం, రాగం, కీర్తనా ఉండవ్! ఒక పెద్ద ఘట్టం 'వన్స్‌మోర్!' అది కనిపెట్టిన పుణ్యాత్ముడు ఇంగ్లీషుచేర్చిన ఆంధ్రకళారాధకుడే. అల్పరాగనిపాలో ఒక్కొక్క సభ్యుడు మతిపోయి ఇంగ్లీషు రాకపోయినా అకేకేసి అల్లరిచేస్తాడు. 'వన్స్‌మోర్' అంటేగాని గొప్పనటుడుకాడని నాటకసభ్యుల ఊహ.

'వన్సుమోర్' అనిపించుకునేదాకా పాడే నటులున్నారు. అల్లా అనిపించుకుంటే వాళ్ల జన్మ తరించినట్టే! కొందరు సంగీతనటులకి 'వన్సుమోర్' అంటే కోపం. అది లాభంలేని కోపం! రాగప్రవాహాలో జనాన్ని పడగొట్టడంమాత్రం నేర్చి, వేషం వేసి, వేషం అంటే అన్యత్వస్వీకరణం అనే మాట నుప్పులేక, తన స్వత్వమే స్థాపించుకునే పని చేసి, ఆ అల్పప్రజ్ఞనే సకలకళాభిజ్ఞులైన సభ్యులు 'మళ్లీ కానీరా అబ్బీ' అంటూంటే కోపపడడంలో అర్థం ఏముంది? ఏసభ్యుడు వన్సుమోర్ (ఇంగ్లీషు రాకపోతే 'వనసమోడ్') అన్నాసరే వాడు నెగ్గితీరతాడు. ఒక బ్రహ్మాండ విమర్శకుడు అల్లాంటి సమయంలో లేచి అల్లా అనడం కళకి భంగం అనేసరికి అతని మొహంమీద కళపోయేలాగ అతణ్ణి బాదేశారు. క్షుద్రరాగమే అధిదైవంగా గల సంగీతనటుడు పైవేషం ఉన్నా తను తనులానే గోచరిస్తూ, డబ్బుకి గజ్జకడతాడుగనక, రసికసభ్యులు ఏం చెయ్యమంటే అది చెయ్యాలి. ఒక్కొక్కప్పుడు అదుక్కూరుని నాటకకాండ ఆపి, అతడికి ఇంకా ఏమిచ్చునో అవన్నీ అక్కడ కానిమ్మని ఆస్వాదక సభ్యులు ఆజ్ఞాపిస్తారు. అక్కణ్ణించి వెనక ఆవ్యక్తి యిచ్చిన గ్రామఫోనుపాటలూ, చేసిన భరతనాట్యం, ఊదిన ఈలపాటలు, కట్టిన మోళీలు, చూపించిన గారడీలు, తీసిన బస్కీలు, వేసిన పిల్లిమంతరాలు, గీసిన బొమ్మలూ అన్నీ వారి సమక్షంలో, తమరు ఆరాత్రి ఆవ్యక్తిని సొమ్మిసి కొనుక్కున్నారుగనక, ఇంకోసారి ఆయాపన్లు మళ్లీ జరగాలని (నాటకరంగం మీద అన్ని కళలూ ఉండాలిగనక) ముచ్చటపడతారు! ఒక్కొక్క విమర్శకుడు నాటకంపుస్తకం పట్టుకొచ్చి అందులో ఉన్నదీ జరుగుతూన్నదీ సరిపోల్తాయేమో చూస్తూంటాడు. అతడు కోరేది ఏమిటంటే, అందులో లేనివి జరగాలిగాని, ఉన్నవి మినహాయించకూడదు! అన్నిటికంటె చిత్రం వేషాలవాళ్లకీ, సభ్యులకీ జరిగే సవాళ్లు!

స—పాటలు వొదిలేశావురోయ్!

వే—అవి తీసేశాం.

స—వల్లకాదురోయ్! ఎవణ్ణడిగి తీసేశావ్?

వే—నేనూ చదివినవాణ్ణే. వాట్లబదులు గొప్ప వాక్యాలు తెచ్చాము.

విమర్శకుడు—అల్లాయితే ఒప్పుగోవచ్చు.

స—(విమర్శకుడుతో) నువ్వు ఊరుకుంటావా, నీకేమన్నా కావాలా? పోనీ, నీవెనకటిపాటలు పాడు.

వే—మళ్లీ పాడమంటే ఎల్లా, నాగొంతిక పోయింది.

స—ఎందుకు పోవాలి? నిన్న రోజూ నాటకపాట ఎవడచ్చుగోమన్నాడూ?

వే—బాగుండకపోతే మీరే కోప్పడతారు, క్షమించండీ!

స—క్షమించాం. వాడికి పార్టు రాదేం?

వాడు—నాకు పార్టు ఇవ్వలేదండి. వచ్చి ఇక్కడ నిలబడితే చాలన్నారు.

వే—కాదండీ, ఏమిచ్చినాసరే వాడు వేషం వేస్తానన్నాడు. రెండు రూపాయిలిచ్చారు.

స—అందుకే మేం గోల చెయ్యకమానం. (తక్కిన సభ్యులతో) చూస్తారేమయ్యా, వీళ్లైనంత అల్లరిచెయ్యకా! డబ్బిచ్చునని చూస్తూ కూచోడమే!

వే (౨)—మహాశయులారా! ఆగండి ఆగండి. మీరు నాకోసమేగదా వచ్చింది!

స—ఛీఛీ! మేం నీకోసం ఎంతమాత్రం రాలేదురోయ్!

ఈపాటికి రేకుల పాకమీద కంకరరాళ్లు దూరాన్నించి పడడంవల్ల లోపల కేకలమూలాన్ని అవి పైకి లేచిపోకుండా నిలుస్తాయి. ఆదెబ్బల్తో గేట్లు బరాబర్ గా వదిలేస్తారు. డబ్బూ, అధికారమూ, మొహమాటమూ ఏమీ లేకపోడంవల్ల పైన నిల్చిపోవలిసొచ్చి నిల్చిపోయిన జనం లోపలికి చొరబడిపోయి టిక్కెట్టు కొనుక్కున్నవాడి ఒంటిమీద పదిలంగా కూచుంటారు. లోపలివాడు ఇవతలికి వెళ్లగిలి రాలేడుగనక రాడు. వస్తే వాడి స్థలం అంతటితో ఆఖరు. ఈలైనవాళ్లు ఆ ఉక్కిరిబిక్కిరిలో ఊపిరాడక నీటిజంతువులు అప్పుడప్పుడు పైకొచ్చి గాలిపీల్చుకున్నట్టు

కాలబయటికి వచ్చి ఇంత గాలి పోసుకుని, దశ్శెట్టి తద్దినం కొనుక్కున్నాంగదా అనే దుద్ధకొద్దీ ఎల్లానో లోపలికెళ్లి మరెక్కడో కూచునో, నుంచునో సంగీత నాటకం రక్తికట్టేటట్టు తంటాలు పడతారు. సంగీత నటులకీ, ఆ పారిషదులకీ సంధానం చేయించి కంట్రాక్టరు అదృష్టవంతుడై అదృశ్యుడై మీరూ మీరూ చూసుగోండి అన్నట్టు అయిపోతాడు. ఎవర్ని ఏమని అడగడమో తెలియదు. సంగీత నాటక ప్రేక్షక శ్రావకుల స్వరాజ్యంలో రసాస్వాదన జోరై పోయి పొగలు లేగుతుంది. ఆమూమంలోనే ఇష్టులైన సంగీతనటులకి అర్హులైన కళాసముద్రులొచ్చి పూలదండలూ అవీ ఇచ్చి గౌరవిస్తారు. అల్లా అల్లా ప్రదర్శనం పూర్తిఅవుతుంది. జనం పోలోమని లేచి "అద్భుతం, అఖండం, అబ్బో, ఒస్సి, ఆహాహో, చాలా బాగుందిలెండిమరి, బాగుంది నచ్చిండి, బాగుంది, ఆఁ, బాగానే ఉందీ, ఉందిపోదూ, పాడుగాలేదు, ఏమడుగుతావు, ఏడిసినట్టుంది, ఏడిసి మొహం కడుక్కున్నట్టుంది, వాళ్ల మొహంలా ఉంది, వాళ్ల మొరలా ఉంది, సచేలస్నానం చెయ్యాలి, పక్షి జే పట్టాలి, వాడి భైరవికి పావలా, ఆ స్త్రీ చమక్ కి అర్ధ, ఆ లవ్ సీనుకి రూపాయి" అంటూ విమర్శ చెప్పుకుంటూ ఇళ్లకి పోతారు. నాటకం ఏదైనాసరే 'పావురాయిలు రాలేమూ' అంటూ ఒక్కొక్కడు చప్పరించిపోతూంటాడు.

ఆరీతిగా ఆదర్శకళలన్నీ నిలబడడం చాలా సంతోషకరం. సాహిత్యకళా, గానకళా, నాటకకళా, లలితకళా, సకలకళా, విశ్వకళామండలులేకాక పరిషత్తులుకూడా ఆంధ్రదేశంలో ఆవిర్భవించి పనిచేస్తూన్న ఈకాలంలో అన్నీ ఆదర్శంగా కలిపే ఆంధ్రసంగీత నాటకప్రదర్శనం పైనుదించిన ఏర్పాట్లల్లో ఒక విధమైన ఆదర్శప్రాయంగా ప్రత్యక్షంలో నడుస్తూండడం ముదావహం. సంగీతనాటక ప్రేక్షకసంఘాలూ, సంగీతనాటక శ్రావకసమాజాలూ త్వరత్వరగా ఏర్పడి పైచెప్పినలాంటి సందర్భాలు ఇంకా కలిగించి, ఆదర్శాల పట్ల ఇంకా కొంచెం పెంచి ఇల్లాగే వాటిని కాస్త ప్రత్యక్షంకూడా చేసేస్తే, ఆంధ్రుల సకల కళాభిరుచి కొన్నివందల రెట్లై పోతుంది. దాంతో ఆంధ్రానికి ఏమున్నా లోటుంటే ఆ చీమంతలోటూ పూడుతుంది. మంచిపీకవాడు పాడినకొద్దీ స్థాపింపబడేది స్వత్వమేకాని అన్యత్వం . కాదుగనక, సంగీత నాటక ప్రదర్శనం అనే వినోదాన్ని వేషరాగాల మేజువాణీ అనడం సాహసంకానేరదు.



పిలుపు

— శ్రీ సుందరాచారి —

కలత నిద్దుర వలలలో కళ్లు మూసి
కలలు గాంచెడి పలువల పిలువనేల?
వెనుకబడియున్నవారల విడిచిపెట్టి,
పయన మౌదాము తమ్ముడా! బయలుదేరు.

చలువ చెంగల్వకొలనులో జలకమాడి,
పసుపు మెయిఁబూసి, కుంకుమ నొసటదిద్ది,
గగనకల్యాణి యుదయరాగాలతోడ
పిలుచుచున్నది; మర్యాద నిలుప రమ్ము.


మూటముల్లెలు సవరించుమాటమరచి,
ముద్దుముస్తాబుసరదాల మునిగిపోకు
కాలుసేతులు కలిగిన చాలుగాని,
వేళ మించెడు ముందుగా వెడలిరమ్ము.

కురియు మంచుల నిశివేళ మురియు మొగ్గ
విరిసినంతనె వెలుగులు వెదకుచుండు;
తాళములు దీసి, తలుపులు తన్ని తెరచి
గడప దాటుము; సూటిగా కదలిపొమ్ము.



ప్రత్యేకంగా ఇండియాకై తయారుచేయబడినవి!


వెస్టెండు వాచీలు సాధించిన ఖచ్చితకాలదర్శక ప్రమాణమునకు మేము గర్వింపవలెను. వెస్టెండు వాచీలను డబ్బుకు తగిన విలువగా చేసిన పనివానియొక్క పనితనము, పరికరాలయొక్క ప్రశస్తత, ఈ రెంటియొక్క సమ్మేళనమే, దానికి బుజావు. అన్నివిధములగు శీతోష్ణస్థితులలోను దాని అద్వితీయమైన మనుగడకూడా ఒక నిదర్శనం. ఏలనన, ప్రతి వెస్టెండువాచ్ ఇండియాకొరకు ప్రత్యేకంగా డిజైనుచేసి తయారుచేయబడినది.



న్యూకాలిబర్ "ఇ" ఎక్స్‌ట్రా ఫైన్‌వాచ్-15 జూయల్సు

నికల్ సిల్వర్ కేసు	...	రూ 62
రేపింటు ఎవ్వర్‌బ్రైట్ స్టీల్	...	రూ 71
18-క్యా, పాలిడ్‌గోల్డు	...	రూ 197

రేడియం అంకెలు, ముల్లుగలది కావలసినా రు 3లు అధికం



గేట్-లాప్ రెక్టాంగ్యులర్
డీలక్సు క్వాలిటీ గడియారం-16 జూయల్సు
18-క్యా, పాలిడ్‌గోల్డు—రూ 304

రవాణాలు సరిగాలేనందున ప్రకటించిన అన్నిరకాలను సరఫరాచేయుటకు సాధ్యంకాదు, కాని సరుకున్నంతవరకు ఆర్డర్లను నిర్వహించుటకు మా శాయశక్తుల ప్రయత్నింతుము.

వెస్టెండ్ వాచ్ కంపెనీ,
బొంబాయి & కలకత్తా.

WEST END WATCH Co

BOMBAY CALCUTTA

అగ్ని, మోటారుకారు

భీమాకు

↓

• యునైటెడ్ ఇండియా

ఫైర్ అండ్ జనరల్

ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్,


యునైటెడ్ ఇండియా లైఫ్ బిల్డింగు,

ఎస్ప్లనేడ్, మద్రాసు.

టెలిఫోన్ : 4241.

Grams : "UNIGEN"

పోస్టుబాక్సు : 1207.





వారు ప్రత్యేకించి

మిమ్ములనే

గురిచూచుట లేదు..

••• కాని అనుభవించవలసిన దురదృష్టవంతులలో మీరొకరు కావచ్చును. విధి మీకు విరుద్ధముగా నుండిన—ఆ దుస్థితిని మీరు తప్పించుకొనజాలరు, కాని ఇన్సూరెన్సు ద్వారా మీకుటుంబమును కాపాడగలరు.

సంప్రతింపుడు:— నేషనల్ ఇన్సూరెన్సు

కంపెనీ లిమిటెడ్.

7, కౌన్సిల్ హౌస్ స్ట్రీటు, కలకత్తా.

మద్రాసు బ్రాంచి:—

362 మైనాబజారు రోడ్డు,

మదరాసు.



డోంగ్రేగారి

బాలామృతము

బలహీనమైన బిడ్డలకు

పుష్టియున్ను, బలమున్ను

ఆరోగ్యము నిచ్చును.

దక్కన్ హైర్ ఆయిల్

వాడుడు

అనుకరణీయములకు అందదు



వెంట్రుకల పెరుగుదలకు చాల శ్రేష్ఠమైనది. జబ్బుపడి లేచిన వారికి, ప్రసవించిన స్త్రీలకు వూడిపోవు జుట్టును వూడిపోకుండా కాపాడును.

చదువుకొనే వారు, మనోపరిశ్రమ చేయువారు దీనిని వాడి, తమ కిది ఎక్కువ అనుకూలముగా నున్నదని ప్రశంసించిరి.

DECCAN HAIR OIL COMPANY,
Hyderabad (Dn.)

~ ఆంధ్రమహాభారతము ~
వ్యూహరచన

= శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం =

సాంగ్రామికవిషయములపై సైనికులు కాని వారు కంఠోక్తిగా చెప్పగలరా, లేరా యనునంశముపై అభిప్రాయభేదములు గలవు. "నాన్యృషిః కురుతే కావ్యం" అన్నట్లే సైనికేతరుడు యుద్ధపద్ధతులను గురించి స్వానుభవపూర్వకముగ చర్చింపజాలడు. పరాధీనజాతులకు రాజకీయములే లేనప్పుడు వారికి యుద్ధపద్ధతు లెందుకు? సైనికశిక్షణతో వారికి పనియేమి? వ్యూహరచన మున్నగునవి వారికి ఉబుసుపోని కబుర్లుగదా? అని తోచవచ్చును. ఇంచుమించు రెండుశతాబ్దములనుండి మన దేశముయొక్క రక్షణబాధ్యతయు, సైన్యవ్యవస్థయు, తత్సంబంధములైన ఇతరాంశములన్నియు మన పాలకుల చేతులలో నుండుటచేత భారతీయులకు ఆత్మరక్షణ చింతకాని, సాంగ్రామిక విషయపరిజ్ఞానముగాని పూర్తిగా కరవైనవి. చివరకు క్షాత్ర మనే ఒక గుణము, శౌర్య మనే ఒక అలంకారము, యుద్ధ మనే ఒక భయంకర అస్తిత్వము ఉన్నా యనే విషయంకూడా మరపుమడతల్లో పడిపోయిందనిపిస్తుంది. తిరిగి ఇవన్నీ సత్యములే, ఇవి మన నిత్యజీవితమునకు సంబంధించినవే, ఇవి ఊహాపరుల కల్పనలుమాత్రమే కావనే దినము వచ్చినది. అచిరకాలంలోనే భారతజాతి ఆత్మరక్షణబాధ్యతకూడా పూనుకోవలసిన శుభదినం రానేవస్తుంది. అప్పుడు యుద్ధపద్ధతులు పర్యాలోచనకు రాకపోవు. ఆనాడు మళ్లీ మనం ప్రాతపురాణాలు బూజుదులిపి మన ప్రాచీనులు సంగ్రామవిషయమై ఏమి తలంపులు కలిగిఉండేవా రనే చర్చ చేయకపోము.

ప్రాచీన యుద్ధపద్ధతులనుగురించి మనము తెలుసుకోవాలంటే మహాభారతంవంకకు మరలాలి. మహాభారతము అనేకవిషయములకు గనివంటిది. ఇది లోకోత్తరమైన వీరకావ్యము. భారతయుద్ధంకన్న ప్రాచీనమైన వీరగాథ మనకు ప్రపంచవాఙ్మయంలో ఎక్కడా లభించదు. ఆంధ్రుల అదృష్టవశంచేత ఈ వీరచరిత్రను తిక్కనామాత్యుడు తన అపూర్వ ప్రజ్ఞావిశేషంచేత సజీవంగా చేసి మనకు ఇచ్చిపోయాడు. కొంతమంది కళారాధకులు తిక్కనగారి యుద్ధపంచకము నిస్సారమైన పురాణప్రలాపం అని తలుస్తారు. ద్రోణు డిన్ని బాణాలు ప్రయోగిస్తే అర్జును డిన్ని నారాచాలు ప్రయోగించా డని ఎందుకీ సంఖ్యాగణనము, ఇది కవిత్వమా అని అంటారు. మహానుభావుడైన తిక్కనకు ఇటువంటి సందేహం ఏమీ జనించలేదు. ఆతనికి క్షాత్రము పరమధర్మ మని తోచింది. తిక్కనకాలపు ఆంధ్రులంతా యోధజీవితము ఉత్కృష్ట మనుకునేవారు. వారికి వీరజీవితము గానంచేస్తూంటే వినడం అత్యంతప్రీతికర మని మనం ఊహించవచ్చును. అంతకు ౧౫౦ ఏండ్లకు ముందే రాజరాజనరేంద్రుడు తనకు భారత శ్రవణాసక్తి మెండని

చెప్పియుండలేదా? అప్పటికీ ఇప్పటికీ మనవారికి భారతశ్రవణకుతూహలము మిక్కుటము. "వింటే భారతం వినాలి; తింటే గారెలు తినాలి" అనేది మనలో లోకోక్తి అయిపోయింది. తిక్కనకుకూడా వీర గాథలు మిక్కిలి అభిమతము. ఆయనది కొంతవరకు యోధచిత్తవృత్తి. ఆయనవంశము యోధవంశము. ఆయనతండ్రి కొమ్మనామాత్యుడు దండనాథుడు. ఆయన పెత్తండ్రికొడుకు సాక్షాత్తు ఖడ్గతిక్కన. ఆనాటి ఆంధ్రులు పరాక్రమపు మొలకలు. ఈ మొక్కలు శౌర్యరసంతో పెరిగేవి. అప్పటికి పల్నాటివీరుల యుద్ధం ఆంధ్రుల మనస్సులలో ఇంకా పచ్చిపచ్చిగానే ఉంది. పల్నాటివీరులు భారతయోధులకు ఆంధ్రప్రతిబింబము లను మాట మరవకూడదు. పల్నాటియుద్ధం పిల్లభారతసంగ్రామమే యని మనవారి నిశ్చయము. కావున భారతరణగాథ వారికి పిల్లలకు తల్లికథ వంటిది.

మరొక విశేషంకూడా ఉంది. భారతీయుల ప్రాచీనసమరకళ ఆంధ్రుల్లోనే కడసారి ప్రజ్వరిల్లి క్రమంగా ఉనికి పూదిపోయింది. భారతీయసమరకళ ఒకటి ఉన్నదా యని సందేహించనక్కరలేదు. దానిని మనం స్మరించడంలేదు. అది ఈకాలంయొక్క లోటు. తిక్కనామాత్యుని లేఖినియే ఈవిస్మృతకళకు కడసారికుంచె. అతని వాక్కు ఈవిద్యయొక్క అంతిమ గర్జాఘోషము. భారతీయ సమరకళయొక్క ప్రత్యేకత ఏమి? రథగజతురగపదాతి సన్నాహము, ధానుష్కుల ప్రాబల్యము, వ్యూహరచనావిధానము - ఇవి దాని చిహ్నములు.* కాకతీయయుగమునాటి ప్రత్యక్షానుభవం ఉండిగనుకనే తిక్కనగారు భారత సంగ్రామకథను అసామాన్య చాతుర్యంతో వ్రాయగలిగారు. మహాభారతయుద్ధవర్ణనలకు జీవరసంపోశారు. కావున ఆయన అపరవ్యాసుడంటే అతిశయోక్తి కాజాలదు. ఆంధ్రులే ప్రాచీనహైందవ సంగ్రామకళకు కడసారి ప్రతినిధు లని నేను తలుస్తాను.

ప్రాచీన సంగ్రామవిధానమునుగురించి చెప్పాలంటే చాలా ఉంటుంది. మనకు వేదంలోనూ, పురాణాల్లోనూ యుద్ధప్రశంస వస్తూంటుంది. ఆ యుద్ధాలు ఎట్లా ఉండేవి? అవి సుశిక్షితయుద్ధములా, లేక అశిక్షితుల దొమ్మిలా? ఆయాకాలముల యుద్ధసాధనము లెట్టివి? అవి యుద్ధగతిపై ఎటువంటి ప్రభావం కలిగించాయి? ప్రాచీన సాంగ్రామికులలో అగ్రేసరు లెవరు? ధనుర్వేదం అంటే ఏమిటి? అస్త్రములు, శస్త్రములు—వీని భేదం ఏమిటి? సైన్యవ్యవస్థ ఎట్లా ఉండేది? వ్యూహములంటే ఏమిటి? ఇత్యాది విచారణీయాంశములు అనేకములుగలవు. ఇది యొక అగాధమైన చర్చ. భారతీయసంగ్రామవిద్య మహాభారతయుద్ధమునాటికి మహోన్నతస్థితికి వచ్చినది. తత్ప్రకాశములే మహాభారతమునందలి వ్యూహములు.

వ్యూహ మనగా విశిష్టమైన సైన్యరచనా పద్ధతి. "వ్యూహస్తు బలవిన్యాసః" అని అమరము. "వ్యూహ్యతే, రచ్యతే ఇతి వ్యూహః"— రచింపబడునది. బలవిన్యాస మనగా సేనయొడ్డుట. మరియొక వ్యుత్పత్తి దీనికి చెప్పబడినది: "విశేషేణ ఊహ్యతే ఇతి వ్యూహః. ఊహో వితర్కః."—విశేషముగా ఆలోచింపబడునది. చతురంగబలమును యథాస్థానముగా తీర్చిపెట్టుట నిపుణుడైన సేనానాయకుడు విశేషచింతనమీదగాని చేయడు. అతడు దీర్ఘముగను, లోతుగను ఆలోచింపవలసిఉంటుంది. అందుచేతనే దీనిని విశేషమైన ఊహాఫలితంగా చెప్పారు. దండము, భోగము, మండలము, అసంహతము అనునవి వ్యూహభేదములు. బలమును అడ్డముగా తీర్చుట దండము. చతురంగబలమును ఒకటివెనుక ఒకటి నిలుపుట భోగము. మండలాకారముగ సర్పశరీరమువలె తీర్చుట మండలము. బలమును వేరువేరుగా తీర్చుట అసంహతము. కామందకు డిట్లు చెప్పుచున్నాడు:

"తిర్యగ్వృత్తిస్తు దండస్స్యాత్
భోగోఽన్వావృత్తి రేవచ

* ఈ చిహ్నములు మనకు కాకతీయమహాయుగములోనే కడసారి కానవచ్చుచున్నవి. ఆపైని మహమ్మదీయుల దండయాత్రలతో యుద్ధవిధానము, సాధనసామగ్రులు మారిపోయాయి. ప్రాచీన సమర పాండిత్యము విస్మరింపబడింది.

మండల స్సర్వతోవృత్తిః
పృథగ్వృత్తి రసంహతః"

అందు ప్రదర దృఢకాదులు ౧౭ దండభేదములు. గోమూత్రికా హింసక సంచారిక శకట పతంతకములు ఐదును భోగభేదములు. సర్వతోభద్ర దుర్జయములు మండలభేదములు. అర్ధచంద్ర ఉద్ధానాదులు అసంహతభేదములు.

వ్యూహమునకు వెనుకనుండి చెదరిపోయిన సైనికులను (Stragglers) గూర్చుకొనివచ్చు సేనాభాగమునకు వ్యూహపార్ష్ణి యని పేరు. దీనినే ప్రత్యాసార మనికూడ అందురు. "భగ్నా నాత్మీయాన్ ప్రత్యాసరతీతి ప్రత్యాసారః". దీనిని Rear of an army అని చెప్పవచ్చును. ప్రతిగ్రహ మనే పేరు గల మరొక సైన్యభాగం ఉంటుంది. ఇందు రాజు తాను నిభృతుడై యుండి తన సైన్యం గానిచెందకుండునట్లు నడిపించుకుంటూ వస్తాడు. ప్రతిగ్రహము ప్రధాన వ్యూహమునకు ఇన్నూఱువిండ్ల దూరమున వెనుక భాగంలో ఉంటుంది.

ఈ వ్యూహరచనావిధానము ఎప్పుడు ఎవరిలో ప్రచారములోనికి వచ్చినది అనే చర్చ అప్రస్తుతము కాదు. యుద్ధచరిత్రను మనము సాధ్యమైనంత వెనుక వెనుకకు పరిశోధించుకుంటూ వెడితే అతిప్రాచీన యుద్ధములు ద్వంద్వయుద్ధములు, దొమ్మియుద్ధములుగా ఉండేవని తోస్తుంది. వేదంలో వచ్చే ఇంద్రవృత్రుల యుద్ధము ద్వంద్వయుద్ధము. ఈ వృత్రుడు చారిత్రక వ్యక్తియో, లేక వేదకవుల రూపకనిర్మాణప్రతిభా ఫలితమో చెప్పజాలము. ఇంద్రుడు తేజోరాశి; మేఘాధిపతి. వృత్రుడు తేజస్సును, జలములను కబళించి నిరోధించిన అసురశక్తి. ఇంద్రు డాతనితో ఘోరయుద్ధ మొనరించి వానిని నిర్జించెను. ఇంద్రవృత్రుల ఆయుధములు అతిప్రాచీనములు. ఇంద్రుని 'పవి' పర్వతములను భేదించునది. ఆర్యులు పర్వతములను పగులగొట్టుటకు ఉపయోగించే సాధనమే ఇంద్రుని ఆయుధముకూడ. ఆర్యులు ధనుర్బాణములను ఉపయోగించుట నేర్చిన తర్వాత ఇంద్రుని కొక ధనుస్సుకూడ ప్రసాదింపబడినది. దొమ్మి యుద్ధములు పెనుమూకలనడుమ నడచు ఘోరరణములు. ఇందు క్రమశిక్షగాని, అస్త్రశస్త్ర నైపుణ్యముగాని కనబడవు. కేవలబాహాబలమే విజయహేతువు. దేవాసురసంగ్రామము లిట్లుండెను. దేవాసురసంగ్రామములు ఆర్యానార్యభండనములతో గుదిగుచ్చబడినవి. దేవాసుర వర్గములు రెండును ప్రచండశౌర్యరాసులే. కాని దేవతలు తరచు పరాజయము నొందుచుండినట్లు తోచును. అసురులకు సంఖ్యాబాహుళ్య ముండెను. దేవతలు అల్పసంఖ్యాకులు. దేవతలయందు ఐకమత్యము లేకుండెడిదట. వారిది బహునాయకత్వము. కావుననే ఈశ్వరుడు త్రిపురసంహారము చేయునప్పుడు దేవతలందరి వద్దనుంచి ఒక్కొక్క అంశమును తాను పుచ్చుకొని, వారికి తా నేకనాయకుడై నడిపించెనట. అప్పుడు శివుడు ఒక అమోఘమైన యుద్ధోపాయమును (Strategy) ప్రయోగించెను. బ్రహ్మవిష్ణువులను ఈనాటి Fifth Columnists వలె ఉపయోగించి త్రిపురములలో ఉన్న బావులలోని నీళ్లన్నియు త్రాగించివేశాడట. అసురవర్గమున కప్పుడు జలాభావం కలిగింది. శివుడు త్రిపురములను దహించివేసి త్రిపురాంతకు డనే బిరుదు పొందాడు.

అల్పసంఖ్యాకులైన దేవతలలోనే ప్రప్రథమమున వ్యూహనిర్మాణావశ్యకత కలిగింది. తమ స్వల్ప సంఖ్యను గరిష్ఠశక్తితో ప్రయోగించడ మెట్లాగని వారు తీవ్రంగా ఊహించారు. ఈ ఊహాఫలితమే వ్యూహము. సుశిక్షితములై, యుద్ధరంగమందు అన్యోన్యసహాయ పద్ధతిని తీర్చి రచించిన సైన్యములు అల్పసంఖ్యాకములయ్యు శిక్షయు, వ్యూహరచనయు లేని బహుళ సైన్యములను అవలీలగా జయిస్తాయి. హిందూదేశచరిత్రలో కంపెనీవారి శిక్షిత సైన్యములు తక్కువసంఖ్యలో ఉన్నప్పటికీ ఆనాటి భారతీయప్రభువుల అశిక్షితములైన పెనుమూకలను ఎట్లా ఓడించినది మనము చదివియే యున్నాము. కావున ఆర్యులైన దేవతావర్గంలోనే వ్యూహజ్ఞానము తలయెత్తినది. దేవగురువైన బృహస్పతి యీవిధముగా తెలిపినాడట:

"మహాక్షే ర్వచనా త్రాత
వేదయంతి బృహస్పతేః,

సంహతాన్ యోధయేదల్పాన్
కామం విస్తరయేద్బహూన్."

అల్పసంఖ్యాకులను చక్కగా కూర్చి తీర్చి యుద్ధముచేయించవలెను. బహుసంఖ్యాకులను యథేచ్ఛగా విస్తరింపజేయవచ్చును. దేవాసురయుద్ధములలో బృహస్పతియే ఇంద్రునకు క్రౌంచవ్యూహము నుపదేశించెనట. మహాభారతములో అనేక మహావ్యూహములు పేర్కొనబడినవి. క్రౌంచవ్యూహము, గరుడవ్యూహము, మకరవ్యూహము, కూర్మవ్యూహము, శకటము, సూచీముఖము, వజ్రము, మండలార్ధము, సర్వతోభద్రము ఇత్యాదులు పెక్కులు గలవు. ఈవ్యూహముల నామకరణమునుబట్టియే అవి పశుపక్ష్యాదుల ఆకారములను, స్వభావములను, ఒండొంటితో అవి పోట్లాడునప్పుడు అవలంబించే సన్నద్ధాకారములను శ్రద్ధతో పరిశీలించి తదనుగుణముగా సేనాసన్నివేశం చేయుటచేత ఏర్పడినవని తోచకమానదు. ఈవిషయమై శుక్రనీతిసార మిట్లు చెప్పుచున్నది:

"నద్యద్రివనదుర్గేషు యత్రయత్ర భయం భవేత్
సేనాపతి స్తత్రతత్ర గచ్ఛే ద్వ్యూహీకృతై ర్బలైః.
యాయా ద్వ్యూహేన మహతా మకరేణ పురోభయే
శ్యేనేనోభయపక్షేణ సూచ్యావా ధీరవక్త్రయా.
పశ్చాద్భయేతు శకటం పార్శ్వయోర్వజ్రసంజ్ఞకం
సర్వతః సర్వతోభద్రం చక్రం వ్యాల మథాపివా."

మకరవ్యూహము పురోభయమైనది. శ్యేనవ్యూహము రెండురెక్కలయందును భయంకరమైనది. సూచీవ్యూహముబలము దాని నోటియందు గలదు. వెనుకభయ మున్నప్పుడు శకటవ్యూహము పన్నవలెను. అన్ని వైపులను భయంకరమైనది సర్వతోభద్రము. చక్రము, వ్యాలముకూడ నట్లే.

భారతయుద్ధమునందలి ఉభయపక్షములవారును మహారణతంత్రమును చక్కగా తెలిసినవారే. వారందరును వ్యూహనిర్మాణకుశలురే. అందులో కురువృద్ధుడు గాంగేయుడును, ఆచార్యసత్తముడు ద్రోణుడును వ్యూహజ్ఞానమునందు రెండు సముద్రములవంటివారు. భీష్ముడు శుద్ధవీరుడు. అతనికి వంచనకాని, ఛలయుద్ధంకాని కిట్టవు. తనచేతిబలువుచే నమ్మిన మేటియోధుడు. ద్రోణాచార్యుడు మూర్తీభవించిన యుద్ధవిద్య యని చెప్పిన అతిశయోక్తి కానేరదు. అతిరథమహారథులను గురించి నిరూపణము చేయునప్పుడు భీష్ము డీతనిని గురించి ఇట్లు ప్రశంసించినాడు:

"అతిరథోత్తముడు ద్రోణాచార్యు డందలి
యిందలి విలుకాండ్ర కెల్ల గురువు
హితుడు నీ కెంతయు నేర్చిన మొనలితం
డడరిన జమరిన యట్ల ప్రమందు
వృద్ధని యితని భావింపరా దనిలోన
నంగవిస్ఫురణంబు భంగి చూడ
నర్జునుపై కూర్మి నతని నోజేయడు
సచరాచరంబైన జగము నెల్ల
నొక్కమొగమై కడంగిన జిక్కువఱచు
దివ్యబాణజాలంబుల దీటుకొలిపి
ప్రాణములు దాప డీతనిపాటి దొరల
గాన మీరాజ్యములయందు గౌరవేంద్ర"

పాండవుల సేనానాయకుడైన ధృష్టద్యుమ్నుడు కూడ మహావ్యూహములను తెలిసినవాడని పొగడబడినాడు.

కురుపాండవసేనలు కురుక్షేత్రరంగము చేరిన తర్వాత భీష్ముడు మొదటిదినమున తన సైన్యమును మానుష వ్యూహముక్రింద తీర్చెను. "అందు భీష్ముడు పడమరమొగంబై తానును ద్రోణుండును తాలధ్వజంబును, వేదికాకేతనంబును గ్రాలుచుండ ముందర నిలిచి, వలపట కృపాశ్వత్థాములును, దాపటం గృతవర్మమద్రేశ్వరులును, వెనుక బాహ్లీకసోమదత్తభూరిశ్రవసులును, నడుమం గురుకుమారసహితంబుగా సమ్మహీనాథుండును, అతని యగ్రభాగంబున నర్జునం జంపుదుము చత్తుమింతియకాని యొండు లేదని శపథంబులు పలికి సంశప్తకు లనం బ్రఖ్యాతులైన సుశర్మ మొదలుగాగల పదివేవురు రథికముఖ్యులును గలయ నెడనెడం దక్కిన యోధవీరులును నిలుచునట్లుగా నియమించి తగ నర్హ్యైసైన్యంబుల కేనుంగులు, ఏనుగుల కరదంబులు, అరదంబులకుం దురంగంబులు, తురంగంబులకు విండ్లవారు, విండ్లవారికి నర్ధాయుధులు నడ్డం

బగు తెఱంగున నిలువ నిరూపించి మానవవ్యూహంబు సమకట్టిన నెన్నండును ఇట్టి దృఢవ్యూహంబును గనియు వినియు నెఱుంగ మని యెల్లవారు నచ్చెరువువంబొరయుచు బ్రియంబందుచుండిరి”.

మానవవ్యూహము భోగ మను వ్యూహభేదములలో చేర్పదగినదిగా కనబడుచున్నది. భోగ మనగా ఒక సైన్యాంగము వెనుక మరొకటి నిలుచుట యని చెప్పబడినది.

వ్యూహవిషయములలో పాశ్చాత్యుల యభిప్రాయములుకూడ గమనింపదగినవి. సైన్యరచనను వారు *Military tactics* అని చెప్పెదరు. దీనిని గురించి ఆంగ్ల విజ్ఞానసర్వస్వములో ఇట్లు గలదు:

“Tactics are the methods employed for the destruction of the enemy by force of all arms, that is infantry, cavalry and artillery. Each of these possess a power peculiar to itself, the full development of which depends to a greater or lesser degree upon the aid and co-operation of the other two. The only force that can ensure this co-operation is the will of the supreme commander”

శత్రునిర్మూలనమునకై త్రివిధసైన్యమును—అనగా పదాతులు, గుఱ్ఱములు, శతఘ్నులు—అత్యంతశక్తివంతముగా నుపయోగించుటయే వ్యూహించుట యన వచ్చును. ఈయంగములలో ఒక్కొక్కదానికి ఒక ప్రత్యేకయుద్ధశక్తి గలదు. ఒక్కొక్క అంగము తన గరిష్ఠశక్తిని విజృంభింపజేయవలె నంటే తదితరద్వయము యొక్క సహాయము అవసరము. ఈ త్రివిధశక్తులను ఏకీకరణము చేయగల సామర్థ్యము సర్వసేనాధీశుని బుద్ధికౌశల్యముపై నాధారపడియున్నది. భీష్ముని మానవవ్యూహమునందు చతురంగముల యన్యోన్య సహాయ పద్ధతి చక్కగా గుర్తింపబడినదని వ్యక్తమగుచున్నది.

భీష్ముని మానవవ్యూహమునకు ప్రతిగ ధృష్టద్యుమ్నుడు అచలవ్యూహమును బన్నెను. “అందు తా నగ్రభాగంబున నభిమన్యుప్రభృతికుమారవరుల సహాదేవసహితంబుగా భీమసేనపరిపాలితుండై నిలిచె. దమ తమ బంధులకును బలంబులకును బలువుతోడి చెలువు గలుగ కేకితాన సాత్యకిసమేతంబుగా పాంచాల మాత్స్యపతులు దక్షిణోత్తరభాగంబుల నిలిచిరి. నడుమ నడగొండగమియయుంబోని గజరాజితో రాజు రథారూఢుండై మెఱసె. ముందట బురందరనందనరక్షితుండై శిఖండి గాంగేయునకు కట్టెదురుగా నిలిచి గండుమిగిలె”. నిపుణుడైన సేనానాయకుడు తన సైన్యానికి సులభంగా అర్థమయే ఒక యుద్ధలక్ష్యం నిర్ణీతంచేసి దానిని సాధించడానికి ప్రయత్నం చేస్తాడు. మొదటి పదిదినములలోను కౌరవులు ఏర్పరచుకొన్న పరమ లక్ష్యము భీష్ముని కాపాడడము. దుర్యోధనుడు యుద్ధారంభమునకు ముందు తన యోధుల నిట్లు హెచ్చరించెను :

“కావున మనకు భీష్ముం
డిన్నరవరు గావవలయు నెమ్మెయినయినన్
దవ్వుం గాచిన నితడు జ
గన్నుతముగ రణమునం బగఱ నడగించున్.”

భీష్ముడు శిఖండితో యుద్ధము చేయడు గావున శిఖండినుండి భీష్ముని కాపాడుట యత్యావశ్యకమయ్యెను.

ఇట్లు గాంగేయుని పదిదినముల యుద్ధములోను అతని కాపాడుటకు కౌరవులును, అతనిముందు బయలు చేసి అక్కడ శిఖండిని చొప్పించుటకు పాండవులును విశ్వప్రయత్నములు చేసిరి. అట్లే ద్రోణాచార్యుడు సేనానాయకుడైనతర్వాత యుధిష్ఠిరుని ప్రాణములతో బందీగా పట్టుకొనడ మనే మహాలక్ష్యమును తన సైన్యమునకు ప్రతిపాదించినాడు.

కురుక్షేత్ర సంగ్రామముయొక్క మొదటి దినమున కురుపాండవయోధులంతా పెండ్లికి నడుచువారివలె నడిచిరి. ఆనాడు వారందరూ హసన్ముఖులై యుండిరి. రోషము, మాత్సర్యము ఇంకను పెరుగలేదు. ఒక్కొక్క యోధుడు తనకు ఉజ్జీగా ఉండతగినవానిని ఏరుకుంటూ బాణములతో సల్లాపమాడుకొంటూ యుద్ధంలోకి దిగినారు. భీష్ముడు తన యోధులకు ‘సత్సాహంబుగా తెగువ సెప్పుట’ తిక్కన యాంధ్రులకు చెప్పిన వీరసందేశమా అనిపిస్తుంది.

"ఘోరయు వివృత స్వర్గ
ద్వారము రాజులకు నాహవం బందు మహో
దారులు దొల్లియును నరిగిరి
యీ రీమార్గమున నడువ మెయికొను టొప్పన్."

"ఇంటం దెవులంద జచ్చుట
కంటెను బాపంబు లొండు గలదె నృపులకున్
బంటతనము పాలిగల నిది
గంటవిధానంబు గంట గాదే మనకున్ ?"

గాంగేయుని ప్రథమదివసపరాక్రమం చూచి యుధిష్ఠిరుడు చాలా బెంగపడిపోయాడు. ఆరాత్రి శ్రీకృష్ణునివద్దకు పోయి తన సైన్యముయొక్క దైన్యమును చెప్పుకొని యుద్ధం చాలించి అడవులకు వెళ్ళిపోదమని చెప్పెను. శ్రీకృష్ణు డాతనికి ధైర్యమును కలిగించెను. రెండవనాడు పాండవులు క్రౌంచ వ్యూహమును బన్ని యుద్ధమునకు నడిచిరి. క్రౌంచ పక్షియొక్క బలము దాని వజ్రకఠోరమైన ముక్కునందు కలదు. పాండవుల క్రౌంచవ్యూహములో "చంచుత్వంబు భజించి ఫల్గునుండు గాండీవ కపిధ్వజంబులు మెఱయం బొలిచి నిలిచె, కుంతిభోజుండును శైబ్యుండును చక్షుస్థానంబులం దేజరిల్లిరి. ద్రుపదుండు శిఖకు నమరె. భీమసేనుండును ధృష్టద్యుమ్నుండును దక్షిణవామపక్షంబు లైరి. వెన్నయి యుధిష్ఠిరుం డొప్పె." క్రౌంచ వ్యూహమునకు ప్రతిగ కౌరవుల సైన్యము మూడు మోహరములుగా తీర్చబడినది. "దుశ్శాసన వికర్ణ విందానువిందులును, శూరసేన యవన త్రిగర్త కుకురు దేశంబులవా రొక్కవలనను, ద్రోణాచార్యుండును కుంతల దశార్ణ విదర్భులును గాంధార సింధు సౌవీరపతులు నొక్కదిక్కునను, భీష్ముండు మహాసైన్యములతో నడుమనుం గా మూడు మోహరంబు లయ్యె. కృతవర్మయు శల్యుండును గొండలు దమ్ములుం దానును మానవేంద్రుండు వెనుకదెస నిలిచె. ఆనాటి సాయంకాలమునకు కురుసైన్యము అర్జునుని విజృంభణమును సహింపలేక పారిపోజొచ్చెను. భీష్ముడు తన సైన్యములను ఉపసంహరించుకొనెను.

మూడవనాడు గాంగేయుడు పొద్దుననే గరుడ వ్యూహమును దీర్చుకొని తాను దానికి ముక్కై నిలిచెను. "దానికి ద్రోణకృతవర్మలు కన్నులయిరి. కృపాశ్వత్థామలు శిరంబయి నిలిచిరి. త్రిగర్తులతో గూడి భూరిశ్రవశ్శల్య భగదత్తులును, సౌవీరజయద్రథులును కంఠత్వంబు నొందిరి. మనుజపతి యనుజులుం దానును వెన్నయ్యె." ఈగరుడవ్యూహమును జూచి పాండవులు అర్ధచంద్రవ్యూహమును బన్ని నిలబడిరి. ఇందు "పాండ్య మగధబలపరివృతుండై భీమసేనుండు దక్షిణశృంగమున నిలిచె, శిఖండిసహితుండగు ధృష్టద్యుమ్ను మున్నిడుకొని యుధిష్ఠిరుండు శుండాలమాలికాభిలంబుగా మధ్యప్రదేశం బలంకరించె, నవ్వల సాత్యకి మొదలుకొని యేపారిన కవలును, ద్రౌపదేయులు, నభిమన్యుండు, ఘటోత్కచుండు, కేకయపతులుం బన్నిరి. సకల లోకంబులకు రక్షకుండైన రాజీవాక్షుం డెవ్వానికి రక్షణం బొనర్చు నట్టి రథికశ్రేష్ఠుండు డాపలికొమ్మునం బన్నె." గరుడుడు అర్ధచంద్రుని తన భయంకరమైన ముక్కుతో పొడుచును. అర్ధచంద్రుని మధ్యభాగము ఈ తావునకు నిలిచినట్లయితే అతని కొమ్ములు రెండును గరుత్మంతుని చుట్టు వారుకొనవచ్చును. వెనుకనున్న దుర్యోధనుడు చిక్కువడును. శాంతనవుడైన భీష్మునకు ఆనాడు చూపిన పరాక్రమమునకు పాండవులు నిలువజాలకపోయిరి. అప్పుడు శ్రీకృష్ణుడు పాండవ సైన్యమునకు ఉత్సాహము కలిగించడంకోసము కాబోలు స్వయముగ తాను చక్రము బూని దేవవ్రతునిమీదికి ఉరికెను.

ఐదవనాటి యుద్ధమున కౌరవులు మకర వ్యూహము బన్నిరి. ఆవెనుకటి దినము యుద్ధములో ఘటోత్కచుని మాయాయుద్ధముచేతను, అర్జునుని పరాక్రమముచేతను కురుసేన మిక్కిలి చికాకుపడెను. పాండవు లైదవనాడు శ్యేనవ్యూహంబుగా మోహరించిరి. "అందు ముఖంబున భీమసేనుండును, నయనంబుల ధృష్టద్యుమ్న శిఖండులును, శిరంబున సాత్యకియు, కంఠంబునం గిరీటియు, పుచ్ఛంబున నకుల సహదేవ సహితుండై యుధిష్ఠిరుండును నిలిచిరి." మకరవక్త్రము మహాభయంకరమైనది. భీముడు ఆ మొసలినోటిలోనికి జొచ్చి కురుసైన్యమును మర్దించెను. దుర్యోధనుడు ద్రోణాచార్యునివద్దకు పోయి

"మీరు పాండవులను ఉపేక్ష చేయుచున్నారు. మీ కిది న్యాయమా" అన్నట్లు పలికెను. ద్రోణుడు కటకటంబడి ఇట్లు సమాధానము చెప్పెను: "సముద్రములో బుఱ్ఱవేసిన వేతువచ్చునుగాని సముద్రమును ఈదగలవాడెవ్వడు? పాండవులతో యుద్ధమునకు బూనుకోవచ్చునుగాని వారిని గెలుచుట మావలనగాదు." ఈనాటి యుద్ధమున ఉభయపక్షములును సమానముగ చెనగినట్లు తోచును. కావున ఉభయులును 'తమక తమక తనిసి' స్కంధావారములకు వెళ్ళిపోయిరి.

ఆరవనాడు ధృష్టద్యుమ్నుడు మకరవ్యూహము నేర్పరించుచు "దానికి పార్థపాంచాలపతులు శిరంబులును, గవలు కన్నులును, భీమసేనుండు తుండంబును, సౌభద్ర ద్రౌపదేయ ఘటోత్కచులు గండస్థలంబులును, సాత్యకిసహితుండై యుధిష్ఠిరుండు కంఠంబును, ధృష్టద్యుమ్నసహితంబుగా విరాటుండు వెన్నును"గా జేసెను. "భీష్ముండు దానికి బ్రతివ్యూహం బూహించి క్రౌంచవ్యూహం బమర్చి యందు చంచువునం దాను గురుసహాయుండై నిలిచె. నేత్రంబుల కృపగురుపుత్రులును, మస్తకంబున కృతవర్మయు కాంభోజబాహ్లికులును, గళంబున శూరసేనపరివృతుండై సుయోధనుండును నిలిచిరి". మకరవ్యూహమునకు తుండస్థానమైన భీముడు క్రౌంచముముక్కయిన భీష్మద్రోణులచేత చుట్టబడి ఒంటరియై పోగా ధృష్టద్యుమ్నాదులు ఆతని సహాయమునకై పరుగెత్తిరి. దుర్యోధనుడు భీముని చే మిక్కిలి నొచ్చెను.

ఇన్ని దినములను కౌరవులు భీష్ముని నాయకత్వమున విక్రమవ్యూహములం బన్నుచవచ్చిరి. శత్రువులమీద తామై నడచుట విక్రమ మనవచ్చును. ప్రతిపక్షులను విక్రమించు బాధ్యత విడిచిపెట్టి తాము కాపుదలమీద నుండుట సంరక్షకపద్ధతి యనవచ్చును. ఆరవనాటి రాత్రి దుర్యోధనుడు భీష్ముని స్కంధావారమునకు పోయి ఆతనితో నిట్లు చెప్పెను:

"మనము పూది పట్టి మొనలేర్చి కొనిపోవ
పాండురాజసుతుల బలము గవిసి
గాసిచేయు నదియుగాక నీముందట
బవనతనయుచేత భంగపడితి."

"నిను గొని గెలిచెద గుంతీ
తనయుల నని యున్న తలపు దప్పించెను నీ
వనిమిషులకైన కెలన
వనిమొన వారింత బలియు రగుటేమియొకో"

ఆనాటినుంచి దేవవ్రతుడు విక్రమవ్యూహములను (Offensive tactics) విడిచిపెట్టి సంరక్షక వ్యూహములను (Defensive tactics) బన్నజొచ్చెను. ఏడవనాడు డాతడు మండలవ్యూహమును విరచించెను. "అందు నరనాథుండు నడుమ నొప్పియుండె. దమ్ములును జేతుంగల కోరలును నూరెల నిలిచిరి." యుధిష్ఠిరుండు తన మొనలను వజ్రవ్యూహముగ బన్నించెను. ఎనిమిదవ నాడు కురుపితామహుడు కూర్మవ్యూహముం బన్నెను. తాబేలుబలమంతయు దాని బొరుసులో నుండును. ఆబొరుసే దానికి దుర్భేద్యమైన కవచము. అది కొరకబడదు; పొడవబడదు. ఈ తాబేటి బొరుసుమీద పొడుచుటకే కాబోలు ధృష్టద్యుమ్నుడు శృంగాటకవ్యూహమును బన్నించెను. ఈనాడు ఘటోత్కచుని మాయాయుద్ధముచే కురుసేన మిక్కిలి కలగుండుపడెను. సైనికు లందరును పరుగెత్త జొచ్చిరి. గాంగేయుడు అతికష్టముమీద తన మొనలను నిలువరించెను. నాటి రాత్రి దుర్యోధనాదులు మంతనమునల్పి గాంగేయుని సేనాపతిత్వమునుంచి తొలగించవలెనని నిశ్చయించుకున్నారు. ఆతడు పాండవపక్షపాతి యని వారి భయము. కర్ణుని మాటలను బుచ్చుకొని రారాజు శాంతనవుని స్కంధావారమునకు బోయి ఆతనిని యుద్ధము చాలింపుమని కోరెను. గాంగేయుడు మిక్కిలి విషాదము నొంది—

"నడికిరేయి వచ్చి నను నొవ్వబలికిన
గలుగునయ్య జయము గడగి నీవు
నడుపు మనికి నెల్లి నాచేత బలుపు సూ
చెదవుగాక వేయు చెప్పనేల?"

అనెను. మరునాడు భీష్ముడు "సర్వతోభద్ర వ్యూహం బొనర్చె నందు కృపాచార్య కృతవర్మ శల్య శకుని సుదక్షిణ సైంధవులును గురుకుమారులును దానును ముందట నిలిచె. దదనుమతిం గుంభసంభవ భూరిశ్రవో భగదత్తులు వలపటను, సోమదత్త ద్రోణపుత్ర విందానువిం

దులు దాపటను త్రిగర్తకేకయయుతుండై జననాథుండు నడుమను నిలిచిరి." దీనికి ప్రతిగ అర్జునానుమతంబున ధృష్టద్యుమ్నుడు ఒక గట్టి మోహరమును ఏర్పరచెను. అందు "సాత్యకివిరాటులు వలపటను అభిమన్యుపాంచాలకేకయులు దాపటను నకులసహదేవపురస్సరుండైన యుధిష్ఠిరుండు నడుమను, అగ్రభాగంబున శిఖండి నునిచి యతని కెలంకుల డాసి భీమసేనఘటోత్కచులొక్కవలనను, పార్థుండు దాను నొక్కదిక్కున నిలిచి తక్కిన యోధులం గలయం జేర్చి గట్టిమైనగా నమర్చె."

తొమ్మిదవ నాడు కురుపితామహుడు తన ప్రచండపరాక్రమముచే పాండవబలముల గాల్చుచుండెను. అతని రణము యుధిష్ఠిరునకు సహింపరాని దగుటంచేత అత డెలుగెత్తి పేరుపేరం బిలిచి సహాయమునకై చేయిచ్చెను. భీమాదు లాతని సహాయమునకై పరుగెత్తిరి. అర్జునుడు కూడ గాంగేయుని విక్రమవిజృంభణమునకు తాళజాలకుండెను. పాండవసైన్యము యొక్క దురవస్థను జూచి యప్పుడు శ్రీకృష్ణుడు తిరిగి చక్రము బట్టి దేవవ్రతునిమీదికి లంఘించెను. ఆనాడు పాండవసేన మిక్కిలి దురవస్థకు వచ్చెనట. "అట్టియెడ ధర్మతనయుండు అతిఘోరంబగు సంధ్యాసమయమున బంకనిర్మగ్నమైన గోవృందంబోలె నున్న నిజసేనం జూచి యొక్కింతసేపు చింతాక్రాంతుండై యప్పటికిం దిగుచుటయ కర్జంబుగా దలంచెను." కురువీరులందరు భీష్ముని స్తోత్రములు చేయుచు ప్రశంసించుచు సంతోషముతో తమ విడుదులకు పోయిరి. ఆనాటి రాత్రియే ధర్మజుడు రహస్యప్రకారంబున గాంగేయుని నివాసమునకు పోయి అతనిని ప్రార్థించి అతనిని జయించు నుపాయమును తెలిసికొనివచ్చెను.

పదియవ నాటి యుద్ధమున "సూర్యోదయ సమయంబునం బాండునందనులు సేనాసమేతులై వెడలి మోహరించుచునప్పుడు ముందట శిఖండిని నిలిపి యతని కెలంకుల భీమార్జునులును, వెనుక నభిమన్యు ద్రౌపదేయులును, వారికెలంకులం జేకితాన శైనేయులును, అటపిఱుంద ధృష్టద్యుమ్నాది పాంచాలకుమారకుల మున్నిడికొని కవలనభయపార్శ్వంబులం బెట్టికొని యుధిష్ఠిరుండును, వీరి మారెలం బొదివికొని విరాటద్రుపదముఖ్యులగు పృథ్వీపతులును, ఇత్తెఱంగున గట్టిమోహరంబు దీర్చికొని నడచిరి." కౌరవులును "భీష్ముం డగ్రభాగమున నల్లసిల్ల, కురుకుమారు లమ్మహాత్ము బరివేష్టింప, కుంభసంభవ తత్సంభవులు దక్షిణవామ భాగంబులను, కృపకృతవర్మ భగదత్తపురస్సరుండై కురురాజు మధ్యభాగంబునను, బృహద్బల కాంభోజముఖ్యులైన మహీపతు లమ్మనుజేంద్రు చుట్టును త్రిగర్తులు పరభాగంబునను బన్ని బలుమెయిన యమర్చికొని త్రోచినడచిరి." ఆనాడు భీష్మభానుడస్తమింపబోవుచున్నాడని తెల్పుటకో యనునట్లు కౌరవసేనయందు ఉత్పాతము లనేకములు కనబడెను. ద్రోణాచార్యుడు గాంగేయుని విషయమై భయగ్రస్తుడయ్యెను. కురుపితామహు డిట్లు పదిదినంబులు దారుణరణంబు చేసి విసుగుపొందెను. అతనికి మేనిపై విసువు జనించెను. పుట్టినప్పటినుండి యుండు ఉత్తమక్షత్రియుల జంపుచు నడపిన విక్రమము ఆనాటికో అతనికి వెగటనిపించెను. అతడు సంగరమునుండి విరమించుటకు నిశ్చయించుకొని ధర్మజునితో తన యభిప్రాయము రహస్యముగ దెల్పెను. కురుక్షేత్రముపై ఆనాడు చండకిరణుడగు సూర్యుడు గ్రుంకుడునే సమయమునకు అర్జునుడు గాంగేయుని తన తీవ్రబాణములచే పడవైచెను. భీష్మభానుడుకూడ గ్రుంకెను.

తంత్ర ప్రసంగము

= శ్రీ పూర్ణానంద =

ఆపాద్య జన్మ మనుజేషు చిరాద్దురాపం
తత్రాపి పాటవ మవాప్య నిజేంద్రియాణామ్,
నారాధయంతి జగతాం జనయిత్రి యే త్వాం
నిఃశ్రేణికాగ్రమధిరుహ్య పునః పతంతి.

వేదములు తా ముండిన తావునుండి కదలకయే మనలను జ్యోతిర్మయహర్మ్యములకు లేవనెత్త ప్రయత్నించుచుండగా తంత్రములు మృణ్మయసూపరితమైన ఈ కళంకపృథివీతలమున కేతెంచి మనలను లేవనెత్తుచున్నవి. శ్రీగురు లవక, ఆచార్యవర్యు లవక సర్వులకు బ్రహ్మజ్ఞానము నుపదేశించుచున్నవి. కాని, తంత్రశాస్త్ర మనిన వ్యభిచార మని కను బొమ్మలు ముడుచుకొనువారు కొందఱును, అది ఒక విధమైన గారడీవిద్య యని ఎంచువారు కొందఱును పండితు లనబడువారిలోనే మనకు ఎదురగుదురు. ఈ విచిత్రాభిప్రాయములకు బీజము గతశతాబ్దమున పాశ్చాత్యనాగరకతాసమ్మోహితులమై శాస్త్రధిక్కార మొనర్చు సమయమునకే ఆరోపితమైనది. ఇటు మరల మనకు వేదవిద్యయందు మోక్షమూలరాదులు 'ఓనమాలు' బోధించి కన్ను తెరపింపజేసినట్లే మొన్న మొన్నటివాడును, కలకత్తా హైకోర్టున జడ్జియును అగు సర్ జాన్ ఉడ్రాఫ్‌దొరయును, అతని సహకర్తలును తంత్రము లన నేమియో మథించి చూపిరి. తంత్రశాస్త్రగ్రంథములును, సంప్రదాయమునుగూడ చాలమట్టుకు కాలకబళితము లైనవి. మిగిలినవానిని 'ఆగమానుసంధానసమితి' ని స్థాపించి రక్షించినవారికి నతులు. అత్యంతవిస్తృతమైన తాంత్రిక వాఙ్మయమునఁ మారణ, ఉచ్చాటన, వశీకరణము లను విషయములు అచ్చటచ్చట ఉండుట వాస్తవమే. ప్రయోజనవాదులు వీనిని సంతోషముతో గ్రహింపక నిరసించుటేల? ఇవి కేవలము మనస్సునందు అంతర్నిహితమైన శక్తులను మనకు చూపి శాస్త్రవిశ్వాసమును కల్పించుటకే ఆలోచింపబడినవి. ఇవి సౌధాగ్రమునకు గొనిపోవు నిమ్నస్థిత సోపానములు. కనుకనే,

"అన్యాన్యశాస్త్రేషు వినోదమాత్రం
న తేషు కించి ద్భువి దృష్టమస్తి,
చికిత్సిత జ్యోతిష తంత్రవాదాః
పదేపదే ప్రత్యయ మావహంతి."

అను అభిజ్ఞోక్తి. ఏరూపరసాత్మకమగు బాహ్య వికాసము మనుష్యుని ఉన్మత్తు నొనర్చుచున్నదో, ఆ వికాసమున కాస్పద మగు శక్తిని పూజించిన బ్రహ్మ జ్ఞానము లభించును. ఈ ప్రక్రియనే వ్యభిచార మని

---

౧. విష్ణుక్రాంత, రథక్రాంత, అశ్వ (గజ) క్రాంతము లను మండలముల కొక్కొక్కదానికి ౬౪ చొప్పున మొత్తము ౧౯౨ తంత్రము లున్నట్లు తెలియవచ్చుచున్నది. ఇవి గాక తంత్రసారము, శారదా తిలకము, ప్రాణతోషిణి యనునవి ముఖ్యసంకలనగ్రంథ ములు. శ్యామారహస్యము, త్రిపురారహస్యాదులు పూజాంగగ్రంథములు. టీకాప్రచురమైన సంస్కృత మున వీని కెన్ని టీక లుండగలవో యూహింతము గాక! సుమారు ఏబది గ్రంథములు ప్రస్తుతము ముద్రితము లైనవి.

ఆజ్ఞల కల్పన. మహోదారతాసంపన్న మగు ఈ శాస్త్రముయొక్క సారసత్యములను దెల్పుటయే ఈ వ్యాసోద్దేశ్యము.

తంత్రశాస్త్రము ఆగమ నిగమ భేదముల ద్వివిధ విభక్తము. పార్వతికి శివుడు చెప్పినవి ఆగమములు.[2] పార్వతి శివునకు చెప్పినవి నిగమములు.[3] తంత్రము లథర్వ వేదీయ సంబంధము లని అభిజ్ఞు లందురు. ఓంకార మాహాత్మ్యమును వేదములు ప్రతిపాదించునట్లే తంత్రములుగూడ ప్రతిపాదించుచున్నవి. ప్రశ్నోపనిషత్తున సూచితమైన షట్చక్ర భేదమును తంత్రములు విస్తృత మొనర్చుచున్నవి. అథర్వవేదమునందలి మంత్రవిద్య తంత్రతనువును దాల్చినదనుట అతిశయోక్తి కానేరదు.

సంప్రదాయ దృష్టితో పరికించినచో పాశ్చాత్యులును, వారి అంతేవాసులును నుడివెడి వైదిక - ఔపనిషద-పురాణ-తాంత్రిక యుగము లను కల్పన అసమీచీనముగ తోచును. ఈ శాస్త్రము లన్నియును సనాతనములు. ఆవహమానమగు కాలమున ఈ భావధార లన్నియును పంచనద ప్రవాహమువలె ప్రవహించుచునే యున్నవి. కొన్ని గ్రంథములు ప్రాచీనములు, మఱికొన్ని అర్వాచీనములు. ప్రభేదము ఇంతే. యుగకల్పన అసంగతము. ఆయా ఉపాసకుల నాశ్రయించి సంప్రదాయములు పరిపుష్టి నందినవి.

తంత్రశాస్త్రమున సమగ్రముగ హిందూశాస్త్రము పరిసమాప్తి నందుచున్నది. అనగా: వైదిక యాగయజ్ఞములలోని ముఖ్యాంశములు, ఉపనిషత్తుల అద్వయవాదము, పురాణముల బోధించు భక్తి, పతంజలి యోగవిధానము, సాంఖ్యుల తత్త్వసంఖ్యానము, అథర్వవేదముయొక్క మాంత్రికప్రక్రియలు—ఇన్ని విషయములను తంత్రశాస్త్రము గర్భీకృత మొనర్చుకొనుచున్నది. తంత్రముల దర్శనాంశము ఉపనిషత్తుల అద్వైతవాదమును, పురాణముల ద్వైతమును సమన్వయ మొనర్ప ప్రయత్న మొనర్చుచున్నది. ఇక సాధనాంశము యోగమును భక్తిని, మంత్రమును హోమమును జ్ఞానకర్మములను ఉపదేశించుచున్నవి. కనుక తంత్రశాస్త్రమును 'ధర్మవిజ్ఞానసర్వస్వము' అని చెప్పినను చెప్పవచ్చును. "వేదము శ్రవణీయము, తంత్రము ఆచరణీయము" అను శ్రీరామకృష్ణపరమహంససూక్తిగూడ తంత్రశాస్త్ర ముపదేశించు సాధనప్రణాళీమహిమమునే వ్యక్త మొనర్చుచున్నది. మనుస్మృతివ్యాఖ్యాతలలో నొకడగు కుల్లూకభట్టు తంత్రశాస్త్రముయొక్క శ్రుతిత్వమునుగూడ సూచించియున్నాడు.

జన్మాంతరసంస్కారము ననుసరించి రుచివైచిత్ర్యముతోడను, 'అధికారార్హత'లతోడను ప్రవర్తిల్లు మానవు లందఱకును ఈశాస్త్రము సర్వసాధనాయుత మగుటవలన ఉపయోగకర మగుచున్నది. ముక్తితోపాటు భుక్తిని, నిఃశ్రేయసముతో సమముగ అభ్యుదయమును, యోగముతోగూడ భోగమును అనుగ్రహింపగల దని ఈశాస్త్రము శతముఖముల వచించుచున్నది. బంధముక్తుడగు జీవుడు శివత్వము నందుచున్నను, ప్రపంచపరిణామమును అనిర్వచనీయమని ఈశాస్త్రము విశ్వసింపదు. కాక, ద్వైతదర్శనములవలె ముక్తావస్థయందు భేదమును గ్రహింపదు. గుర్వనుగ్రహమును బడసిన సాధకుడు స్వప్రయత్నప్రాబల్యమున సుప్తమై అంతర్నిహితమైన కుండలినీశక్తిని సుషుమ్నాధోభాగమునుండి సహస్రారమునకు గొనిపోయి, శివునితో సంయోజిత మొనర్చును. షట్చక్రభేదన మేతదంతర్గతము. మనుష్యునియందు నిద్రాణమై వెలయుచున్న ఆధ్యాత్మికశక్తియే కుండలిని. ఈశక్తి జాగరితమైనచో జీవరూపియగు పశువుయొక్క పాశములు పటపట పడలిపోయి, బ్రహ్మత్వము సిద్ధించును. ఉపనిషత్తుల ఉద్బోధగూడ ఇదియే. ఉపనిషత్తు లనునది: "ఇది సిద్ధసాధన. తత్త్వవిచార రూపమగు భావన యొక్కటియే చాలును." తంత్రసిద్ధాంతము: "తత్త్వవిచారమున కానుషంగికమై క్రియాకలాపముగూడ ఉండవలెను. శివత్వము కర్మసిద్ధము."

---

౨. ఆగతం శివవక్త్రేభ్యో గతంచ గిరిజాముఖే
మతం శ్రీవాసుదేవస్య తేనాగమ ఇతి స్మృతమ్.

3. నిర్గతం గిరిజావక్త్రాత్ గతం శివముఖేషు యత్
మతం శ్రీవాసుదేవస్య నిగమ స్తేన కీర్తితః.

గమ్యపదమును చేరుటకు వైదికక్రియాకలాపమును, పూజాప్రార్థనలను, ప్రాణాయామాదులను సాహాయ్యకములుగ తంత్రములు గ్రహించుచున్నవి. వేదాంతసాధనవలె తంత్రసాధన "ఉపశాంతో౽యమాత్మా" అని మౌనముద్రను వహించుచుండుట లేదు. కాని, క్రియాబాహుళ్యమును కర్మకాండతో పరిశీలించి చూచినయెడల అసమర్థ దోషము క్షమాపణవలె తోచును. సర్వజనసౌలభ్యము సంపాదించు కోర్కెయే ఈ సంక్షిప్తతకు కారణము. వైదికపంథ నిర్దేశించు హోమము తాంత్రికపూజాదులకు అపరిహార్యమును, అవశ్యమనుష్ఠేయమును అగు అంగము. కాని, హోమకర్మముకంటె భావనయే ప్రధానము. పూర్ణాహుతి నొసర్చునతడు సంపూర్ణముగ తన్ను దేవతాహస్తముల నర్పించుకొనుటయే ముఖ్యము. క్రియాకలాపము లేని కేవలమంత్రపఠనముగూడ సమర్థనీయమే.

పురాణోపదిష్టమగు ఉపాసననే తంత్రశాస్త్రము పరిగ్రహించుచున్నది. పూజార్చనలు, స్తవకవచపఠనము మున్నగునవి ఉభయశాస్త్రసామాన్యములగు విధులు. కాని, తంత్రశాస్త్రము "దేవో భూత్వా దేవం యజేత్" అను ప్రకారాంతరమును- పురాణము లుపదేశించు దాస్యభావమునకు వ్యతిక్రమముగ- ప్రబోధించుచున్నవి. ఈ దేవతాత్మభావనయే తంత్రశాస్త్రముయొక్క గమ్యము. ఉపాస్యమగు దేవతయొక్క శక్తి హృదయసీమ సంపూర్ణముగ ఆవిర్భూతమగుటయే సాధన—సిద్ధి. తంత్రము లీరీతిగ పురాణముల భక్తినిగూడ అద్వైతోన్ముఖ మొనర్చుచున్నవి. అభినవగుప్తాదులగు స్పందవాదులుగూడ ఈవిధానము నంగీకరించుచున్నారు.

తంత్రశాస్త్రము మంత్రముల నెక్కుడుగ అంగీకరించుచున్నది. మననమొనర్చువారికి మంత్రములు త్రాతలు (రక్షకములు, తరింపజేయునవి). మంత్రమునకును, దేవతకును అభేదము. దేవతయొక్క సూక్ష్మశరీరమే మంత్రము; స్థూలశరీరము యంత్రము. మంత్రము వాఙ్మాత్రముకాదు; సిద్ధసాధకుల అనుభూతికి ప్రతీకము. ఆయా మంత్రములను నిర్దిష్టప్రణాళిక ననుసరించి జపించినయెడల మంత్రాభిప్రేతమగు దేవతాదర్శనము - సిద్ధి - ఎవరికైనను లభించితీరును. జపములగు మంత్రవర్ణములు పురశ్చరణమున చైతన్యోద్భాసితములై, సాధకాభీష్టప్రదము లగును. కేవలము జపమువలననే సిద్ధి లభింపగలదు. అర్థభావనాసహితమగు జపము ఉత్తమము. శైవశాక్త వైష్ణవతంత్రము లన్నియును మంత్రమాహాత్మ్యమును అంగీకరించుచున్నవి.

స్థూలశరీరమునకు ఆసనాభ్యాసము శుద్ధిప్రదము. ప్రాణాయామమున సూక్ష్మశరీరశుద్ధి. నాదాభ్యాసము (మంత్రజపము)న చక్రశుద్ధియును, తత్త్వభావనవలన భావశుద్ధియును లభింపగలవు. ఈశుద్ధి పరిపూర్ణత నందినప్పుడే సర్వోత్తమమగు సిద్ధి. ఇడాపింగళల సంధియగు సుషుమ్నను ఆశ్రయించుకొనియుండిన షట్చక్రపద్మములు శబ్దాత్మక నాదోపాసనవల్లనే వికసితములగును. ఈశబ్దము నిత్యము.

ఈశబ్దము పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరు లను భేదములతో నొప్పుచున్నది. మొదటి మూడును శ్రవణానర్హములు. వ్యక్తమగు వైఖరీవాక్కు ఒక్కటియే వీనుల బడుచున్నది. వైఖరీవాక్కు ఉచ్చారితమగుచున్నది. మధ్యమావాక్కు హృదయముననే నిలచుచున్నది. పశ్యంతీవాక్కు నాభియందే నిలచిపోవుచున్నది. పరావాక్కు తదధోదేశముననే ఆగిపోవుచున్నది. వైఖరీవాక్కునకును, వాక్యమునకును మూలమగుచు పశ్యంతీమధ్యమలను మధ్యగ నిల్పికొనిన పరావాక్కే శబ్ద (నాద) బ్రహ్మము. ఇది నిత్యమను విషయమును మీమాంసకులుకూడ అంగీకరింతురు. ఈ శబ్దార్థముల నిత్యతనే వారు ప్రతిపాదించుచున్నారు. ఇక ఆధునికశబ్దశాస్త్రజ్ఞులు (Philology) కేవలము వైఖరీవాక్కునే పరిశీలించువా రగుటవలన శబ్దార్థములకు నిత్యత్వము సిద్ధింపకున్నది. మూలాధారచక్రమున అధివసించుచున్న కుండలినీశక్తియందు వర్ణములును, వర్ణాత్మకములగు శబ్దములును, శబ్దాభిప్రేతమగు అర్థమును సంహితములైయున్నవి. పరావాక్కు ఇచ్చటనే ఉద్భూతమై, స్వాధిష్ఠానమున పశ్యంతీనామమును, మణిపూర అనాహతముల మధ్యమా స్థితిని బొంది, జీవునిచే ఉచ్చారితమై వైఖరీస్థితిని బడయుచున్నది. మూలాధార స్వాధిష్ఠానములు కారణావస్థను సూచించుచున్నవి. మిగిలిన

రెండును సూక్ష్మస్థూలస్థితులు. పరావశ్యంతులు ఈశ్వర శక్తిని, మధ్యమము హిరణ్యగర్భశక్తిని, వైఖరీవాక్కు విరాట్ శక్తిని ప్రకటించుచున్నవి.

కర్మభక్తి జ్ఞానములతో పరిపోల్పదగు శుద్ధి, స్థితి, అర్పణము లను త్రివిధసాధనభూములను తంత్రములు నిర్దేశించుచున్నవి. స్నాన తర్పణ సంధ్యాపూజాహోమము లనునవి సాధనాంగపంచకములు. స్నాన తర్పణములు బాహ్యశుద్ధికిని, సంధ్య చిత్తశుద్ధికిని దోడ్పడి, సాధకుని పూజ కర్హునిగ నొనర్చుచున్నవి. పూజాంతర్గతములగు భూతశుద్ధియును, కరాంగాదులగు న్యాస ప్రక్రియలును స్థూల సూక్ష్మ కారణ శరీరముల మాలిన్యమును బోగొట్టును. అప్పుడు దేవతాభావము నందిన సాధకుడే పూజనొనర్ప సమర్థుడగును. శేషక్రియ హోమము. ఇది సంపూర్ణమగు ఆత్మార్పణముతో ముగియును. శుద్ధికర్మముల దేవశక్తి యైన జీవశక్తియే అర్పణక్రియవలన శివశక్తి యగును. జీవుడు బ్రహ్మ సామ్రాజ్యమున మూర్ధాభిషేకమునంది, జగజ్జ్యోతియై దీపిల్లును.

తంత్రములు సాధకులను పశు, వీర, దివ్య లను మూడువిధములుగ విభజించుచు, ఆయా సాధకులకు ఉచితములగు ఆచారములను,౧ దీక్షలను,౨ అభిషేకము లను౩ నిర్దేశించుచున్నవి.

పశుసాధకుడు ఇంద్రియజయమును, ఆత్మనిగ్రహమును బొంద ప్రయత్నించుచుండును. ఈ నిగ్రహమును బొంది సంపూర్ణమగు ఇంద్రియజయమును బడసిన యెడల వీరసాధకు డగును. ఈస్థితియందే పంచ మకారాదులను౪ గ్రహించి సాధన నొనర్పనగును. ఇది త్రాచుతో చెలగాటమును బోలునది. రమణి తోడ నుండినను ఇంద్రియములు చలింపనివాడే వీరుడు. ఈ వీరసాధనను త్యజించియుగూడ తరువాతిస్థితి యగు దివ్యత్వము నందవచ్చును. దివ్యసాధకుని మనస్సు జగత్కారణమున లీనమగుటకుగాను, బాహ్యవస్తువులతో ప్రయోజనము లేదు. వీరాచారము నిర్దేశించు పూజాంగ, వస్తువులకు అనుకల్పములను గ్రహించి, సాధనాపథమున నడువవచ్చును. ఈ దివ్యభావమున సంప్రతిష్ఠుడై సిద్ధి నందిన మహాపురుషుడే కౌలపద వాచ్యుడు. ఇదియే ఉపనిషత్తులు వాకొను ముక్తావస్థ, శంకరుని సన్న్యాసము. ఈస్థితినే గీతలు స్థితప్రజ్ఞత్వ మనియు, యోగావస్థ యనియు, ఐకాంతికత్వ మనియు, గుణాతీతత్వ మనియు పేర్కొనుచున్నవి. మహాభారత కారుడు వచించు బ్రాహ్మణత్వమును, బౌద్ధజైన గ్రంథము లభివర్ణించు అర్హత్త్వమునుగూడ ఈవరుస లోనివే.

తంత్రము లీఉత్తమపదవిని ముఖ్యముగ శక్త్యుపాసనతోడనే పొందదగినదిగ నిరూపించుచున్నవి. ఇట్లని తదితర దేవమూర్తులను బహిష్కరించుచుండుట లేదు.౫ ఈ శక్తియే మహావిద్య. ఈమెకు పదిరూపములు లున్నవి. అవి కాళీ, తారా, షోడశీ, భువనేశ్వరీ, భైరవీ, బగళా, ఛిన్నమస్తా, త్రిపురసుందరీ, ధూమవతీ, మాతంగినీరూపముల లోకమున పూజింపబడుచున్నవి. కాళికాదేవి దక్షిణా, సిద్ధ, ఉగ్ర, గుహ్య, భద్ర, శ్మశాన, మహా, చాముండా రూపముల అర్చింపబడుచున్నది. తదితర విద్యల విషయమును ప్రస్తావించుట కిట తావుచాలదు.

వర్తమాన కాలమున భారతదేశమున వ్యాప్తి యందున్న హైందవమతమును పరీక్షించినచో తంత్ర ప్రభావ మెంతగ నున్నదో తెలియగలదు. ప్రత్యహము మనము దర్శనార్థము పోవు దేవాలయము లన్నియును ఆగమశాస్త్ర విధానము ననుసరించి నిర్మితము లైనవే. అందలి పూజ తంత్రోక్త విధానముననే అనుష

---

౧. వేద, వైష్ణవ, శైవ, దక్షిణ, సిద్ధాంత, వామ, అఘోర, (చీన)యోగ, కౌలాచారములు.

౨. వేధ, మను, క్రియాదీక్షలు.

౩. శాక్త, పూర్ణ, క్రమ, సామ్రాజ్య, మహాసామ్రాజ్య, యోగ, పూర్ణ, మహాపూర్ణాభిషేకములు.

౪. మద్య, మాంస, మత్స్య, ముద్రా, మైథున ములు.

౫. గురు, గణేశ, శివ, విష్ణు, దుర్గాదుల నర్చించిన పిమ్మటనే ప్రధానపూజను ఆరంభింపవలె నని నియమము.

రించుచున్నది. మన నిత్యపూజాకాల తంత్ర నియమములనే అనుసరించుచున్నది. అటు కాశ్మీరమునుండి ఇటు సేతుబంధమువఱకును, ఇటు ద్వారకనుండి అటు కామాఖ్యవఱకును గల ఏబదిరెండు పీఠస్థానములలో నిలచి ఆ పరదేవత హైందవులచే పూజింపబడుచున్నది.

సర్వమంగళమాంగళ్యే శివే సర్వార్థసాధికే,
శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణి నమోస్తుతే.

సవతిపోరు

= శ్రీ గుఱ్ఱప్పడియం ఆంజనేయులు =

బాల్యమాది మదీయభావప్రపంచ - రమ్యసామ్రాజ్యమున మహారాణి యగుచు
రాణమీఱిన కైతపూఁబోణి కిపుడు - సాహితీకన్యతో హెచ్చె సవతిపోరు.

ఎన్నఁడో మున్నె మనసారఁ గన్నుగీటి - వలచి వలపించుకొన్న దావన్నెలాఁడి ;
పండితోత్తమకీర్తికై పరుగులిడిన - తపమునకు వశ్యమైన దీతలిరుఁబోణి.

"చదువునకు మేటి"నన్న రాజసమునూని - కవితపైఁ బెత్తనము సల్పఁ గడఁగు నీమె;
"మధురమోహనజగదేకమాత" ననుచు - సాహితిని 'దాసి'యని పిల్వసాగు నామె.

కొదమపుప్పొడి నెగయించు కులుకునడలఁ - దిరుగు నెఱజాణయా సపత్నికి సపత్ని
యొజ్జయై వడి నియమమ్ము లుగ్గడింప - నగ్నిపయి గుగ్గిలము చల్లినట్టులయ్యె.

రుసరుసల జాడఁ బొడమిన రోషవల్లి - పదపదమ్మున ముంగాలిబంద మగుచుఁ
గాఁపురపు సొంపునకు నుఱిఁగట్టెఁ దుదకుఁ - జినికి చినికి తుపాను రేగినవిధాన.

కాటకపు గాటుపై నుపాకర్మమైన - యంతిపురిపోరునకు సంధి నభిలషింప,
వీని శిరసున నటునిటు విసరినారు - సారసాక్షులు మంగళాక్షతలు కొన్ని.

* * * *

కవిత:—

"చెదరినవి పూలమేడలు - కదియకుమా నన్ను ; మనసు గల్గినచోటన్
సదమదమై నూతేఁడులు - బ్రదుకుము ; చేకొనుము శుద్ధవైదికవృత్తిన్.

ఫణిరాజు నుడివిన భాష్యఘోషమె కాని రమణీయనవగీతరచన లేదు
బాదరాయణసూత్రపారాయణమె కాని సరససల్లాపచాతురిమ లేదు
సాంద్రశబ్దారణ్యసంచారమే కాని విపులభావోద్యానవిహృతి లేదు
తర్కబాధాసముద్రమున మున్గుటె కాని రసవాహినీస్నానరక్తి లేదు
గడ్డిగఱచుటయే కాని బిడ్డలున్న - సతి సజీవిత యన్న సంస్మరణ లేదు
నడుమ దొఱకిన యీనంగనాచి యిడిన - మందు నీతల కెక్క; నేమందు నింక ?"

సాహితి:—

"వేయిముంగిళ్లఁ బొఱలాడి, విఱ్ఱవీఁగి - దిక్కుమాలిన వలపుఁగత్తియకు లొంగి,
చొఱఁదగని సందుగొందులఁ జొచ్చు దొంగ - వేల ననుఁ గట్టుకొంటి? వోయీ! దుబాసి!

ఈవంక న్నటనమ్ము సేయ ఫల మున్నే నీకు ? నాపాలిటన్
దైవం బీగతి నుండ నన్యుల ననంగా నేల ? ముప్పోఁకలన్
దేవానాంప్రియమైన యూపలువతోనే యేఁగు మూరూర ; పో
పోవోయీ ! మొనగాఁడ ! చూపకము నీపోకిళ్లు నాచెంగటన్."

* * * *

గ్రాసవాసస్సమస్యల నోసరిల్లి - చెదరు మెదడున కినుమడించినది బెదరు ;
పానకపుఁ దేట నిడఁదగు పసిఁడిగిండ్లు - విడివడి తుపాకిరవ్వలు విడచునపుడు.

పెక మొగాలను ముడిచి, వెవ్వేఱు దెసల - మూల నొదిగిన గఱువ లిర్వురకు నడుమ
లోలకములాగు రాయబారాలు నడప - నవ్వుకొన్నారు నవతులు నన్నుఁ జూచి.



బిందుగారబ్బాయ్

[ఆఖ్యాయిక]

శ్రీ శరచ్చంద్రుని కృతి

= అనుకృతి: శ్రీ వేలూరి శివరామశాస్త్రి =

౧

మేడమెదటనుంచే బళ్లోకి వెళ్లే దారి. మెట్టమెదట కొన్నాళ్లపాటు గొడుగడ్డం పెట్టుకుని అనంతం ఈదారినే వెళ్లేవాడు. రెన్నాళ్లనుంచీ ఆయెత్రగొడు గీదార్లో వెళ్లడం లేదు. బిందువాసిని మేడమెట్లమీది గదిచాటున దారికేసి కళ్లు పారేసి కూచుంటూంది. చూచిచూచి ఆమెకళ్లు పగిలిపోతున్నై. పొద్దున తొమ్మిదిపదిగంటలప్పుడు ఎన్నోరకాల గొడుగులు మీద వేసుకుని ఎందరో పిల్లలాదారినే వెళ్లారు. బడి విడిచాక ఎందరో ఆదారినే వచ్చారు. ఆ నడకగాని, ఆ గొడుగుగాని బిందుకు కనబడలేదు. ఆమె సాయంకాలమప్పుడు కళ్లు తుడుచుకుని మేడ దిగి, నరహరిని చాటుగా పిలిచి—"బళ్లోకి సూటిగా పోయేదారి ఇదే కదూ! ఈదార్లో అతడు కనబడడేం?" అని అడిగింది.

నరహరి జవాబు చెప్పలేదు.

"సరేకాని, నరహరీ! మీ రిద్దరూ మాటా మంతీ చెప్పుకుంటూ ఈదారినే వెళితే బావుంటుంది. ఏం, బాగుండదూ?"

నరహరిథోరణిలో అనంతమంటే ప్రాణం. కాబట్టి మెలమెల్లగా — "వా డీదారి పోవడానికి సిగ్గుపడుతున్నా డత్తా! అల్లాల్లా తిరిగితిరిగి చుట్టుదారినే పోతున్నాడు." అని అన్నాడు.

బిందు కష్టమ్మీద నవ్వి—"సిగ్గెందుకు, ఎర్రి! ఈదారినే రమ్మని నీవు చెప్పు" అని అన్నది.

నరహరి తల తిప్పి—"ఇహ ఈదారిని రాకేం? అయితే ఎందుకు రాడో తెలుసా?" అని అన్నాడు.

బిందు కుతూహలంతో — "ఎందుకు" అని అడిగింది.

"నీకు కోపం రాదూ?"

"ఎర్రి, రాదు."

"ఈమాట వాళ్లయింటికి చెప్పంపవూ?"

"ఎర్రి, చెప్పంపను"

"మాఅమ్మకు చెప్పవూ?"

బిందువాసిని మరి ఆలస్యం సహించలేక— "ఎవ్వరికీ చెప్పన్రా!" అని అన్నది.

నరహరి మెల్లగా ఇల్లా అన్నాడు: "మాడ్లో పంతు లున్నాడే, ఆయన అనంతం చెవులు దిట్టంగా మెలేశాడు" అని అన్నాడు.

అనంగానే బిందు మండిపడి, "ఎందుకు మెలేశాడు? నేను ఒంటిమీద ఎన్నడూ చేయి వేయవద్దని చెప్పలా?"అని అన్నది.

నరహరి చేయి తిప్పి, "ఆయనకే ప్పేముం దత్తా? ఆయ నసలు కొత్తవాడు. మన నవుకరు ఈశుకెక్కగాడున్నాడే, వీడు పుంఢాకోర్. వాడొచ్చి మాఅమ్మకు చెప్పాడు. మాఅమ్మకూడా తక్కువ దనుకున్నా

నేమో, అది అంతకంటె ఫ్రంఘాకోర్. అది మూడో పంతులుగారికి కబురు పెట్టింది. ఆపళంగా పంతులు ఆ అస్తారం చూచుకుని వాడి చెవులు మెలి పెట్టాడు. ఎల్లా మెలిపెట్టా డనుకున్నా వత్తా! ఇదిగో, ఇల్లా లంకించుకుని—"

బిందు అక్కడి కాపించి, "సరేకాని ఉశక్కిగాడేమని చెప్పాడు?" అని అడిగింది.

"ఉశక్కిగాడు వాడు బళ్లోకి టిఫిన్ తెచ్చి పెటతాడుగా. మొన్న అలా వాడు తేగా చూచి అనంతం వాడగ్గిరికి పరుగెత్తుకొచ్చి 'ఏం తెచ్చావురో చూపు'అని అన్నాడు. ఉశక్కిగాడీసంగతి మా అమ్మకు చెప్పాడు. మాఅమ్మకు చెపితే అది 'వాడికి చూపకు, వాడు చూస్తే దిష్టి కొడుతుంది. ఈసంగతి పంతులుగారితో చెప్పు.' అని చెప్పంపింది."

బిందు "అనంతు కెవరూ టిఫిన్ పట్రావటల్లా?" అని అడిగింది.

వరహారి ఒకసారి మొహమ్మీద చేత్తో కొట్టుకుని "ఎక్కడినుం చొస్తుం దత్తా? పాపం, వాళ్లు పేదవాళ్లు. వాడు అటుకులు కాసిని జేబులో పోసుకొచ్చి చెట్ల చాటుకు పోయి అక్కడ కూచుని తింటాడు" అని అన్నాడు.

ఈమేడా, ఈమిద్దే, ఈసృష్టి సమస్తమూ బిందు వాసిని కళ్లముందు ఊగిసలాడిపోవడం మొదలుపెట్టింది. ఆమె అక్కడే కూలబడి, "వరహారీ! మంచిది, ఇహ నీవు పో" అని అన్నది.

ఆరాత్రి ఎన్నిసార్లో పిలిచాక బిందు విస్తరి ముందుకు పోయి కూచున్నదేకాని ముద్దమాత్రం ఎత్త లేకపోయింది. చిట్టచివరకి "ఒంట్లో యేమీ బాగా లే"దని చెప్పి విస్తరిముందునుంచి లేచి వెళిపోయింది. ఆ మరురోజుకూడా ఉపవాసం పడుకుంది. ఇంతే కాకుండా ఎవరితోనూ ఒక్కమాటకూడా మాటాడ లేకపోయింది. ఎంత వెతికినా ఆమెకు దారి దొరక లేదు. ఏమాటంటే తన తప్పు ఎక్కడెక్కువైపో తుందో నని భయమే ఆమెకు పట్టుకుంది. అపరాహ్ణ వేళ మగడు భుజించేటప్పుడు అలవాటు చొప్పున దగ్గిర కూచుండేకాని మొహంమాత్రం ఆతలికి తిప్పుకుని కూచుంది. నిన్నటినుంచీ ఆమెకు తినుబండాలను చూడడానికికూడా ఇష్టం తప్పింది.

ఇంట్లో దివ్వె వెలుగుతూంది. మాధవుడు కన్నులు ముకుళిస్తూ కూచుని వున్నాడు. బిందు వచ్చి కాళ్ల ముందర కూచ్చుంది. మాధవు డాదిచూచి "ఏమిటి?" అని అన్నాడు.

బిందు తల వంచుకుని మగని కాలిగోరు ఆడించటం మొదలుపెట్టింది.

మాధవు డామెమనస్సు కనిపెట్టి జాలిపుట్టి ఇలా అన్నాడు: "నాకు నీసంగతంతా తెలుసుగాని నీవు నాదగ్గర ఏడిస్తే ఏమి లాభం? ఆమెదగ్గరకు వెళ్లు."

బిందు నిజంగానే ఏడుస్తూంది. "మీరు వెళ్లండి" అని అన్నది.

"నేను నీతరఫున వెళ్లి మాటాడితే అన్నయ్య వినిపోదూ?"

బిందు ఆమాటకు జవాబు చెప్పక "ఇదిగో, నే నొప్పేసుకుంటున్నా. నాదే తప్పు, నేను క్షమాపణ కోరుతున్నా. మీరు పోయి చెప్పండి" అని అన్నది.

"ఆపని నాచేత కాదు" అని మాధవుడు పక్కకు తిరిగి పడుకున్నాడు.

మగడు వెళతా డనే ఆశతో బిందువాసిని మరి కొంతసే పక్కడ కనిపెట్టుకుని కూచుందిగాని అత డేమీ మాటాడకపోయేసరికి మెలమెల్లగా లేచి వెళిపోయింది. మగని వ్యవహారంవల్ల ఆమెకు చాలా కష్టమయింది. అది ఒక యోజనం పొడుగు కొండల్లే ఆమెహృదయంలో ఆమూలనుంచి ఈ మూలదాకా ఒక చిటికలో వ్యాపించింది. తన వందరూ పరిత్యాగం చేసేశా రని ఆమె కిప్పుడు నిస్సంశయంగా తెలిసిపోయింది.

మర్నాడు పొద్దున్నే యాదవుడు బిందువాసిని తండ్రిగారికి చాలా జబ్బుగా ఉన్న దనిన్నీ, ఆమెను వెంటనే పుట్టింటికి పంప మనిన్నీ తమ్ముడికి ఒక ఉత్తరం రాసి పంపాడు. బిందువాసిని కన్నీరు విడుస్తూ విడుస్తూ బండెక్కింది. పంపవచ్చిన కాత్యాయని—

"నాయనగారికి నిమ్మళం కాగానే రండమ్మా" అని అన్నది.

బిందు బండి దిగి ఆమెకు దణ్ణంపెట్టి చాలా చిన్నబోయింది. బిందు ఇల్లా నమస్కరించడమూ, ఇంత నమ్రంగా ఉండడమూ ఇదివరకెన్నడూ ఎవరూ చూడలేదు. బిందు ఇల్లా దణ్ణం పెట్టి, "నీ వెల్లాగయినా పెద్దదానవు. నన్ను దీవించు! ఏమనంటే—నేను మళ్లీ తిరిగిరాకుండానూ, ఈ వెళ్లడమే కడసారి వెళ్లటంగానూ దీవించు" అని అన్నది.

కాత్యాయని అందుకేమీ బదులు చెప్పలేక పోయింది. పసివాళ్లు వాడిన బిందువాసిని మొహం కేసి చూచి ఆమె బావురుమన్నది.

వేణమ్మ దగ్గరే ఉంది. "ఏమిటమ్మా, అంతా మహా? లోకంలో యెవరి తండ్రికీ జబ్బుచేయడం లేదూ?" అని గణగణమన్నది.

బిందు జవాబు చెప్పక ముఖం తిప్పుకుని కళ్లు తుడుచుకుంది. కొంచెంసేపు పాగి "మీకూడా నమస్కారాలు వదినెగారూ! నాకు సెలవు" అని అన్నది.

"వెళ్లవమ్మా వెళ్లు! నే నింట్లో సమస్తమూ సంబాళించుకుంటా" అని అన్నది.

బిందు మరి మాటాడక బండెక్కింది. బండివాడు గుర్రం తోలాడు.

కాత్యాయని ఈ సంగతంతా అన్నపూర్ణకు చెప్పింది. ఆమె విని ఊరుకుంది. బిందు ఇదివరకెన్నడూ అనంతుణ్ణి వదిలిపెట్టి పుట్టింటికి వెళ్లలేదు. ఇప్పుడతనిని చూచికూడా సెలవు పైగా కావచ్చింది. బిందుదుఃఖం అన్నపూర్ణకిప్పుడు తెలిసివచ్చింది.

రాత్రి తండ్రిదగ్గర పడుకుని అనంతు డామాటలూ ఈమాటలూ చెప్తున్నాడు. దీపపు వెలుగులో చూచుని గంతె కుట్టుకుంటూ హఠాత్తుగా నిట్టూర్చి అన్నపూర్ణ "దేవుడు డీగండం తప్పించాలి, దేవుడు డీగండం తప్పించాలి. ఈవెళ్లడమే కడసారి వెళ్లడం కావాలని చెల్లెప్పుడనుకుందిట! అమ్మవారు చల్లగా చూచి మా అమ్మను మళ్లా మాయింటికి తిన్నగా చేర్చాలి" అని అనుకుంది.

యాదవు డీమాటలు విని లేచి కూచుని "మొట్ట మొదటినుంచీ నీవు తిన్నగా చేశావుకావు. మాఅమ్మ స్వభావం మీ కెవరికీ దొరకబట్టలే"అని అన్నాడు.

అన్నపూర్ణ— "అదికూడా అక్కయ్య అనుకుంటూ ఒక్కసారి ఇక్కడికి వచ్చింది కాదు. తన కొడుకును బలవంతంగానయినా తీసుకోపోడానికి సమర్థురాలు; అలానయినా తీసుకోకుండా పోయింది. ఆనాడు పొద్దాకులూ పని చేసిచేసి తిరిగివస్తూంటే నాలుగుమాటలూ పెట్టింది. ఏం చెయ్యమన్నారు?" అని అన్నది.

"మాఅమ్మసంగతి నా కొక్కడికే తెలుసు. కాని నీవు మాఅమ్మను క్షమించలేకపోతే నీకు ఇన్ని ఏళ్లు వచ్చి యెందుకు? నీ వెటువంటివానివో మాధవుడుకూడా అటువంటివాడే. మీ రిద్దరూకలిపి మా అమ్మప్రాణాలు బంధించి వధచేసి పారేశారు"అని యాదవు డన్నాడు.

అన్నపూర్ణకన్నులనుండి జలజలా నీళ్లు రాలడం మొదలుపెట్టెయ్.

అనంతుడు "నాన్నా! అమ్మ రానని యెందుకు చెప్పిపోయింది?"అని అడిగాడు.

అన్నపూర్ణ కళ్లు తుడుచుకుని "మీఅమ్మదగ్గిరికి వెళతావూ?" అని అడిగింది.

అనంతుడు తల తిప్పి "వెళ్లను" అని అన్నాడు.

"ఎంచేత వెళ్లవురా! అమ్మ మీతాతయ్యగారింటికి వెళ్లింది. నీవుకూడా రేపు వెళ్లు" అని అన్నపూర్ణ అన్నది.

అనంతుడు మాటాడ కూరుకున్నాడు.

యాదవుడు "వెళతావా అనంతా"అని అడిగాడు.

అనంతుడు దిండుకింద తన తల కుక్కుకుని వెనుకటివలె తల తిప్పుతూ తిప్పుతూ "వెళ్లను" అని అన్నాడు.

బాగా పొద్దుండగానే యాదవుడు కచేరీ పనిలోకి వెళ్లడానికి తయారవుతూ వుంటాడు. ఈప్రసంగం జరిగిన అయిదారురోజుల తరువాత ఒకనాడు అతడు మామూలుగా లేచి కచేరికి వెళ

డానికి తయారై మతి పోయినట్లు కూచుని నల్లమందు వేసుకుంటున్నాడు.

"వేళ కావచ్చింది" అని అన్నపూర్ణ అన్నది.

యాదవుడు తొట్రుపడి నల్లమందు అక్కడ పెట్టి "ఇవ్వాళ నామనస్సేమీ బాగాలేదు. రాత్రి మాఅమ్మ వచ్చి ఆతలుపుచాటుగా నిలిచినట్లయింది. శివశివ" అని అనుకుంటూ అతడు కచేరీకి వెళ్లాడు.

అన్నపూర్ణ పొద్దుటిపూట వంటింట్లో అతికష్టంగా పని చేసుకుంటూవుండంగా మేడలోంచి నవుకరు వచ్చి—"చిన్నమ్మగారికి చాలా జబ్బుగా వుందిట! మరదిగారు చూడ్డానికి వెళ్లారు" అని చెప్పాడు.

ఈమాట వినంగానే యాదవు డన్న మాటలు అన్నపూర్ణకు గుర్తువచ్చాయి. ఆమె హృదయం కంపర మెత్తిపోయింది. ఆమె "ఏమి జబ్బురా" అని అడిగింది.

"ఆసంగతి తెలియదమ్మా! తెరపీమరపీగా ఉన్నదనిన్నీ, పెద్ద జబ్బేననిన్నీ మాత్రమే విన్నానమ్మా" అని నవుక రన్నాడు.

సంధ్యాసమయానికి ఇంటికి వచ్చి యాదవుడు ఈకబురు విని ఆవురుమని "నేను ఎంత సంబరపడి ఈ బంగారుబొమ్మను ఇంటికి తెచ్చుకున్నానో యెరుగుదువా? ఈ బొమ్మను నట్టేట్లో విడిచిపెట్టేశావా? ఆహా! నే నిప్పుడే అక్కడికి వెళ్లాలి" అని అన్నాడు.

దుఃఖంచేతా, పనిపాటలవల్ల కలిగిన ఆయాసంచేతా అన్నపూర్ణహృదయం బద్దలవుతూంది. అన్నపూర్ణ కవంతమీ(?)ద కంటెగూడా బిందువాసినిమీద ఎక్కువప్రేమ. అటువంటి అన్నపూర్ణ కళ్లు తుడుచుకుని మగనికి నీళ్లిచ్చి సంధ్యావందనం చేసుకోడానికి బలవంతంగా కూచోపెట్టి వరాండాలోకి వెళ్లి చీకట్లో కూలబడ్డది. కొంతసేపటికల్లా వాకట్లో మాధవుని మాట వినబడ్డది. అన్నపూర్ణ అతికష్టంగా ప్రాణాలు బిగబట్టుకుని చెవులలో వేళ్లు గట్టిగా కుక్కుకుని రాయల్లే కూచుంది.

మాధవుడు వంటిల్లంతా చీకటిగా ఉండడం చూచి పక్కగా తిరిగివస్తూ అంధకారంలో కూచుని వున్న అన్నపూర్ణను చూచి కుమ్కుస్వరంతో "బహుశా వినేఉంటారు" అని అన్నాడు.

అన్నపూర్ణ ముఖ మెత్తలేకపోయింది. మాధవుడు "అబ్బాయి ఇప్పుడు వెళ్లడం చాలా అవసరం. సమయం దగ్గిరికి వచ్చినట్లు కనిపిస్తుంది" అని అన్నాడు.

అన్నపూర్ణ మొహం నేలను తాకేటట్టు కింద పడిపోయి ఆవురుమన్నది. యాదవుడు పిచ్చివాడల్లే పరుగెత్తుకొనివచ్చి "అలా గెన్నడూ జరగదు మాధూ! అలా గెన్నడూ జరగదు. నే నెరిగికాని ఎరగకకాని యెవరికీ కష్టం కలిగించలేదు. భగవంతు డీవయస్సులో నాకిటువంటి శాస్తి యెన్నడూ చేస్తా డని అనుకోను" అని అన్నాడు.

మాధవు డేమీ అనలేదు. యాదవుడు "సంగతులన్నీ నాకు విప్పిచెప్పు. నేను వెళ్లి మాఅమ్మను తీసుకొస్తాను. నీ వేమీ గడబిడపడకు మాధూ! బండీ వాకట్లో ఉందా?" అని అన్నాడు.

"నేను గడబిడపడడం లేదు. మీరే కొంచెం పడుతున్నారు" అని మాధవు డన్నాడు.

"ఎబ్బె, నేనేం గడబిడపడడం లేదు. ఇదిగో నేవ్! లే! అనంతా, లేచి రా" అని యాదవు డనగా మాధవుడు "ఇప్పుడు వొద్దండీ, తెల్లారిన తరువాత—" అని అంటూవుండంగా యాదవుడు "కాదు కాదు, అలా వీలులేదు. నీవు ధైర్యం చెడగొట్టుకోకు మాధూ! బండీ పిలు! లేకపోతే నేను నడిచేవెళతా" నని అన్నాడు.

మాధవుడు మరి మాటాడక బండీ తీసుకొని వచ్చాడు. వలుగురూ ఎక్కి కూచున్నపిదప యాదవుడు "ఊఁ. తరువాత?" అని అన్నాడు.

మాధవుడు "నేనయితే లేను. సరిగ్గా నాకూ తెలియదు. నాలుగు రోజులు జ్వరం కాసిందిట! తరువాత మూర్ఛలు తరుచు రావడం మొదలుపెట్టినవిట! అటుపైని ఎవరుగాని మందు మింగించలేకపోంగా ఒక పాలచుక్కయినా తాగించలేకపోయారట! ఇప్పుడెల్లా వుందోకాని బతుకుతుం దని ఆశలేదు" అని అన్నాడు.

"ఆశ లేకపోవడ మేమిటి? కావలసినంత ఉంది. ముమ్మాటికీ ఉంది. మా అమ్మ బతికేఉంది. మాధూ! భగవంతు డీశేషవయస్సులో నానోటిమండి అబద్ధా లాడించడు. నే నింతవరకూ అబద్ధ మాడిఎరుగను" అని యాదవుడు గట్టిగా అన్నాడు.

మాధవుడు వంగి అన్నగారికి నమస్కరించి నిశ్శబ్దంగా కూచున్నాడు.

౬

బిందువాసిని అన్నం తినకుండా ఎన్నాళ్ల నుంచి చిక్కికొనివస్తోందో ఆసంగతి యెవరూ తెలుసుకోలేకపోయారు. పుట్టింటికి రాంగానే ఆమెకు జ్వరం ఆరంభమయింది. మరురోజు రెండుమూడుసార్లు మూర్ఛ వచ్చింది. ఆఖరుతడవ వచ్చిన మూర్ఛ మరి పోలేదు. అనేక ఉపాయాలు చేసిన తరువాత ఆమెకు తెలివి కలిగిందికాని నాడిమాత్రం కనబడలేదు. ఆ స్థితిలో మాధవు డక్కడికి వెళ్లగా బిందువాసిని మగనికి నమస్కారం చేసింది. అతడే పాలు నోట్లో పోయబోగా దంతాలు గట్టిగా బిగించుకుంది. ఎంత బతిమాలుకొన్నా ఒక్కచుక్కైనా మింగలేదు.

మాధవు డాశ వదులుకొని "ఆత్మహత్య ఎందుకు చేసుకుంటావ్?" అని అడిగాడు.

బిందు కళ్లు మూసుకుని పడుకుని వుంది. ఆ కనుగొలుకులలోనుంచి కన్నీరు ధారగా ప్రవహిస్తోంది. కొన్ని నిమిషాలు గడచినతరువాత ఆమె మెల్ల మెల్లగా "నాకున్నది యావత్తూ అబ్బాయి కివ్వండి. రెండు వేలుమాత్రం నరహరి కివ్వండి. అతడికి చదువు చెప్పించండి. అతనికి అనంతు అంటే ఇష్టం—"

మాధవుడు బలవంతంగా పళ్లు బిగించుకుని ఏడుపు ఆపుకున్నాడు.

బిందువాసిని మరికొంచెం దగ్గిరికి రమ్మని సైగ చేసి—"అనంతంతప్ప మరిఎవరూ నాకు కర్మ చేయగూడదు"అని అన్నది.

మాధవు డీదెబ్బకూడా తట్టుకొని "ఎవరినయినా చూడాలని ఉందా?"అని మెల్లమెల్లగా అడిగాడు.

బిందు తల తిప్పి "వొద్దొద్దు"అని అన్నది.

తల్లి వచ్చి ఒకసారి మందు ఈయబోగా బిందు పళ్లు బిగబట్టుకుని పడుకుంది.

మాధవుడు లేచి నుంచోని "అదేమిటి, అలా కూడదు. మామాట విన్నావుకాదుకాని ఎవరిమాటయితే నీవు తీసేయలేవో వారిని తీసుకురావడానికి పోతున్నాను. నేను తిరిగివచ్చేదాకామాత్రం ఇల్లా ఉండు! ఈ నామాట తీసెయ్యకు!"అని మాధవుడు వెలుపలికి వచ్చి కళ్లు తుడుచుకున్నాడు. ఆరాత్రి బిందువాసిని సుఖంగా నిద్రపోయింది.

అప్పుడే సూర్యోదయం అవుతున్నది. మాధవుడు గదిలోకి వెళ్లి దీపం ఆర్పి కిటికీతలుపులు తెరిచాడు. బిందు మొహమెత్తి తనయెదుట నున్న మగని మొహం చూచి మెత్తగా నవ్వి "ఎప్పుడొచ్చారు"అని అన్నది.

"ఇదే రావడం. మాఅన్నయ్య పిచ్చివాడిలాగు ఏడుస్తున్నారు."

"నా కాసంగతి తెలుసు! వారి పాదధూళేమయినా కొంచెం తెచ్చారా?" అని బిందు మెల్లగా అడిగింది.

"ఆయన వాకిట్లో అరుగుమీద కూచుని నల్లమందు వేస్తున్నారు. వొదినెగారు కాళ్లు కడుగుకుంటున్నారు. అనంతం ఇంకా నిద్దుర వదలలేదు. తీసుకుని వెళ్లి మేడమీద పడుకోపెట్టాను. ఇక్కడికి తీసుకురానా?" అని మాధవు డన్నాడు.

బిందు కొంచెంసేపు ధైర్యం చిక్కబట్టి, "వద్దు, కానేపు పడుకోనీండి!" అని మెలమెల్లగా పక్కకు తిరిగి మొహం అతలిపక్కకు పెట్టి పడుకుంది.

అన్నపూర్ణ గదిలోకి వెళ్లి మంచముమీద కూచుని తలమీద చేయి వేయగానే బిందు ఉలిక్కిపడ్డది. అన్నపూర్ణ రెండుమూడు నిమిషాలు తనను తానే సంబాళించుకుని "మం దెందుకు పుచ్చుకోడం మానేశావు చెల్లీ! చావాలనా?" అని అన్నది.

బిందు జవాబు చెప్పలేదు. అన్నపూర్ణ ఆమె